

# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



## లోకేష్ కృషి వల్లే ఏపీకి ఆర్సెలార్ మిట్టల్

- రూ.1,47,162 కోట్లతో ఉక్కు పరిశ్రమ
- లక్ష మంది యువతకు ఉద్యోగావకాశాలు
- మంత్రి టీజీ భరత్

8



## విశాఖ.. విజయవాడ మెట్రోకు నూరుశాతం సాయం చేయండి

కేంద్రమంత్రి ఖట్టర్‌తో సీఎం చంద్రబాబు భేటీ

2

ఏపీలో అత్యంత ప్రధానమైన విశాఖ, విజయవాడ నగరాల్లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ నివారణలో కీలకమైన మెట్రో రైలు ప్రాజెక్ట్‌లను ఆమోదించి నూరు శాతం ఆర్థిక సాయం అందించాలని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను సీఎం చంద్రబాబు కోరారు. దేశ రాజధాని ఢిల్లీలో గురువారం కేంద్రమంత్రి ఖట్టర్‌ను కలిసిన సీఎం చంద్రబాబు.. మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, పట్టణీకరణ సవాళ్లను పరిష్కరించడంలో ఈ ప్రాజెక్టుల ప్రాముఖ్యతను వివరిస్తూ నోట్ అందజేశారు.




## 2047నాటికి మనమే టాప్

- అగ్రస్థానంలో భారత ఆర్థిక వ్యవస్థ ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యం
- అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల్లో భారతీయులు
- కష్టకాలంలో వెంటఉన్న అందరికీ కృతజ్ఞతలు
- రిపబ్లిక్ ప్లీనరీ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు నాయుడు

2

## ఇది చదవాల్సిన చరిత్ర!

'ప్రపంచ చరిత్ర' పుస్తకావిష్కరణలో సీఎం చంద్రబాబు




- ప్రపంచ పోకడలను తెలుగులో అందివ్వడం అద్భుతం
- నా తోడల్లుడు దగ్గుబాటి మా కుటుంబంలో విశిష్టమైన వ్యక్తి
- సమాజానికి మంచి పుస్తకాన్ని ఇచ్చినందుకు అభినందనలు
- వెంకయ్యలో పవర్, పంచ్‌లు ఏమాత్రం తగ్గలేదు..
- నిర్మలా సీతారామన్ ఆర్థిక విధానాలకు ప్రజలనుంచి ప్రశంసలు
- ఆమె ప్రయాణం మహిళలకు స్ఫూర్తి దాయకం..
- భారత్‌ను బలమైన శక్తిగా మార్చడంలో ఆమె కృషి అమోఘం
- తెలుగుజాతి అగ్రప్రధాన ఉండాలన్నదే నా ఆశయం..
- లక్ష్యాలను సాధించి రాష్ట్ర భవిష్యత్‌ను మార్చాలన్నది నా కల
- ముఖ్య అతిథిగా ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

3




మంత్రి నారా లోకేష్ చొరవ..

## ప్రజల చేతిలో ప్రభుత్వం

- వాట్సాప్ ద్వారా సులభంగా పౌరసేవలు
- మనమిత్ర ద్వారా పౌరసేవలు 200 మైలురాయికి చేరిక
- వాట్సాప్ గవర్నెన్స్ దిశగా ఏపీ ప్రభుత్వం అడుగులు

4

## అమరావతిలో యోగా, ప్రకృతి వైద్య పరిశోధనా కేంద్రం

- రూ.100 కోట్లతో ఏర్పాటుకు సీఎం చంద్రబాబు అంగీకారం
- మంత్రి సత్యకుమార్ యాదవ్

7

## విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు చర్యలు

- స్కూల్ వెల్‌నెస్ టీమ్స్ ఏర్పాటు
- ఒత్తిడి, ఆందోళన తగ్గించేందుకు కౌన్సిలింగ్
- ప్రైవేటు యాజమాన్యాలపైనా బాధ్యత
- ఆత్మహత్యల నివారణకు అందరం కలిసికట్టుగా కృషిచేయాలి
- ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తాం
- మండలిలో సభ్యుల ప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానం

6



## వర్సిటీలను బలోపేతం చేస్తాం

- ఈ ఏడాదిలోనే ఖాళీల భర్తీ
- ఇండస్ట్రీకి అవసరమైన కరిక్యులమ్ తీసుకువస్తాం
- రీసెర్చ్, ఇన్నోవేషన్‌పై దృష్టిపెడతాం
- న్యాయవివాదాలకు తావులేకుండా పకడ్బందీగా డీఎస్సీ నోటిఫికేషన్
- మండలిలో మంత్రి నారా లోకేష్ వెల్లడి

4

## ఎన్టీఆర్ ట్రస్ట్.. సదా ఆపన్నుల సేవలోనే

- అభాగ్యులను ఆదుకునేందుకు ట్రస్ట్ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి
- సేవా కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకే విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఏర్పాటు
- తలసేమియా బాధితులకు అండగా నిలబడతాం
- ట్రస్ట్ నిర్వహణలో దాతలు, సిబ్బంది సహకారం మరువలేనిది
- ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఉద్ఘాటన
- విజయవాడలో ట్రస్ట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన



5

### అమరావతి నిర్మాణంలో..

## ప్రజల సొమ్ము పైసా కూడా ఖర్చు చేయం

- మంత్రి నారాయణ స్పష్టీకరణ
- అది ముమ్మాటికీ సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టే
- జగన్, వైసీపీ నేతలవి పిచ్చి ప్రేలాపనలు

8

చైతన్యరథం

# విశాఖ.. విజయవాడ మెట్రోకు నూరుశాతం సాయంచేయండి

## కేంద్రమంత్రి ఖట్టర్‌తో సీఎం చంద్రబాబు భేటీ





ఢిల్లీ (చైతన్య రథం): కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను సీఎం చంద్రబాబు ఢిల్లీలో కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబునాయుడు కేంద్రమంత్రితో చర్చించారు. విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులపై మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు, ఆర్థికవృద్ధిని పెంపొందించడానికి, పట్టణాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడానికి ఈ ప్రాజెక్టులు కీలకమైనవి. ఈ ప్రాజెక్టులను వెంటనే ఆమోదించి, ఆర్థిక సాయం అందించండి. మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, పట్టణీకరణ సవాళ్లను పరిష్కరించడంలో ఈ ప్రాజెక్టుల ప్రాముఖ్యతను వివరిస్తూ ఒక నోట్‌ను కేంద్రమంత్రికి సమర్పించారు. రాష్ట్ర విభజనకు ముందు హైదరాబాద్ మెట్రో రైలు ఆమోదించారు. విశాఖపట్నం, విజయవాడ ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని సీఎం తెలిపారు. కీలక పారిశ్రామిక కేంద్రమైన విశాఖపట్నంలో రోజురోజుకు ట్రాఫిక్ రద్దీ పెరుగుతోంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వచ్చే ఏడాది జూన్‌నాటికి పూర్తికానుందున, అప్పట్లోగా మెట్రో కారిడార్‌ను జాతీయ రహదారులతో అనుసంధానించడం ముఖ్యం. మొదటి దశలో ప్రధాన పట్టణ కేంద్రాలను అనుసంధానించడం లక్ష్యం. తర్వాత విమానాశ్రయం వరకు విస్తరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు.

రాజధాని అమరావతికి గేట్‌వేగా విజయవాడ మెట్రో వ్యవస్థ ఏర్పాటుతో ప్రాంతీయ కనెక్టివిటీని బలోపేతం చేయాలని నిర్ణయించాం. విజయవాడ పరిసరాల్లో ఆర్థికవృద్ధికి తోడ్పడటానికి ఇది అవసరం. నగరంలో పెరుగుతున్న రవాణా అవసరాలను తీర్చడానికి ఈ ప్రాజెక్టును ప్రాధాన్యమైనదిగా పరిగణించాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్ర విభజన తర్వాత ఆర్థిక ఇబ్బందులను ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటోంది.

మెట్రో ప్రాజెక్టులను స్వతహాగా నిర్మించే పరిస్థితుల్లో లేదు. రాష్ట్రాభివృద్ధిలో కీలకమైన ఈ రెండు మెట్రో రైలు ప్రాజెక్టులకు నూరుశాతం కేంద్ర సహాయాన్ని అందించాల్సిందిగా సీఎం కోరారు. సకాలంలో ప్రాజెక్టును గ్రౌండ్ చేసేందుకు ఫేజ్-1 అనుమతులు, భూసేకరణకు కేంద్రం మద్దతు ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తిచేశారు. ఈ ప్రాజెక్టులవల్ల వాయు కాలుష్యం తగ్గడమేగాక, ట్రాఫిక్ సమస్య పరిష్కారమై దీర్ఘకాలిక ఆర్థికవృద్ధికి దోహదపడుతుందని కేంద్రమంత్రి ఖట్టర్‌కు సీఎం చంద్రబాబు వివరించారు.

# 2047నాటికి మనమే టాప్



- అగ్రస్థానంలో భారత ఆర్థిక వ్యవస్థ
- ప్రధాని నరేంద్ర మోదీతూనే సాధ్యం
- అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల్లో భారతీయులు
- కష్టకాలంలో వెంటవున్న అందరికీ కృతజ్ఞతలు
- రిపబ్లిక్ ప్లీనరీ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు నాయుడు

న్యూఢిల్లీ (చైతన్య రథం): ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2047 నాటికి భారత్ నెం.1 ఆర్థిక వ్యవస్థగా మారుతుందని, ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో భారతీయులు ముందుంటారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జోస్యం చెప్పారు.భారతీయులను యూదు సమాజంతో పోలుస్తూ, ప్రపంచంలో అత్యంత సంపన్నులుగా, ప్రభావవంతమైన వ్యక్తులుగా ఉన్నారన్నారు. గురువారం ఢిల్లీలో రిపబ్లిక్ ప్లీనరీ సమ్మిట్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి పలు అంశాలపై మాట్లాడారు.

### భారతీయుల ప్రతిభ ప్రతిబింబిస్తోంది

ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రాంతాల్లో భారతీయులు సంపన్నులుగా ఉన్నారని, ఇది వారి ప్రతిభను ప్రతిబింబిస్తుందని సీఎం అన్నారు. అమెరికాలో భారతీయుల సగటు ఆదాయం మిగిలిన వర్గాలకంటే రెట్టింపని చెప్పారు. అత్యధిక తలసరి ఆదాయం కలిగిన భారతీయుల్లో 33 శాతం తెలుగు కమ్యూనిటీకి చెందినవారు ఉన్నారన్నారు. భారతదేశ వృద్ధికి ముఖ్యంగా మూడు రంగాలపై దృష్టి పెట్టినట్టు ముఖ్యమంత్రి వివరించారు. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ద్వారా బిటీనుంచి ఏఐకి మారడం... గ్రీన్ హైడ్రోజన్‌లో అభివృద్ధి సాధించడం... మానవ వనరులని బలోపేతం చేయడంపై తాము దృష్టి పెట్టామన్నారు. ఈ రంగాలపై దృష్టి సారించడంవల్ల భారతీయులు ప్రపంచంలోనే అత్యుత్తమ శ్రామికశక్తిగా, ఆవిష్కర్తలుగా మారతారన్నారు.

### భారతదేశానికి జనాభానే బలం

భారతదేశ జనాభాలో 65శాతం మంది 35 ఏళ్లలోపు ఉన్నందున, భారతదేశానికి జనాభా ప్రయోజనం ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. చైనా, జపాన్ జనాభా తగ్గడం భారతదేశానికి కలిసొచ్చే అంశమని.. దానిని దేశాభివృద్ధికి తెలివిగా వినియోగించుకోవాలని చెప్పారు. ఇద్దరు పిల్లలకంటే తక్కువ ఉన్న అభ్యర్థులు స్థానిక ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హులని చేసే విధానంపై కేంద్రం ఆలోచన చేయాలని సూచించారు.

### అమరావతి పునర్నిర్మాణం

గత కొన్నేళ్లుగా ఒడిదుడుకులను ఎదుర్కొన్న ఏపీ రాజధాని అమరావతిని పునరుజ్జీవింపజేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రపంచంలోనే ప్రత్యేకమైన సెల్ఫ్ ఫైనాన్సింగ్ మోడల్‌ను ఉపయోగించి 29,000మంది రైతుల దగ్గర నుంచి 35,000 ఎకరాల భూమిని రాజధాని కోసం సేకరించారని గుర్తు చేశారు. ప్రపంచంలోనే అత్యుత్తమ రాజధాని నగరాల్లో ఒకటిగా అమరావతిని తీర్చిదిద్దుతామని, దానిని మళ్లీ గాడిలోకి తీసుకువస్తామని చెప్పారు.

### చారిత్రాత్మక విజయం

2024 ఎన్నికల్లో టీడీపీకి 93శాతం స్ట్రైక్‌రేట్, 57శాతం ఓట్ షేరును సాధించిందని ముఖ్యమంత్రి అన్నారు. తన నాయకత్వానికి ప్రజలు బలమైన మద్దతును ఇచ్చారన్నారు. తాను ఎలాంటి నేరం చేయకుండా అరెస్టు చేస్తే, ప్రజలంతా ఆ సమయంలో తనకు అండగా నిలిచారని గుర్తు చేశారు. గవర్నెన్స్ అంటే కేవలం హార్డ్‌వర్క్ మాత్రమే కాకుండా తెలివిగా ఉండాలని, 1,000 సేవలను మీ సేవ - వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందిస్తున్నామని అన్నారు.

### భారతదేశం ముందున్న మార్గం?

భారతదేశ అభివృద్ధిని ఆపలేమని చంద్రబాబు అన్నారు. రానున్న 10-15 ఏళ్లలో భారతీయ నిపుణులు సేవా రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఆధిపత్యం చెలాయిస్తారని అంచనా వేశారు. నేటి ప్రపంచంలో దూరం అనేది ఒక పరిమితి కాదని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు.

# 'చరిత్రంటే గతం కాదు... భవిష్యత్‌కు దిక్సూచి'

అమరావతి (చైతన్య రథం): దగ్గుబాటి వెంకటేశ్వరరావు రాసిన 'ప్రపంచ చరిత్ర' పుస్తకావిష్కరణకు హాజరైన సీఎం చంద్రబాబునాయుడు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఎక్స్ వేదికపై పోస్టు పెట్టారు. 'విశాఖలో గురువారం మా తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు రాసిన 'ప్రపంచ చరిత్ర' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నాను. ఎంతో ఆహ్లాదకరంగా జరిగిన కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి ఎంయ వెంకయ్యనాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి పాల్గొనడం ఆనందాన్నిచ్చింది. ఎంతో అధ్యయనంతో రచయిత ఈ పుస్తకాన్ని తీసుకొచ్చారు. చరిత్ర అంటే గతం కాదు... చరిత్ర అంటే మన భవిష్యత్‌కు దిక్సూచి అని నేను భావిస్తాను. ప్రతి ఒక్కరికీ చరిత్ర, వాస్తవాలు తెలియాల్సిన అవసరముంది. ముఖ్యంగా రాజకీయాల్లో ఉండి కోట్లమంది జీవితాలను ప్రభావితం చేసే వారికి చరిత్ర తెలిస్తే.... ప్రజల భవిష్యత్‌ను మార్చే నిర్ణయాలు తీసుకోగలరు.



బాధ్యతతో ఉండి ప్రజలకు మంచి చేయగలరు. అటువంటి చరిత్ర గురించి చెప్పే గొప్ప పుస్తకాన్ని తెచ్చిన వెంకటేశ్వరరావుకి, కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన ఎంపి పురందరేశ్వరికి అభినందనలు. ఎన్నో పుస్తకావిష్కరణలకు, కార్యక్రమాలకు హాజరైనా....ఈ రోజు మా కుటుంబ సభ్యుల్లో విశిష్ట వ్యక్తిగా ఉన్న వెంకటేశ్వరరావు రాసిన పుస్తకావిష్కరణలో పాల్గొనడం నాకు మిక్కిలి సంతృప్తిని, సంతోషాన్నిచ్చింది' అంటూ ఆ పోస్టులో పేర్కొన్నారు.


# దొరైస్వామినాయుడు మృతికి సీఎం చంద్రబాబు సంతాపం

అమరావతి (చైతన్య రథం): చిత్తూరు జిల్లా గర్వించదగ్గ ముద్దుబిడ్డ, దార్శనిక విద్యావేత్త ప్రొఫెసర్ ఎంఆర్ దొరైస్వామినాయుడు ఇక లేరన్న సమాచారం బాధాకరం.దొరైస్వామినాయుడు లేనిలోటు తీర్చలేనిదే' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ పీఇఎస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ వ్యవస్థాపకుడిగా, ఆయన విద్యకు విశేష కృషి సలిపారని కొనియాడారు. ప్రజాసేవకు కట్టుబడిన వ్యక్తిగా ప్రశంసించారు. నా అభ్యర్థన మేరకు కుప్పంలో పిఇఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (పిఇఎస్ఐఎంఎస్ఆర్)ను స్థాపించారని, అది నేడు ప్రముఖ వైద్యసంస్థగా నిలుస్తోందని గుర్తు చేసుకున్నారు. విద్య మరియు ప్రజాసేవలో ఆయన వారసత్వం తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని కాంక్షించారు. ఆయన కుటుంబం, స్నేహితులు మరియు ఆయన తాకిన లెక్కలేనన్ని జీవితాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక సంతాపం ప్రకటించారు.

చైతన్యరథం

# ఇది చదవాల్సిన చరిత్ర!

- ‘ప్రపంచ చరిత్ర’ పుస్తకావిష్కరణలో సీఎం చంద్రబాబు
- ప్రపంచ పోకడలను తెలుగులో అందివ్వడం అద్భుతం
- నా తోడల్లుడు దగ్గుబాటి మా కుటుంబంలో విశిష్టమైన వ్యక్తి
- సమాజానికి మంచి పుస్తకాన్ని ఇచ్చినందుకు అభినందనలు
- వెంకయ్యలో పవర్, పంచ్‌లు ఏమాత్రం తగ్గలేదు..
- సీతారామన్ ఆర్థిక విధానాలకు ప్రజలనుంచి ప్రశంసలు
- ఆమె ప్రయాణం మహిళలకు స్ఫూర్తి దాయకం..
- భారత్‌ను బలమైన శక్తిగా మార్చడంలో ఆమె కృషి అమోఘం
- తెలుగుజాతి అగ్రప్రథాన ఉండాలన్నదే నా ఆశయం..
- లక్ష్యాలను సాధించి రాష్ట్ర భవిష్యత్‌ను మార్చాలన్నది నా కల
- ముఖ్య అతిథి ప్రసంగంలో ముఖ్యమంత్రి చంద్రబాబు




విశాఖపట్నం (చైతన్య రథం): కొన్నివేల సంవత్సరాల మానవ పరిణామక్రమాన్ని, ప్రపంచ చరిత్రను పుస్తక రూపంలో తెలుగులో రచించడం అద్భుత ప్రయత్నం. చరిత్రను ప్రతి ఒక్కరూ చదవాలి. దగ్గుబాటి వెంకటేశ్వరావు పుస్తకం రాస్తారని నేను అనుకోలేదు. స్వతహాగా రచయిత కానటువంటి రచయిత దగ్గుబాటి వెంకటేశ్వరరావు. ఎవరూరాయని విధంగా పుస్తకాన్ని రాశారు. ప్రతి ఇల్లు, ప్రతి లైబ్రరీలో ప్రపంచ చరిత్ర పుస్తకం ఉండాలి’ అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మాజీమంత్రి, మాజీ ఎంపీ దగ్గుబాటి వెంకటేశ్వరరావు రచించిన ప్రపంచ చరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమం విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీమంత్రి దగ్గుబాటి వెంకటేశ్వర రావు రాసిన పుస్తకాన్ని సమయం కుదుర్చుకుని పూర్తిగా చదువుతానని ప్రకటించిన సీఎం చంద్రబాబు, ‘ప్రపంచ చరిత్ర’నుంచి తెలుసుకోవాల్సిన విషయాలు ఎన్నో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ.. నాటి ఆచారాలు, ఆహారపు అలవాట్లు, వ్యవసాయంవంటి అంశాలను పుస్తకంలో పొందుపరిచారు. లోతుకువెళ్లి, సాధించాలనే తపన ఉంటేనే పుస్తకం రాయడం సాధ్యమవుతుంది. యుద్ధాలు, సామ్రాజ్యాల ఆవిర్భావం, మతపెద్దల పెత్తనాలు, ఖండాల విభజన, బానిస వ్యవస్థ, అభివృద్ధి.. ఇలా ఏ విషయాన్నీ వదిలిపెట్టకుండా పుస్తకంలో వెంకటేశ్వరావు ప్రస్తావించారు. భాష కళలు, వాస్తు, శిల్పం, భూ సంస్కరణలు, సామాజిక న్యాయం, భూస్వామ్య వ్యవస్థ, రాజులతోపాటు ఏపీలో ప్రజాపాలన గురించీ వివరించారు. అచ్చుయంత్రం, సాంకేతిక విప్లవం, భవిష్యత్తులో ఏంజరుగుతోందో కూడా ముందుగానే ఊహించి తెలిపారు. ఇలాంటి మంచి పుస్తకం రాసిన వెంకటేశ్వరావును అభినందిస్తున్నాను. పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆత్మీయ సమ్మేళనంగా ఉంది. మా కుటుంబం నుంచి మంచి రచయిత అధ్యయనం చేసి పుస్తకాన్ని సమాజానికి అందించారు’ అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

## నా తోడల్లుడు మా కుటుంబంలో విశిష్టమైన వ్యక్తి

దగ్గుబాటి వెంకటేశ్వరరావు నాకు తోడల్లుడు. మా కుటుంబంలో ఒక విశిష్టమైన వ్యక్తి. ప్రతి అంశాన్నీ లోతుగా ఆలోచిస్తారు. మేమిద్దరం ఒక స్ఫూర్తినిచ్చే ఎన్టీఆర్ దగ్గర ఓనమాలు నేర్చుకున్నాం. ఎన్టీఆర్ మాకు అప్పగించిన బాధ్యతలు నిర్వర్తించేవారం. వెంకటేశ్వరరావు డాక్టరు... డాక్టరు చేశాక ప్రాక్టీస్ చేయాలి. కానీ మంత్రిగా ఉండి (నవ్వుతూ) డాక్టర్‌గా ప్రాక్టీస్ చేశారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, పార్లమెంట్ సభ్యునిగా పనిచేశారు. అందరం ఏదోకచోట తిరగాలని అనుకుంటాంగానీ.. పుస్తకం రాయాలని అనుకోం. మా కుటుంబంలో వెంకటేశ్వరరావు రిలాక్స్‌గా, జోవియల్‌గా ఉంటారు. ఇటీవల నన్ను కలిసినప్పుడు ఆయన్ను చూసి కొన్ని అనుమానాలను గురించి ప్రస్తావించాను. ఏవిధంగా సమయం గడిపి సంతోషంగా ఉంటున్నారని ప్రశ్నించాను. దానికి వెంకటేశ్వరరావు సమధానం చెప్తూ.... ఉదయం బ్యాడ్మింటన్ ఆడుతాను. పిల్లలతో కాసేపు ఆడుకోవడం, స్నేహితులతో మాట్లాడటం, సాయంత్రం ఇంట్లో పిల్లలకు కథలు చెప్పి నిద్రపోతానని చెప్పారు. పేకాట కూడా ఆడతానని (నవ్వులు చిందిస్తూ) చెప్పారు. ఇప్పటికి వెంకటేశ్వరావు ఐదు పుస్తకాలు రాశారు. మొదటి పుస్తకం ఒక చరిత్రలో కొన్ని నిజాలు అని రాశారు. తర్వాత తెలుగువారి చరిత్ర-వేర్పాటువాదం, ప్రపంచతత్వం- నాయకత్వం, ప్రపంచ దేశాలు- పాలనా వ్యవస్థల అనే పుస్తకాలు రచించారు. ఇప్పుడు ప్రపంచ చరిత్ర పుస్తకం రాశారు. అగ్రదేశాలన్నీ యువరక్తం లేక బాధపడుతున్నాయి. టెక్నాలజీ ఉంది. కానీ ఆపరేట్ చేసే మనుషులు లేని పరిస్థితి తలెత్తింది. కానీ భారతదేశం అదృష్టదేశం. మన దేశానికి కావాల్సినంత యువశక్తి ఉంది. చరిత్రను సృష్టించే అదృష్టం భారతదేశానికి వచ్చింది’ అని సీఎం చంద్రబాబు అన్నారు.

## వెంకయ్యనాయుడులో పవర్, పంచ్‌లు తగ్గలేదు

‘1978లో నేను, వెంకయ్య నాయుడు ఎమ్మెల్యేలుగా మొదటిసారి గెలిచాం. అప్పటికీ ఇప్పటికీ ఆయన పవర్ తగ్గలేదు. పంచులు పెరుగుతున్నాయి. ఎప్పుడూ అచ్చతెలుగులో మాట్లాడుతుంటారు. చిన్నకుంటుంబలో పుట్టి అంచలంచలుగా ఎదిగి ఉపరాష్ట్రపతి అయ్యారు. గీతం యూనివర్సిటీని గతంలో కూల్చాలని చూశారు. ఎంవీవీస్ మూర్తి ఒక చరిత్ర సృష్టించారు. గీతం యూనివర్సిటీని ఎందుకు నెలకొల్పాల్సి వచ్చిందని ఒకసారి అడిగాను. మా రెండో అబ్బాయికి కాలేజీలో సీటు ఇవ్వలేదు. అందుకే మంచి వ్యవస్థను పెడతానని ఛాలెంచ్ చేసి గీతం యూనివర్సిటీని పెట్టానని ఆయన నాకు చెప్పారు’ అని సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు.



## ఆత్మస్థయిర్యాన్ని పోగొట్టుకోవడానికి సిద్ధంగా లేను

ఆర్థిక సంస్కరణలు 1991లో వచ్చాయి. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారు. గతంలో అమెరికా బెస్ట్ అనేవారు. ఇప్పుడు ఇండియన్స్ బెస్ట్ అంటున్నారు. అందులో తెలుగువారు అగ్రభాగాన ఉన్నారు. అశ్రద్ధ లేకుండా కష్టపడితే వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర విజన్ సాకారమవుతుంది. నాలోని ఆత్మస్థయిర్యాన్ని పోగొట్టుకోవడానికి నేను సిద్ధంగా లేను. నాలో ఓవర్ కాన్ఫిడెన్స్ ఉందని వెంకయ్యనాయుడు అన్నారు. ఓవర్ కాన్ఫిడెన్స్ మాత్రమే కాదు... బలమైన నమ్మకముంది. దేశాన్ని మోదీ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చాలనుకున్నప్పుడు నా తెలుగుజాతి అగ్రభాగాన ఉండాలన్నది నా ఆశయం’ అని సీఎం ఉద్ఘాటించారు.

## ఇంకొంత ట్రీట్మెంట్ అవసరం

మగవారికంటే మహిళలు బాగా పని చేస్తారు. నిర్మలా సీతారామన్ ఒక సాధారణ కుటుంబంలో జన్మించారు. బీజేపీలో ఒక్కో మెట్టు ఎక్కుతూ ఎదిగారు. 2014లో మొదటిసారి రాజ్యసభకు ఎంపీగా ఏపీనుంచి ఎంపికై కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. నరేంద్రమోదీ ఆశయాల కోసం నిరంతరం పని చేస్తున్నారు. ప్రజలు మెచ్చుకునే ఆర్థిక మంత్రిగా కార్యక్రమాలు చేపట్టారు. వరుసగా 8వసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2014నాటికి 10వ స్థానంలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థను 5వ స్థానానికి తీసుకొచ్చారు. భవిష్యత్తులో 3వ స్థానానికి వస్తుంది. దీనికి మనమంతా అభినందించుకోవాల్సి ఉంది. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన మందులతో వెంటిలేటర్‌పై నుంచి బయటపడగలిగాం. పూర్తిగా కోలుకోవాలంటే ఇంకా కొంత చికిత్స అవసరం. రాష్ట్రాభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహకరిస్తున్నారు’ అని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.







## మంత్రి నారా లోకేష్ చొరవ..

# ప్రజల చేతిలో ప్రభుత్వం

- వాట్సాప్ ద్వారా సులభంగా పౌరసేవలు
- మనమిత్ర ద్వారా పౌరసేవలు 200 మైలురాయికి చేరిక
- వాట్సాప్ గవర్నెన్స్ దిశగా ఎపి ప్రభుత్వం అడుగులు




అమరావతి (చైతన్యరథం): పౌరసేవలను మరింత సులభతరంగా ప్రజలకు అందించేందుకు మంత్రి నారా లోకేష్ వినూత్న ఆలోచనతో ఏపీ ప్రభుత్వం ప్రారంభించిన వాట్సాప్ గవర్నెన్స్ విజయవంతంగా ప్రజలకు సేవలందిస్తోంది. ఈ ఏడాది జనవరి 30వ తేదీన మంత్రి లోకేష్ చేతులమీదుగా దేశంలోనే తొలిసారిగా 161 రకాల పౌరసేవలను వాట్సాప్ ద్వారా అందించేందుకు ప్రారంభించిన మనమిత్ర... కేవలం 50 రోజుల్లోనే 200 సేవలు అందించే అద్భుతమైన మైలురాయి సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ గవర్నెన్స్ శక్తికి ఇదో నిదర్శనంగా చెప్పొచ్చు. పౌరసేవలను సమర్థవంతంగా, సులభతరంగా అందుబాటులోకి తేవడం ద్వారా ప్రజలకు సౌలభ్యంతో పాటు పాలనలో పారదర్శకతను పెంచే లక్ష్యంతో మంత్రి లోకేష్ గత ఏడాది అక్టోబర్ 22న ఢిల్లీలో మెటా ప్రతినిధులతో ఏపీ ప్రభుత్వం తరపున ఒప్పందం చేసుకున్నారు. ప్రజలు వివిధ రకాల పౌరసేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా చేసేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇటీవల టెన్త్, ఇంటర్ విద్యార్థులు తమ హాల్ టిక్కెట్లను సైతం వాట్సాప్ ద్వారా పొందగలిగారు. మన మిత్ర నెం. 9552300009కు వాట్సాప్ సందేశం పంపడం ద్వారా ప్రస్తుతం 200 రకాల పౌర సేవలను ఏపీ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.

అందులో విద్య, దేవాదాయ, విద్యుత్, ఆర్టీసీ, రెవెన్యూ, అన్న క్యాంటీన్, సీఎంఆర్ఎఫ్, మున్సిపల్ శాఖల సేవలు కూడా ఉన్నాయి. విద్యుత్తు బిల్లులు, పన్నుల చెల్లింపుల వంటి సేవలతో పాటుగా దేవాలయాల్లో దర్శనాలు, వసతి గదుల బుకింగ్, విరాళాల సమర్పణకు ఇది ఉపయోగపడుతోంది. అలాగే పర్యాటక ప్రదేశాల సమాచారం, టికెట్ బుకింగ్ వంటివి ఈ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సులభంగా చేసుకోవచ్చు. రెవెన్యూ శాఖకు సంబంధించిన భూ రికార్డులు, ఆదాయ ధ్రువీకరణ వంటి సర్టిఫికెట్లు కూడా సులభంగా పొందొచ్చు. అధునాతన సాంకేతికత వినియోగం ద్వారా పౌరసేవలను ప్రజల ఇంటిముంగిటికే తీసుకెళ్లడం విప్లవాత్మకమైన పరిణామం. వాట్సాప్ బిజినెస్ సర్వీస్ డెలివరీ ప్లాట్ ఫాంగా పలురకాల పౌరసేవలను ప్రజలకు అందిస్తుంది. మూడు ప్రాథమిక నమూనాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి డెలివరీ ప్లాట్ ఫాంగా వాట్సాప్ సేవలను అందించే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం మెటాతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో 1). జీ టూ సీ (ప్రభుత్వం నుండి పౌరులకు), 2).బీ టూ సీ (వ్యాపారం నుండి వినియోగదారునికి) 3). జీ టూ జీ (ప్రభుత్వం నుండి ప్రభుత్వానికి). ఈ మేరకు తొలి విడతలో పౌరసేవలు అందుబాటులోకి వచ్చాయి. రాబోయే రోజుల్లో వాణిజ్యరంగంలో సమర్థవంతమైన ప్రభుత్వ సర్వీస్ డెలివరీ కోసం రీ ఇంజనీరింగ్ ప్రక్రియ ద్వారా మనమిత్ర సేవలు అందుబాటులోకి వస్తాయి. ఆ తర్వాత ప్రభుత్వశాఖల అంతర్గత కార్యకలాపాలకు సైతం దీనిని వినియోగిస్తారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఎటువంటి అవాంతరాలు లేకుండా వేగవంతంగా ప్రజలకు ప్రభుత్వసేవలు అందనున్నాయి.

### ఇదో మైలురాయి: మంత్రి లోకేష్

మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ సేవలు 200కు పెంచినట్టు విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ ఏడాది జనవరిలో 161 సేవలతో ప్రారంభించిన 'మనమిత్ర' అనతి కాలంలోనే 200 సేవలు అందించే అద్భుతమైన మైలురాయి సాధించిందన్నారు. ఏపీలో డిజిటల్ గవర్నెన్స్ శక్తికి ఇదో నిదర్శనమని చెప్పారు. పౌర సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావడం, సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రజలకు సౌలభ్యం, పారదర్శకతను పెంచుతుందని అభిప్రాయపడ్డారు. సామాన్యుల ప్రయోజనం కోసం పౌర, కేంద్రీకృత సేవలను తాము విస్తరిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. మన మిత్ర కోసం 9552300009కు సందేశం పంపాలని సూచించారు.

---

# వర్సిటీలను బలోపేతం చేస్తాం

- ఈ ఏడాదిలోనే ఖాళీల భర్తీ
- ఇండస్ట్రీకి అవసరమైన కరిక్యులమ్ తీసుకువస్తాం
- రీసెర్చ్, ఇన్నోవేషన్‌పై దృష్టిపెడతాం
- న్యాయవివాదాలకు తావులేకుండా పకడ్బందీగా డీఎస్సీ నోటిఫికేషన్
- మండలిలో మంత్రి నారా లోకేష్ వెల్లడి



అమరావతి (చైతన్యరథం): విశ్వవిద్యాలయాలను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. సాంకేతిక విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య, ఉద్యోగుల వివరాలు, ఖాళీల భర్తీ, యూనివర్సిటీల అభివృద్ధిపై శాసన మండలిలో గురువారం సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ.. ఏపీలో జీఈఆర్(గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్) రేషియో 36.5 శాతం, ఢిల్లీ 49 శాతం, తమిళనాడులో 47శాతంగా ఉంది. రాష్ట్రంలో చిత్తూరు, గుంటూరులో 45శాతం కంటే ఎక్కువగా ఉంది. అనంతపూర్, కర్నూలు, శ్రీకాకుళంలో 30 నుంచి 35 శాతం మధ్య ఉంది. మహిళల విషయానికి స్టెమ్ కోర్సుల్లో తక్కువగా ఉన్నారు. పేటెంట్ ఫైలింగ్స్ విషయానికి వస్తే రాష్ట్రంలో కేవలం 1,400 మాత్రమే పేటెంట్ ఫైలింగ్స్ జరిగాయి. కానీ తమిళనాడులో 7,600 పేటెంట్ ఫైలింగ్స్ జరిగాయి. విశ్వవిద్యాలయాలకు వస్తే ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ లో మనం 9వ స్థానంలో ఉన్నాం. పీహెచ్‌డీ విద్యార్థుల విషయానికి వస్తే ఏపీలో 5,600 మంది ఉంటే.. తమిళనాడులో 29వేల మంది ఉన్నారు. ప్రస్తుతానికి మనవద్ద ఎలాంటి ట్రాకింగ్ మెకానిజం కూడా లేదు. విద్యార్థుల ప్లేస్‌మెంట్స్, జీతాలేంటే వివరాలు లేవు. అలాంటి పరిస్థితుల్లో 2014లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని అమరావతిని ప్రకటించారు. అభివృద్ధి వికేంద్రీకరణ నినాదంతో పనులు మొదలుపెట్టాం. అందులో భాగంగా అనంతపూర్‌కు కియా వచ్చింది. చిత్తూరు, కడపకు ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లు వచ్చాయి. కర్నూలుకు రెన్యువబుల్ ఎనర్జీ వచ్చింది. ఇప్పుడు డ్రోన్ సిటీ కూడా రాబోతోంది. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలంటే.. అక్కడున్న ఐటీఐలు గాని, పాలిటెక్నిక్‌లు గాని చాలా ఫోకస్డ్‌గా కరిక్యులమ్ తీసుకురావాల్సిన అవసరం ఉందని మంత్రి లోకేష్ అన్నారు.

### ఇండస్ట్రీ లైక్ కరిక్యులమ్ తీసుకువస్తాం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లీప్(లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఏపీ) పేరుతో సెక్టర్స్ స్పెసిఫిక్ ఇన్‌స్టిట్యూషన్స్‌పై దృష్టి పెట్టి కాలేజీలు, పాలిటెక్నిక్‌లు, ఐటీఐ, యూనివర్సిటీలతో క్లస్టరింగ్ చేయాలని నిర్ణయం తీసుకున్నాం. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు సాధించేలా కరిక్యులమ్ తీసుకురానున్నాం. పరిశ్రమలతో అనుసంధానం కావాలని అందరికీ చెబుతున్నాం. పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీతో మాట్లాడినప్పుడు కంప్యూటర్ సైన్స్ సీట్లు అన్నీ భర్తీ అవుతున్నాయి.. లాంగ్వేజెస్, ఆర్ట్స్ సీట్లు భర్తీ కావడం లేదు.. విద్యార్థులు వీటిపై శ్రద్ధ చూపించడం లేదని చెప్పారు. ఇటీవల మొన్న మా పదో తరగతి మిత్రులతో కలిసినప్పుడు 42 మందిలో ఇద్దరు ఇతర దేశాల్లో లాంగ్వేజెస్‌పై రీసెర్చ్ చేస్తున్నారు.. లాంగ్వేజెస్‌కు సంబంధించిన వర్క్ చేస్తున్నారని చెప్పారు. అన్నింటినీ పరిశ్రమలతో అనుసంధానిస్తాం. ఇంటర్న్‌షిప్ వర్క్ బేస్డ్ లెర్నింగ్ తీసుకువస్తామని మంత్రి లోకేష్ వివరించారు.

### ఈ ఏడాదిలోనే విశ్వవిద్యాలయాల్లో ఖాళీల భర్తీ

యూనివర్సిటీల్లో ఖాళీలు ఉన్నమాట వాస్తవం. ఈ ఏడాది ఖాళీలన్నీ భర్తీ చేయాలని నిర్ణయం తీసుకున్నాం. వన్ మ్యాన్ కమిషన్ రిపోర్ట్ వచ్చిన వెంటనే ఆ ప్రక్రియ కూడా ప్రారంభిస్తాం. ప్రొఫెసర్స్ ఆఫ్ ప్రాక్టీస్ విషయానికి వస్తే పరిశ్రమ నిపుణులతో ప్రాక్టీషనర్స్ పాఠాలు చెబితే బాగుంటుందని భావిస్తున్నాం. అక్రిడేషన్, క్వాలిటీ అస్యూరెన్స్ కూడా చాలా అవసరం. అది కూడా తీసుకువస్తున్నాం. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్.. కెపాసిటీ బిల్డింగ్, వారికి కావాల్సిన ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్ వంటివన్నీ ఏర్పాటుచేయాలని నిర్ణయించాం. డిజిటల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేస్తామని మంత్రి లోకేష్ తెలిపారు.

### రీసెర్చ్, ఇన్నోవేషన్‌పై దృష్టి

రీసెర్చ్, గ్లోబల్ అవుట్ రీచ్ విషయానికి వస్తే.. రీసెర్చ్ విషయంలో మనం చాలా వెనుకబడి ఉన్నాం. దీనిపై ఎక్కువ ఫోకస్ చేయాల్సిన అవసరం ఉంది. ఏయూలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుచేయాలని ఎన్వీడియాను కోరాం. రీసెర్చ్, ఇన్నోవేషన్‌పై దృష్టిపెడతాం. స్టార్టప్ ఇంక్యుబేషన్ బలోపేతం చేస్తాం. గ్లోబల్ టాలెంట్ కూడా రావాలి. టీచింగ్ టాలెంట్ రావాలి, విద్యార్థులు కూడా రావాలి. అంతర్జాతీయ విద్యార్థులు మన విశ్వవిద్యాలయాల్లో చదవాలనేది లక్ష్యంగా పెట్టుకున్నాం. స్టడీ ఇన్ ఏపీ బ్రాండింగ్ కూడా చేయాలని నిర్ణయించామని మంత్రి లోకేష్ చెప్పారు.

### బడ్జెట్‌లో రూ.2వేల కోట్ల కేటాయింపు

బడ్జెట్‌లో కూడా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను బలోపేతం చేసేందుకు రూ.2వేల కోట్లు కేటాయించాం. మౌలికవసతులు, పరిశోధనల కోసం ఆ నిధులను ఖర్చుపెడతాం. కేంద్రం కూడా అనేక కార్యక్రమాల కింద విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయిస్తోంది. వాటిని జతపరచి కార్యక్రమాలు చేపడతాం. డీఎస్సీ విషయంలో గతంలో జరిగిన తప్పులను స్టడీ చేసి న్యాయపరమైన వివాదాలకు తావులేకుండా పకడ్బందీ నోటిఫికేషన్ ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. విశ్వవిద్యాలయాల్లో నియామకాల అంశం కూడా కోర్టులో ఉంది. దీనిపై ఏజీతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. విశ్వవిద్యాలయాల్లో 4,330 శాంక్షన్డ్ పోస్టులు ఉంటే కేవలం 1,048 పోస్టులు భర్తీ చేశారు. 3,282 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేస్తాం. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఏపీ 9వ స్థానంలో ఉంది. 3 వ స్థానానికి తీసుకురావాలనేది లక్ష్యం. క్యూఎస్ ర్యాంకింగ్‌లో టాప్-100లో ఒక ప్రభుత్వ విశ్వవిద్యాలయం ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

# ఎన్టీఆర్ ట్రస్ట్.. సదా ఆపన్నుల సేవలోనే



- అభాగ్యులను ఆదుకునేందుకు ట్రస్ట్ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి
- సేవాకార్యక్రమాలు ప్రజలకుమరింత చేరువ చేసేందుకే విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఏర్పాటు
- తలసేమియా బాధితులకు అండగా నిలబడతాం
- ట్రస్ట్ నిర్వహణలో దాతలు, సిబ్బందిసహకారం మరువలేనిది
- ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఉద్ఘాటన
- విజయవాడలో ట్రస్ట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన





విజయవాడ(చైతన్యరథం): ఆపన్నులను ఆదుకునేందుకు తమ ట్రస్ట్ తలుపులు ఎప్పుడూతెరిచే ఉంటాయని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి స్పష్టంచేశారు. విజయవాడ టీచర్స్ కాలనీలో ఎన్టీఆర్ ట్రస్ట్ నూతన భవన నిర్మాణానికి నారా భువనేశ్వరి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ... ఇప్పటి వరకూ హైదరాబాద్ నుంచి ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు వీలుగా విజయవాడలో ట్రస్ట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

## ట్రస్ట్ ద్వారా ఆపన్నులకు సేవలు

28 ఏళ్ల క్రితం ఎన్టీఆర్ ట్రస్ట్‌ను స్థాపించినప్పుడు చంద్రబాబు మాకు ఒకటే మాట చెప్పారు. ప్రజాసేవే పరమావధిగా పనిచేయాలని సూచించారు. ఏ నమ్మకంతోనైతే ఆయన ఈ బాధ్యతలు అప్పగించారో వాటిని చిత్తశుద్ధితో నిర్వర్తిస్తున్నాం. మాటల్లో చెప్పింది చేసి చూపిస్తున్నాం. ట్రస్ట్ ద్వారా ఇన్ని సేవా కార్యక్రమాలు నిర్వర్తిస్తున్నానంటే అందుకు మాటీం సభ్యులే కారణం. వారి సహకారం వల్లే ఇది సాధ్యమైంది. అలాగే ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా మేము పేదలకు సేవ చేస్తున్నామంటే అందుకు దాతల సహకారం మరువలేనిది. విరాళం ఎంతన్నది ముఖ్యం కాదు. పేదలకు అండగా నిలబడాలన్న ఆశయం ఎంతో గొప్పది. 2026 ఫిబ్రవరి నాటికి విజయవాడలో ట్రస్ట్ భవనం నిర్మాణం పూర్తిచేసి సేవలు ప్రారంభిస్తాము. ఈ ట్రస్ట్ భవనంలో ఆఫీస్, బ్లడ్ బ్యాంక్, తలసేమియా సెంటర్లు ఏర్పాటు చేస్తాం. ఇటీవల విజయవాడలో తలసేమియా బాధితుల సహాయార్థం నిర్వహించిన యుఫోరియా మ్యూజికల్ నైట్‌కు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ఆ స్పందన మాలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే ఉత్సాహాన్ని కలిగించిందని భువనేశ్వరి తెలిపారు.

## ప్రజాసేవే పరమావధిగా..

ఎన్టీఆర్ ట్రస్ట్ అంటే పేదల ముఖాల్లో చిరునవ్వు. ఎన్టీఆర్ స్ఫూర్తితో,చంద్రబాబు ఆలోచనలు, సహకారంతో ట్రస్ట్ ద్వారా పలుసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. త్వరలో హైదరాబాద్, వైజాగ్, తిరుపతి, రాజమండ్రిలో కూడా తలసేమియా సెంటర్లుఏర్పాటు చేయబోతున్నాం.అవి 24గంటలూ పనిచేస్తాయి.ట్రస్ట్ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటుచేసి ఇప్పటి వరకూ 7,531మందికి శిక్షణ అందించాం. 2,500 మందికి ఉద్యోగాలు కూడా వచ్చాయి. అలాగే కుప్పంలో 150 మంది మహిళలకు టైలరింగ్, జ్యూట్ బ్యాగ్ తయారీ, సిల్క్ దారంతో గాజుల తయారీ, చికన్ కారీ ఎంబ్రాయిడరీలో శిక్షణఇచ్చాము. మహిళలు ఆర్థికంగా పైకి రావాలి, వారి కాళ్లపై వాళ్లు నిలబడాలని చంద్రబాబు ఎపుడూ చెబుతుంటారు.డ్వాక్రా ఏర్పాటుతో అది ఆచరణలో చేసి చూపించారు కూడానని భువనేశ్వరి అన్నారు.

## ట్రస్ట్ ద్వారా విద్య, వైద్యం, ఉపాధి కల్పన

ట్రస్ట్ ద్వారా సంజీవని ఆరోగ్య క్లినిక్‌లు నడుపుతున్నాము. ఈ క్లినిక్స్ వల్ల లక్షా 60 వేల 290 మందికి ఉచితంగా వైద్య సేవలు అందించాం. ఇందుకోసం రూ.4 కోట్ల 2 లక్షల 50 వేలు ఖర్చు చేశాం. ట్రస్ట్ ద్వారా 14 వేల 56 హెల్త్ క్యాంప్స్ కూడా నిర్వహించాం. వీటి ద్వారా 20 లక్షలమందికి ప్రయోజనం కలిగింది. ఇందుకోసం రూ. 22.43 కోట్లు ఖర్చయింది. ట్రస్ట్ ఆధ్వర్యంలో గండిపేటలో స్కూల్, మహిళల డిగ్రీ కాలేజ్ నిర్వహిస్తున్నాం. అందులో వచ్చిన లాభాలతో కృష్ణాజిల్లా చల్లపల్లిలో స్కూలు నిర్వహిస్తున్నాం. పేద, తల్లిదండ్రులు లేని పిల్లలకు ఆ స్కూల్లో ఉచితంగా విద్య అందిస్తున్నాం. ఇందులో 2 వేల 20 మంది చదువుకుంటున్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకూ చదువు చెబుతున్నాం. చల్లపల్లి స్కూల్లో పిల్లల క్రమశిక్షణ చూస్తే నాకు ఎంతో సంతోషం కలుగుతుంది. పేదలు, తల్లిదండ్రులు లేని వారికి జీవితం విలువ బాగా తెలుస్తుంది. అందుకే వారంతా పట్టుదలతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని భువనేశ్వరి తెలిపారు.

## విపత్తుల్లో ఆపన్నహస్తం

విపత్తుల సమయంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఆపన్నులకు సేవలు అందించాం. ఉత్తరాఖండ్ వరదల్లో చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చాం. కేరళలో వరదలు, హుద్ హుద్, తిత్లీ తుపాన్లు, కర్నూలు వరదలు, విజయవాడ వరదల సమయంలో బాధితులకు ఎన్టీఆర్ ట్రస్ట్ అండగా నిలిచింది. ఉచితంగా మందులు, ఆహారం పంపిణీ చేశాం. ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున న్యూట్రిఫుల్ యాప్‌ను నిర్వహిస్తున్నాము. ఇందులో 16మంది న్యూట్రిషనిస్టులు, డాక్టర్లు అందుబాటులో ఉంటారు. బీపీ, షుగర్, అధిక బరువు వంటి సమస్యలపై వీరు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తారు. ట్రస్ట్ ద్వారా స్త్రీ శక్తి కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తున్నాం. మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వడం ద్వారా 7 వేలమందికి పైగా ఆర్థిక ప్రయోజనం పొందారు. ఇందుకోసం రూ. 20 లక్షలు ఖర్చు చేశాం. అలాగే అన్ని దానాల్లో రక్తదానం గొప్పదంటారు. ట్రస్ట్ ద్వారా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశాం. అర్ధరాత్రి తలుపుతట్టినా రక్తం ఇచ్చేందుకు ముందుకొస్తున్న రక్తదాతలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నాను. తలసేమియా వ్యాధిగ్రస్థులకు ఎన్టీఆర్ ట్రస్ట్ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. యుఫోరియా మ్యూజికల్ నైట్ వంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని భువనేశ్వరి చెప్పారు.

## విరాళాలు అందించిన పలువురు దాతలు

ఎన్టీఆర్ ట్రస్ట్ భవన నిర్మాణ శంకుస్థాపన సందర్భంగా పలువురు దాతలు విరాళాలు అందించారు. ట్రస్ట్ చేస్తున్న సేవాకార్యక్రమాల్లో తాము భాగస్వాములు అవుతున్నందుకు గర్వంగా ఉందన్నారు. ట్రస్ట్ ద్వారా సేవలు ముందుకు తీసుకెళ్లేందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ నారా భువనేశ్వరి ధన్యవాదాలు తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమానికి ముందు బెంజిసర్కిల్ లోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో భువనేశ్వరి ప్రత్యేక పూజలు చేశారు.







చైతన్యరథం

# విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు చర్యలు

- స్కూల్ వెల్‌నెస్ టీమ్స్ ఏర్పాటు
- విద్యార్థుల్లో ఒత్తిడి, ఆందోళన తగ్గించేందుకు కౌన్సిలింగ్
- ప్రభుత్వ విద్య బలోపేతం చేస్తాం
- ప్రైవేటు యాజమాన్యాలపైనా బాధ్యత ఉంటుంది
- ఆత్మహత్యల నివారణకు అందరం కలిసికట్టుగా కృషిచేయాలి
- మండలిలో సభ్యుల ప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానం

అమరావతి (చైతన్యరథం): విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు అందరం కలిసికట్టుగా కృషిచేయాల్సిన అవసరం ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై మండలిలో గురువారం సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానం ఇచ్చారు. కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలు ఎవరికైనా బాధాకరం. నేను విద్యాశాఖ మంత్రి అయిన తర్వాత ఎవరైనా విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడితే.. సొంత పిల్లలకు జరిగినట్లుగా భావించి అధికారులు స్పందించాలని చెప్పాను. మానవతా కోణంలో మనం ఆలోచించాల్సిన అవసరం ఉందని చాలా స్పష్టంగా చెప్పాను. విద్యార్థుల ఆత్మహత్యలకు ఒక ప్యాట్రన్ అంటూ ఏమీ లేదు. 2016లో 6 గురు చనిపోతే..2019లో నలుగురు చనిపోయారు. 2021లో 7గురు చనిపోయారు. 2022లో 12 మంది, 2023లో 17మంది, 2024లో 6గురు చనిపోయారు. విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయనే ప్యాట్రన్ లేదు. అయితే ఆత్మహత్యలు జరుగుతున్నాయి. కాదని ఎవరూ అనడం లేదు. ఇవన్నీ ఇంటర్ విద్యలో చోటుచేసుకున్నవి. టెక్నికల్ ఎడ్యుకేషన్ విషయానికి వస్తే.. ఒకేడాది ఒకరిద్దరు చనిపోతే, మరో ఏడాది 11 మంది, మరో ఏడాది ఒకరు చనిపోయారు. దీనికి ప్యాట్రన్ లేదు. యూనివర్సిటీల్లో కూడా ఆత్మహత్యలు జరిగాయి. 2014 నుంచి 18 మంది చనిపోయారని మంత్రి లోకేష్ వివరించారు.



## స్కూల్ వెల్ నెస్ టీమ్స్ ఏర్పాటు

స్కూల్ వెల్ నెస్ టీమ్స్ ఏర్పాటుచేసి ప్రైవేటు, ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు ఓరియంటేషన్ ఇచ్చి పిల్లల్లో తొలి దశలోనే అలాంటి లక్షణాలను పసిగట్టాల్సిన అవసరం ఉంది. కేవలం జూనియర్ కాలేజీల నుంచి విశ్వవిద్యాలయాల వరకే కాకుండా పాఠశాల విద్యలో కూడా లైంగిక వేధింపుల ఆరోపణలు వస్తున్నాయి. స్కూల్ ఎడ్యుకేషన్‌లో కూడా సుమారు 280 మంది కౌన్సిలర్లను నియమించాం. వారు ఉపాధ్యాయులకు కూడా శిక్షణ ఇచ్చి ఎర్లీ సింప్టమ్స్‌ను, పిల్లల ప్రవర్తనలో మార్పును గమనించి, సరిచేయడంతో పాటు సరైన విధంగా కౌన్సిలింగ్ ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఆత్మహత్యల నివారణకు అమెరికాకు చెందిన క్యూపీఆర్ ఇన్‌స్టిట్యూట్ వారు బెంగళూరులో ఓ భాగస్వామితో ఒప్పందం చేసుకున్నారు. స్కూల్ కౌన్సిలర్ ట్రైనింగ్ కోసం.. గైడెన్స్, ఇంటర్వెన్షన్, క్రైసిస్ సపోర్ట్ మేనేజ్‌మెంట్‌కు వారితో సంప్రదిస్తున్నాం. ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం టెలీ కౌన్సిలింగ్ సర్వీస్ ఏర్పాటుచేస్తాం. పిల్లల్లో ఒత్తిడి, ఆందోళన తగ్గించేందుకు కౌన్సిలింగ్ నిర్వహిస్తాం. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల విషయానికి వస్తే.. మెంటార్, మెంటీ సిస్టమ్ కూడా తీసుకువచ్చాం. పాఠశాల విద్యలో ఎన్‌సీసీ, రెడ్ క్రాస్‌ను కూడా తీసుకురావాల్సిన అవసరం ఉంది. రాష్ట్రానికి ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఇవ్వాలని కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్‌ని కూడా కోరాము. పేరొందిన స్వచ్ఛంద సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని ఆత్మహత్యలు నివారించాలని, తొలిదశలోనే పిల్లల ప్రవర్తనలో మార్పులు గుర్తించాలని అధికారులకు కూడా చెప్పామని మంత్రి లోకేష్ తెలిపారు.

## ప్రభుత్వ జూనియర్ కాలేజీల బలోపేతం

విద్యార్థులు ఒత్తిడిలో ఉన్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆత్మహత్యలకు ర్యాగింగ్, అకడమిక్ స్ట్రెస్, ఫీజు చెల్లింపులు ప్రధాన కారణం. ప్రభుత్వ జూనియర్ కాలేజీలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. గత ప్రభుత్వం హైస్కూల్ ప్లస్ తీసుకువచ్చింది. అక్కడ సబ్జెక్స్ టీచర్స్‌ను ఇవ్వాలి. మండలానికి ఒక గవర్నమెంట్ జూనియర్ కాలేజీ ఉండాలి. మేం ఇంటర్ విద్యార్థులకు కిట్‌తో పాటు మధ్యాహ్న భోజనం తిరిగి ప్రారంభించాం. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మెరుగైన విద్య అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

## ప్రైవేటు యాజమాన్యాలపైనా బాధ్యత

తల్లిదండ్రులు కూడా ఫీజు కట్టాం కాబట్టి అన్ని సబ్జెక్ట్ ల్లో మార్కులు రావాలని ఒత్తిడి పెడుతున్నారు. ఒత్తిడి తగ్గించేందుకు కూడా ఆలోచిస్తున్నాం. ఇంటర్మీడియట్ బోర్డులో సంస్కరణలు తీసుకువచ్చాం. కొత్త అవకాశాలు కల్పిస్తున్నాం. కరిక్యులమ్ ప్రక్షాళన చేస్తున్నాం. తల్లిదండ్రుల నుంచి ఫీడ్ బ్యాక్ కూడా తీసుకుంటున్నాం. ఆత్మహత్యలు చోటుచేసుకోవడం చాలా తీవ్రమైన అంశం. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కౌన్సిలింగ్ ఉండాలి. ప్రైవేటు, గవర్నమెంట్ పాఠశాలలు రెండింటిలోనూ కౌన్సిలింగ్ ఉండాలి. ప్రైవేటు యాజమాన్యాలపై కూడా బాధ్యత ఉంటుంది. విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారని వాకబు చేస్తున్నాం. కొన్ని సందర్భాల్లో అవమానాలు తట్టుకోలేక కూడా తట్టుకోలేక పిల్లలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆత్మహత్యల నివారణకు అందరం కలిసికట్టుగా కృషి చేయాలి. ఈవిషయంలో ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందని మంత్రి లోకేష్ తెలిపారు.

## విద్యాశాఖలో పలు సంస్కరణలు

ప్రభుత్వ విద్యను కూడా బలోపేతం చేసి పరిశ్రమలకు అనుసంధానించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో 12 లక్షల మంది విద్యార్థులు తగ్గారు. కూటమి ప్రభుత్వం విద్యాశాఖలో అనేక సంస్కరణలు తీసుకువస్తోంది. ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, పాఠశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. మౌలిక సదుపాయాలు, బోధనను మెరుగుపర్చడంతోపాటు, ఖాళీలను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. ఇవన్నీ చేసి విద్యార్థులకు మెరుగైన విద్యను ప్రభుత్వమే అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. పాఠశాలల్లో యాక్టివ్ ఏపీ ప్రాజెక్ట్ కింద వచ్చే ఏడాది నుంచి వారానికి 150నిమిషాలు ఫిజికల్ యాక్టివిటీ ఏర్పాటు చేస్తాం. స్కూల్స్ గ్రౌండ్స్ అన్నీ మ్యాప్ చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. చక్రపాణి నివేదికపై అధ్యయనం చేయాల్సి ఉందని మంత్రి లోకేష్ చెప్పారు.

---

దొరస్వామి నాయుడు మృతి

## విద్యారంగానికి తీరనిలోటు

**- మంత్రి లోకేష్ సంతాపం**

అమరావతి (చైతన్యరథం): పీఈఎస్ గ్రూప్ ఫౌండర్, చైర్మన్ ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి నాయుడు మృతిపై రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతిచెందారన్న వార్త తనను తీవ్రంగా తీవ్రంగా కలచివేసిందన్నార. ప్రొఫెసర్ దొరస్వామి నాయుడు ఏపీ, కర్నాటక రాష్ట్రాల్లో మెడిసిన్, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, లైఫ్ సైన్సెస్ విభాగాల్లో 12 విద్యాసంస్థలను నడుపుతూ విద్యాదాతగా నిలిచారని కొనియాడారు. కుప్పం ప్రాంతంలో పీఈఎస్ విద్యాసంస్థలను నెలకొల్పి విద్యారంగంలో విశేష సేవలందించిన దొరస్వామి మృతి తీరనిలోటుగా అభివర్ణించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ... దొరస్వామి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నానని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# గంజాయిపై ఉక్కుపాదం

- 90 శాతం తగ్గిన సాగు
- మండలిలో హోంమంత్రి అనిత

అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం వచ్చాక గంజాయి సాగు, అమ్మకాలు, వినియోగంపై ఉక్కుపాదం మోపుతోందని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. శాసమండలిలో గురువారం వైసీపీ సభ్యుల ప్రశ్నలకు హోంమంత్రి అనిత సమాధానమిస్తూ.. గంజాయిపై ఉక్కు పాదం మోపుతామని చెప్పినట్లుగానే ఆ విషయంలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గంజాయి నియంత్రణ కోసం ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. గత ప్రభుత్వంలో సీఎం ఇంటి దగ్గరే గంజాయి తాగి యువతిపై అత్యాచారం చేస్తే కనీసం స్పందించలేదని, ఏళ్లు గడిచినా నిందితులను అరెస్ట్ చేయలేకపోయారని విమర్శించారు. వైసీపీ హయాంలో దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా దాని మూలాలు ఏపీలోనే ఉండేవన్నారు. గంజాయి నిర్మూలనలో భాగంగా తొలుత



గంజాయి సాగును అడ్డుకుంటున్నామన్నారు. ఎక్కడికక్కడ గంజాయి తోటలను ధ్వసం చేస్తున్నామన్నారు. డ్రోన్ కార్పొరేషన్ సహకారంతో డ్రోన్‌ల వాడకం తీసుకొచ్చామని తెలిపారు. డ్రోన్ వస్తే పోలీసులు వస్తారని అనేక ప్రాంతాల్లో స్వయంగా గంజాయి పండిస్తున్న వాళ్లే ధ్వంసం చేసుకుంటున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. గంజాయి సాగు 90శాతం వరకు తగ్గిపోయిందని తెలిపారు. నార్కోటిక్ చట్టం ప్రకారం సాగు చేసినా, అమ్మినా, వినియోగించినా కఠినమైన శిక్షలు ఉంటాయన్నారు. అనేక మంది వెనుకబడిన వర్గాల పిల్లలు ఈ కేసుల్లో ఇరుక్కున్న మాట వాస్తవమన్నారు. అన్ని డిపార్ట్‌మెంట్లలో గంజాయి నియంత్రణపై కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గంజాయి నియంత్రణలో భాగంగా విక్రేతల ఆస్తులు జప్తు కూడా చేస్తున్నామని తెలిపారు.

గంజాయికి అలవాటు పడిన వారిని, మత్తు పదార్థాలకు బానిసలైన వారిని డీ అడిషన్ సెంటర్లకు పంపిస్తున్నామన్నారు. ఏపీలో సాగుతగ్గిన తర్వాత ఒడిశా నుంచి ఏపీకి ఎక్కువగా రవాణా అవుతోందన్నారు. ఒడిశా నుంచి వస్తున్న 70వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశామన్నారు. ఈ విషయంలో ఒడిశా ప్రభుత్వంతో ఒక సమన్వయ సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. తెలంగాణ, తమిళనాడు ప్రభుత్వాలతో కూడా కోఆర్డినేషన్ మీటింగులు ఏర్పాటు చేస్తున్నామని హోంమంత్రి అనిత తెలిపారు.

## ఆలయాల అభివృద్ధికి

# ప్రభుత్వం కట్టుబడి ఉంది

- దేవాదాయశాఖకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు
- అసెంబ్లీలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



అమరావతి(చైతన్యరథం): అసెంబ్లీలో గురువారం దేవాదాయ శాఖకు సంబంధించి బడ్జెట్ పద్దులపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవాదాయ శాఖకు సంబందించిన అన్ని ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

భక్తులకు సౌకర్యాల కల్పన, అర్చకులకు పారితోషికాలు, దేవాదాయ ధర్మాదాయ హిందూ మత సంస్థల నిర్వహణకు అర్చక ఇతర ఉద్యోగుల వేతన చెల్లింపులకు బడ్జెట్ కేటాయించినట్లు చెప్పారు. ధార్మిక కార్యక్రమాల నిర్వహణ, దేవాదాయశాఖకు సంబంధించిన భూములు అన్యాక్రాంతం కాకుండా అలాగే పరిపాలన నిర్వహణ కోసం ప్రభుత్వం కేటాయించిన నిధుల వివరాలను మంత్రి సభలో ప్రస్తావించారు. అలాగే పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు తమ ప్రాంతాల్లోని ఆలయాల అభివృద్ధి, ఆలయ భూముల పరిరక్షణ, సీజీఎఫ్ ఫండ్స్‌కు సంబంధించిన అంశాలు, వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రామతీర్థం వంటి ఘటనలు, దేవాదాయశాఖ ద్వారా చేపట్టాల్సిన కార్యక్ర మాలపై ప్రశ్నలకు మంత్రి సమగ్రంగా సమాధానాలు ఇచ్చారు.

పరిపాలనలో పార దర్శకత, ఆధునికీకరణ, భక్తుల సౌకర్యాల కోసం చేపట్టాల్సిన పనులను వేగవంతం చేయడం కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని వెల్లడించారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న పలు పథకాలను వివరించారు. అలాగే కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను దాదాపు 98శాతం పూర్తి చేసినట్లు తెలిపారు.

చైతన్యరథం

# అమరావతిలో యోగా, ప్రకృతి వైద్య పరిశోధనా కేంద్రం

- రూ.100 కోట్లతో ఏర్పాటుకు సీఎం అంగీకారం
- గత ప్రభుత్వంలో ఆయుష్‌పై పూర్తిగా నిర్లక్ష్యం
- ఇచ్చిన భూమి ఇళ్ల స్థలాలకు కేటాయించారు
- శాప్ కింద కేంద్రం నుంచి తెచ్చింది రూ.71 కోట్లే
- కూటమి పాలనలో మూడు నెలల్లోనే రూ.28 కోట్లు
- ఆయా విభాగాల్లో ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టాం
- వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

అమరావతి(చైతన్యరథం): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మంజూరు చేసిన యోగా, ప్రకృతి వైద్య పరిశోధనా కేంద్రాన్ని అమరావతిలో ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకరించారని వైద్యఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. గురువారం అసెంబ్లీలో ఆయుష్ విభాగంపై సభ్యులడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధాన మిస్తూ 2018లోనే కేంద్రం మంజూరు చేసిన ఈ పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు అప్పటి ఎన్డీయే ప్రభుత్వం గన్నవరం నియోజకవర్గం కొండపావులూరు గ్రామంలో 25 ఎకరాల భూమిని కేటాయించినట్లు గుర్తుచేశారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఈ ప్రతి పాదనలను బుట్టదాఖలు చేసి ఆ స్థలాన్ని జగనన్న కాలనీ కోసం కేటాయించడం దారుణమన్నారు. కూటమి వచ్చాక ప్రస్తుతం ఈ యోగా నేచురోపతి పరిశోధనా కేంద్రాన్ని రూ.100 కోట్లతో రాజధాని అమరావతిలో ఏర్పాటు చేసేందుకు సీఎం సుముఖత వ్యక్తం చేశారని, ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు.

### గత ప్రభుత్వంలో ఆయుష్‌ను గాలికొదిలారు

ఆయుష్ విభాగం పనితీరుపై గత ప్రభుత్వం సమీక్షించిన దాఖలాలు లేవు. వైద్య ఆరోగ్య శాఖలో అటువంటి విభాగమొకటి ఉందా అని జగన్ అడిగిన సందర్భాలు న్నా యి. వారి వైఖరితో ఆయుష్ డిస్పెన్సరీలను సిబ్బంది, నిధుల కొరత కారణంగా మూ తవేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ శాఖపై అప్పటి ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సమీక్ష కూడా నిర్వహించిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ శాఖపై సమీక్షలు నిర్వహించి సంప్రదాయ వైద్య పునరుద్ధరణకు చర్యలు ప్రారంభించారు. ఆయుష్ విభాగంలో రాష్ట్ర వ్యాప్తంగా 327 వైద్యాధికారుల పోస్టులు ఉంటే అందులో 67 ఖాళీలు, హెూమియో వైద్య విధానంలో 190 పోస్టులు ఉంటే అందులో 62 ఖాళీలు, యునాని విభాగంలో 73 పోస్టులకు 32 ఖాళీలు, పారామెడికల్ సిబ్బంది విషయంలో 323 పోస్టులు మంజూరు కాగా 272 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. మొత్తంగా 1087 పోస్టులు మంజూరు కాగా 458 (దాదాపు 40 శాతం మేర) ఖాళీలు ఉన్నాయని చెప్పారు. ఈ తేడాలను సరి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 138 పోస్టుల భర్తీకి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశామని మంత్రి వెల్లడించారు. ఆయుర్వేద వైద్య విభాగంలో 72 మంది వైద్యాధికారుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా దానికి 62 మంది ఇప్పటికే ఎంపికయ్యారని, వారు త్వరలోనే విధుల్లో చేరనున్నారని చెప్పారు. హెూమియో విభాగంలో 53 పోస్టులకు 52 మంది ఎంపికయ్యారని, యునాని విభాగంలో 26 పోస్టులకు 15 మంది ఎంపికయ్యారని వివరించారు. ఈ విధంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి ఈ వైద్య విభాగాన్ని మరింత పటిష్టం చేసేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు.

### ఆయుష్‌ను విభాగాన్ని చంపేయాలనుకున్నారు

ఆయుష్ విభాగాన్ని నిర్లక్ష్యం చేయడమే కాకుండా పూర్తిగా చంపేయడానికి గత ప్రభుత్వం



ప్రయత్నించిందని మండిపడ్డారు. ఆయుష్ విభాగానికి గత ఐదేళ్ల కాలంలో కేంద్రం నుంచి స్టేట్ యానువల్ యాక్షన్ ప్లాన్ కింద రాష్ట్రానికి అందిన నిధులు కేవలం రు.71 కోట్లు మాత్రమేనని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన మూడు నెలల్లోనే రూ.28 కోట్లు శాప్ కింద కేంద్రం నుంచి తీసుకొచ్చిందని గుర్తుచేశారు. ఆయుష్ శాఖ అభివృద్ధి కోసం రాష్ట్రం నుంచి ఎటువంటి ప్రతిపాదనలు పంపటం, కేంద్రం నుంచి నిధులు రాబట్టే ప్రయత్నం కానీ గత ప్రభుత్వం చేయలేదంటే ఆయుష్ పై ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించారో అర్థం చేసుకోవచ్చన్నారు. కేంద్రం నిధులివ్వటానికి సిద్ధంగా ఉన్నప్పటికీ వాటిని అందుకుని సద్వినియోగం చేసేందుకు గత ప్రభుత్వం ఎటువంటి ఆలోచనా చేయలేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మొదటి మూడు నెలల కాలంలోనే రూ.28 కోట్ల కేంద్ర నిధులతో ఈ శాఖను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టిందని చెప్పారు.

### చంద్రబాబు ఆయుష్‌కు జీవం పోశారు

కాకినాడలో రూ.7.2 కోట్ల నిధులతో 60 బెడ్ల సామర్థ్యం ఉన్న ఆస్పత్రిని, విశాఖలో రు.8.3 కోట్ల వ్యయంతో 80 బెడ్ల సామర్థ్యం ఉన్న ఆస్పత్రిని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాం. ఆయుర్వేద విశ్వవిద్యాలయం స్థాయిలోనే 2018లో కేంద్రం మన రాష్ట్రానికి యోగ, నేచురోపతి పరిశోధనా కేంద్రాన్ని మంజూరు చేసింది. ఇటీవల కేంద్ర మంత్రి తనకు ఫోన్ చేసి రాష్ట్రానికి మంజూరైన పరిశోధనా కేంద్రానికి ప్రధాని నరేం ద్రమోదీ భూమిపూజ చేసేందుకు కార్యక్రమం రూపొందిస్తున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి ఇందుకు అనువైన సమయాన్ని సూచించాలని కోరారు. 2018లో మంజూరైన దీని కోసం గన్నవరం నియోజకవర్గంలోని కొండపావులూరు గ్రామంలో అప్పటి ఎన్డీయే ప్రభుత్వం 25 ఎకరాల భూమిని కేటాయిస్తే తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వ ఆ ప్రతిపాదనను బుట్టదాఖలాలు చేసిందని చెప్పారు. ఈ అంశంపై ఇటీవల ఆ ప్రాంతాన్ని సందర్శించిన అధికారులు నాడు కేటాయించిన స్థలం జగనన్న ఇళ్ల కాలనీల కు అప్పటి ప్రభుత్వం కేటాయించిందని తనకు చెప్పారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినపుడు ఈ కేంద్రాన్ని రాజధాని అమరావతిలోనే రూ.100 కోట్లతో ఏర్పాటు చేద్దామన్నారని, అందుకు అవసరమైన స్థలాన్ని కేటాయిస్తామని చెప్పా రని వివరించారు.

### త్వరలో ఖాళీల భర్తీకి చర్యలు

ఆయుర్వేదం, హెూమియో ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరతపై అసెంబ్లీలో సభ్యులడిగిన ప్రశ్నకు మంత్రి సత్యకుమార్ యాదవ్ సమాధానమిస్తూ రాష్ట్రంలో మూడు ఆయుష్ ఆస్పత్రులు, ఒక ఆయుర్వేద బోధనా ఆస్పత్రి, రెండు మినీ ఆయుర్వేద ఆస్ప త్రులు, మూడు హెూమియో బోధనా ఆస్పత్రులు పనిచేస్తున్నాయని తెలిపారు. వైద్యులు, సిబ్బంది కొరత కారణంగా 20 ఆయుర్వేద, 16 హెూమియో ఆస్పత్రులు పని చేయడం లేదని వెల్లడించారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 67 ఆయుర్వేద వైద్యాధికారుల పోస్టులకు 50 మంది నియమితులైనట్లు చెప్పారు. 20 ఆయుర్వేద, 16 హెూమియో ఆస్పత్రులు సిబ్బంది కొరత కారణంగా పనిచేయడం లేదని వివరించారు. ఈ ఆస్పత్రులలో ఖాళీల భర్తీ కోసం అవసరమైన అనుమతులు తీసుకుని నియామక ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. జాతీయ ఆయుష్ మిషన్ నిధులతో 126 ఆయుష్ డిస్పెన్సరీలను పునరుద్ధరించామని, అవి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లుగా ప్రస్తుతం సేవలందిస్తున్నాయని వివరించారు. ప్రజలకు ఆయుష్ వైద్యసేవలు అందుబా టులోకి తీసుకొచ్చేందుకు పెద్దఎత్తున చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

---

## రాష్ట్ర సచివాలయ ఉద్యోగులకు
# చేనేత వస్త్రాలపై 50 శాతం డిస్కౌంట్

**- ప్రత్యేక కౌంటర్ ప్రారంభించిన మంత్రులు సవిత, సంధ్యారాణి**



అమరావతి (చైతన్యరథం): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల కోసం చేనేత వస్త్రాలపై 50 శాతం డిస్కౌంట్‌తో అమ్మకాలు ప్రారంభమయ్యాయి. గురువారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో మూడో బ్లాక్‌లో ఉన్న ఆప్కో షోరూమ్‌లో చేనేత వస్త్రాలపై 50 శాతం తగ్గింపు ధరల ప్రత్యేక కౌంటర్‌ను మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యే బండారు శ్రావణితో కలిసి మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆప్కో షో రూమ్‌లో వస్త్రాల నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యే బండారు శ్రావణి చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా మంత్రులు సవిత, గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చేనేత వస్త్రాల కొనుగోలుపై 50 శాతం మేర డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ డిస్కౌంట్ విక్రయాలను మూడు రోజుల పాటు గురు, శుక్రవారాలు సహా ఈ నెల పదో తేదీ సోమవారం సాయంత్రం వరకు చేస్తున్నట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. చేనేత వస్త్రాలను వారానికోసారి ధరించుదామని, నేతన్నలకు అండగా ఉందామని మంత్రి సవిత పిలుపు ఇచ్చారు.



---

# త్వరలో ఉచిత ఆన్‌లైన్ డీఎస్సీ కోచింగ్ ప్రారంభం

- 10 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత వెల్లడి



అమరావతి(చైతన్యరథం): మెగా డీఎస్సీ నోటిఫికేషన్ త్వరలో వెలువడనున్న నేపథ్యంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో త్వరలో ఉచిత ఆన్‌లైన్ డీఎస్సీ కోచింగ్ ప్రారంభించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఈ నెల 10 తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే 26 జిల్లా కేంద్రాల్లోనూ బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లు ప్రారంభించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఇప్పుడు ఆన్‌లైన్ ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్ ద్వారా డీఎస్సీ కోచింగ్ పొందవొచ్చునన్నారు. బీసీ, ఈబ్ల్యూఎస్ సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులన్నారు. అభ్యర్థులు టెట్‌లో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఎంతమందికైనా ఆన్ లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వడానికి తమ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ జిల్లాలకు చెందిన జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారులను సంప్రదించాలని ఆ ప్రకటనలో మంత్రి సవిత తెలిపారు.

### 10 నుంచి 'బీసీ' స్వయం ఉపాధి యూనిట్లకు దరఖాస్తుల స్వీకరణ

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసినందున రాష్ట్రంలో అమలవుతున్న బీసీ సంక్షేమ పథకాల యూనిట్ల ఏర్పాటుకు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి తెలిపారు. ఈ నెల పదో తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల కోడ్ ఫలితంగా ఉత్తరాంధ్ర,ఉభయ గోదావరి, ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలోనూ బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాట్లకు దరఖాస్తుల స్వీకరణ నిలిపేశామన్నారు. తాజాగా ఎన్నికల కోడ్ ముగియడంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణా, ఎన్టీఆర్, కృష్ణా, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన లబ్ధిదారులంతా ఈ నెల పదో తేదీ నుంచి ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా రుణాల మంజూరుకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి,త్వరితగతిన యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి సవిత తెలిపారు.

చైతన్యరథం

# లోకేష్ కృషి వల్లే ఏపీకి ఆర్సెలార్ మిట్టల్

- రూ.1,47,162 కోట్లతో ఉక్కు పరిశ్రమ
- లక్ష మంది యువతకు ఉద్యోగావకాశాలు
- పరిశ్రమలు, వాణిజ్య మంత్రి టి.జి.భరత్



అమరావతి(చైతన్యరథం): కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి ప్రజలందరికీ తెలియాల్సిన అవసరం ఉందని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్ పేర్కొన్నారు. అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమి చ్చారు. మంత్రి నారా లోకేష్ కృషి వల్లే అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండ లంలో ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ పరి శ్రమ రాబోతుందని తెలిపారు. రూ.1,47,162 కోట్ల ప్రతిపాదిత పెట్టు బడితో (మొదటి దశలో రూ.61,780 కోట్లు, రెండో దశలో రూ.85,382 కోట్లు) ఈ పరిశ్రమ ఏర్పాటవుతుందని తెలిపారు. ఈ పరిశ్రమ ద్వారా లక్ష మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయని వివరించారు. 17.8 ఎంపీటీపీ సామర్థ్యంతో రెండు దశలలో (మొదటి దశలో 7.3 ఎంటీపీపీ, రెండో దశలో 10.5 ఎంటీపీపీ) ఏకీకృ త ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేయనున్నారని వివరించారు. అప్పట్లో ఒడిశాలో పరిశ్రమ పెట్టాలన్న ఆలోచన వారికి ఉండేదని చెప్పిన ఆయన.. 2018లో దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో ఆదిత్య మిట్టల్‌ను మంత్రి నారా లోకేష్ కలిసి పరిశ్రమను ఏపీలో పెట్టాలన్న దానిపై చర్చించినట్లు గుర్తుచేశారు. అయితే 2019లో ప్రభుత్వం మారడంతో ఏపీలో పరిశ్రమ పెట్టాలని ప్రభుత్వం కోరినా అది జరగలేదని తెలిపారు. మళ్లీ ఇప్పుడు తమ ప్రభుత్వం రావడంతో ఒకే ఒక్క జూమ్ కాల్‌లో ఆదిత్య మిట్టల్‌తో మాట్లాడి ఏపీలో పరిశ్రమను పెట్టేలా ఒప్పించారని తెలిపారు. చంద్రబాబు నాయకత్వం, ఎన్డీయే ప్రభు త్వం ఉందన్న నమ్మకంతోనే పరిశ్రమ రాష్ట్రానికి వచ్చిందన్నారు. దేశంలోనే అతిపెద్ద ఉక్కు పరిశ్రమగా ఇది నిలిచిపోతుందని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన దావోస్ సద స్సులో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌తో కలిసి ఏపీలో పెట్టుబడులు పెట్టేం దుకు ఉన్న అవకాశాలను పెట్టుబడిదారులకు వివరించినట్లు తెలిపారు.

# 22ఏ నుంచి ప్రైవేటు భూముల తొలగింపు

- గ్రామకంఠంలోని భూములకు విముక్తి
- అక్రమిత భూముల క్రమబద్ధీకరణకు గడువు
- అసెంబ్లీలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్



అమరావతి(చైతన్యరథం): పేదలకు, నిజమైన భూ యజమానులకు న్యాయం జరగలానే లక్ష్యంతో 22ఏ నుంచి ప్రైవేట్ భూములను తొలగించాలని నిర్ణయం తీసు కున్నట్లు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఇందుకోసం గత నెల 17న మెమోను విడుదల చేశామని, నిషేధ ఆస్తుల జాబితా నుంచి ప్రైవేట్ భూములను ఎలా తొలగించాలనేది స్పష్టంగా అందులో తెలిపామని చెప్పారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. గురువారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధాన మిస్తూ అలాగే పంచాయతీల్లో గ్రామ కంఠాల్లో ఉండే ప్రైవేట్ వ్యక్తుల ఆస్తులను కూడా నిషేధ జాబితా నుంచి తొలగించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. దీనికి సంబంధించి 2015లోనే అప్పటి కూటమి ప్రభుత్వం 187 జీవోను ఇచ్చిందని, పంచాయతీలకు చెందిన సామాజిక ఆస్తులు మినహా మిగిలిన ఆస్తులను నిషేధ జాబితా నుంచి తొలగిస్తూ ఆ జీవో ఇచ్చారని చెప్పారు. అయితే గత ప్రభుత్వం రీ సర్వే చేసిన సందర్భంలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో 4,157 ఎకరాలను నిషేధ జాబితాలో పెట్టారని, దీనివల్ల సామాన్యులు చాలా ఇబ్బందులు పడ్డారని చెప్పారు. ఈ నేపథ్యంలో గ్రామ కంఠంలోని ప్రయివేట్ ఆస్తులను పరిశీలించి నిషేధ జాబితా నుంచి తొలగించాలని నిర్ణయించినట్లు చెప్పారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని ఇల్లు కట్టుకున్న వారికి క్రమబద్ధీకరణ చేస్తు న్నామని, వీరికి ఏడాది పాటు సమయం ఇచ్చామని, వీరంతా ఈ సౌకర్యాన్ని ఉపయో గించుకోవాలని చెప్పారు. గత ప్రభుత్వం భూముల రీ సర్వేను ఫార్సుగా మార్చిందని, సరిహద్దు రాళ్లపై, పాస్ పుస్తకాలపైన బొమ్మలు వేసుకోవాలనే కాంక్షతో రీ సర్వేను తప్పుల తడకగా మార్చిందని విమర్శించారు. కానీ తమ ప్రభుత్వం భూ యజమాను లకు న్యాయం చేయాలనే లక్ష్యంతో సమగ్రంగా రీసర్వే చేయిస్తున్నామని చెప్పారు.

# ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర



- పరిశుభ్ర, ఆరోగ్య, హరితాంధ్రప్రదేశ్ లక్ష్యం
- స్వర్ణాంధ్ర సాధనకు సమన్వయంతో కృషిచేయాలి
- ప్రభుత్వ ప్రధానకార్యదర్శి విజయానంద్ ఆదేశం

అమరావతి(చైతన్యరథం): స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనలో భాగంగా ప్రతినెలా మూడో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రాంతాలలో స్వచ్ఛాంధ్ర దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని శాఖలను ఆదేశించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రకు సంబంధించి కార్యక్రమాల ఖరారుపై గురువారం సచివాలయం నుంచి ఆయన కార్యదర్శులు, శాఖా ధిపతులతో వీడియో సమావేశం నిర్వహించారు. మూడో శనివారం క్రమం తప్పకుండా స్వచ్ఛాంధ్ర దివస్‌ను నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమానికి సంబంధించిన వివరాలను వైబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. విజన్ 2047 కింద పరిశుభ్ర, ఆరోగ్య, హరితాంధ్రప్రదేశ్‌గా తీర్చిద్దేందుకు ప్రణాళికలు రూపొందించడం జరిగిందని, వాటి అమలు చేయడం ద్వారా లక్ష్య సాధనకు కృషి చేయాలని స్పష్టం చేశారు. పర్యావ రణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వస్తువుల నిషేధానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవ డంతో పాటు వాటి స్థానంలో పర్యావరణ హితమైన విధానంలో గ్లాసులు, కప్పులు, ప్లేట్లు, క్యారీ బ్యాగులు తయారీకి చర్యలు తీసుకోవాల్సి ఉందని స్పష్టం చేశారు. ఇందుకు చేనేత జౌళి శాఖ తగిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తే ఎంఎస్‌ఎంఈ, ఖాదీ గ్రామీణ పరిశ్ర మల బోర్డు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ల ద్వారా వాటిని ప్రోత్సహించేందుకు తగిన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేశ్‌కుమా ర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల గురించి వివరించారు. స్వచ్ఛాంధ్ర అనేది స్వర్ణాంధ్ర విజన్ 2047కు తొమ్మిదో పిల్లర్‌గా పేర్కొ న్నారు. దీనిలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల గృహాలలో పరిశుభ్రతను పాటించ డం, వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్‌కు ఉత్తమ విధానాలు అవలంభించేలా చర్యలు చేపట్టా లని తెలిపారు. మున్సిపల్ పరిపాలన శాఖ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, పర్యాటక శాఖతో పాటు అన్ని శాఖలు ఉమ్మడిగా నిర్వహించాల్సిన కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్‌రెడ్డి, మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ జి.సంపత్‌కుమార్, న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభాదేవి, స్వచ్ఛాం ధ్ర కార్పొరేషన్ చీఫ్ ఆపరేటింగ్ అధికారి దశరథరామిరెడ్డి, మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్‌రెడ్డి తదిత రులు పాల్గొన్నారు. వర్చువల్‌గా వైద్య ఆరోగ్య ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణ బాబు, సీఎం కార్యదర్శి ప్రద్యుమ్న, వివిధ శాఖల కార్యదర్శు లు, శాఖాధిపతులు పాల్గొన్నారు.

# అమరావతి నిర్మాణంలో.. ప్రజల సొమ్ము పైసా కూడా ఖర్చు చేయం

- మంత్రి నారాయణ స్పష్టీకరణ
- అది ముమ్మాటికీ సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టే
- జగన్, వైసీపీ నేతలవి పిచ్చి ప్రేలాపనలు

నెల్లూరు (చైతన్యరథం): రాజధాని అమరావతి నిర్మాణంలో ఒక్క పైసా కూడా ప్రజల సొమ్ము ఖర్చు పెట్టేదిలేదని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ మరోసారి స్పష్టం చేసారు. గత రెండు రోజులుగా మాజీ సీఎం జగన్‌తో పాటు వైసీపీ ఎమ్మెల్సీలు అమరావతిపై చేస్తున్న వ్యాఖ్యలపై మంత్రి నారాయణ మండిపడ్డారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంత్రి నారాయణ గురువారం మీడియాతో మాట్లాడారు. అమరావతిపై జగన్‌తో పాటు ఆయన పార్టీ నాయకులు సైకోల్లా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ చూసి వైసీపీ నాయకులు ఫ్రస్టేషన్‌లో మునిగిపోయారని ఎద్దేవా చేసారు. అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులంటూ మూడు ముక్కలాట ఆడిన జగన్...చివరికి ఏ ఒక్క నగరాన్ని కూడా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఇప్పుడు మళ్లీ రాజధానిపై ఏ ముఖం పెట్టుకుని మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. హడ్కో, ఏడీబీ, ప్రపంచ బ్యాంకు ద్వారా రుణాలు తీసుకుని మాత్రమే అమరావతి నిర్మాణం చేస్తున్నామనే విషయాన్ని వైసీపీ నేతలు గుర్తుంచుకోవాలని సూచించారు..

అమరావతి నిర్మాణ పనులు ప్రారంభం అవుతుండటంతో వైసీపీ నేతలు సైకో మెంటాలిటీతో మాట్లాడుతున్నారని మంత్రి నారాయణ మండిపడ్డారు. ఇప్పటికే అమరావతిలో రూ.50 వేల కోట్ల పనులకు టెండర్లు పిలిచామని, వాటిలో 27 టెండర్లు తెరిచి కాంట్రాక్టు సంస్థలను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. రాజధానిలో రోడ్లు, డ్రైనేజీలు, వాటర్ పైప్ లైన్లు, పార్కులు పూర్తి కాగానే భూముల విలువ పెరుగుతుందన్నారు. ప్రభుత్వం వద్ద మిగిలిన భూమిని ధర పెరిగినప్పుడు అమ్మడం ద్వారా వచ్చే డబ్బులతో రుణాలు తీరుస్తామన్నారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వం వద్ద ఉన్న ల్యాండ్‌బ్యాంక్‌ను కక్ష పూరితంగా ఆర్ – 5 జోన్‌గా మార్చివేసారని దుయ్యబట్టారు. సీఎం చంద్రబాబు అమరావతిని సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్‌గా డిజైన్ చేసారని మంత్రి నారాయణ గుర్తుచేసారు.

అమరావతిపై వైసీపీ నేతలు ఎంత గింజుకున్నా ప్రయోజనం లేదన్నారు. మూడేళ్లలో అమరావతిలో ప్రభుత్వ భవనాలు పూర్తవుతాయన్నారు. జగన్ డ్రామాలతోనే ఆయనను ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసారని. దీన్నిబట్టే ఆయన పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చాన్నారు. బడ్జెట్‌లో అమరావతికి కేటాయించిన రూ.6 వేల కోట్లు ప్రజలు కట్టిన పన్నుల నుంచి వచ్చే నిధులు కాదన్నారు. సీఆర్డీఏకు కేంద్రం గ్యారంటీ ఇచ్చిన నిధులు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వస్తాయని, వాటిని మాత్రమే బడ్జెట్‌లో చూపించారు తప్ప, ప్రజల పన్నుల ద్వారా వచ్చే ఆదాయం కాదని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

# పర్యాటకంలో పెట్టుబడులకు ఏపీ భేష్

- ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తాం
- ఐటీబీ బెర్లిన్ 2025 సదస్సులో మంత్రి దుర్గేష్
- వివిధ దేశాల ప్రతినిధులకు సమగ్ర సమాచారం
- మూడోరోజు జర్మనీ పర్యటనలో బిజీబిజీ బృందం

జర్మనీ: ఏపీలో పర్యాటకం పెట్టుబడులకు ఇదే సరైన సమయమని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్ల డించారు. భారతదేశంలో మరే రాష్ట్రానికి లేని విధంగా ఏపీలో జల, రోడ్డు, వాయు రవాణా సౌకర్యాలతో పాటు అందమైన సహజ సిద్ధ ప్రకృతి ప్రదేశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మూడో రోజు జర్మనీ పర్యటనలో భాగంగా గురువారం బెర్లిన్ సదస్సులో ఏర్పాటు చేసిన ఏపీ స్టాల్ వద్ద మంత్రి దుర్గేష్‌తో పాటు టూరిజం ఎండీ ఆమ్రపాలి వివిధ దేశాల ప్రతిని ధులకు రాష్ట్ర పర్యాటక రంగంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. నూతన పర్యాటక పాలసీ, రాష్ట్ర పర్యాటక ప్రాంతాల సమగ్ర సమాచా రాన్ని తెలిపే పుస్తకాలను పంపిణీ చేశారు. మడ అడవులు, సుదీర్ఘ సముద్ర తీరం, చారిత్రాత్మక ప్రదే శాలు, కోటలు, దట్టమైన అడవులు, ఎత్తయిన కొండలు, చల్లని ప్రదే శాలు, సజీవ నదు లు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, ప్రఖ్యాతి పొందిన బౌద్ధారామాలు సహా రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాలు చాలా ఉన్నాయని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో లగ్జరీ రిసార్ట్స్, వెల్‌నెస్ సెంటర్లు, బహుళ అంతస్తు హోటళ్లు, విభిన్న పర్యాటకానికి, అంతర్జాతీయ ప్రమాణా లతో కూడిన మౌలిక వసతులకు పెద్దపీట వేసేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసు కుంటుందని వివరించారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించిన విషయాన్ని వివరిస్తూ నూతన పర్యాటక పాలసీ విధి విధానాలు, ఇన్వెస్టర్లకు అందించే రాయితీలు వెల్లడించి పెట్టుబడులను ఆహ్వానించారు.

# విద్యతోనే మహిళల అభివృద్ధి

- మంత్రులు నిమ్మల, సవిత, అనిత, సంధ్యారాణి ఉద్బోధ
- రాష్ట్ర సచివాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాల్లో పాల్గొన్న మంత్రులు
- మహిళలకు అన్నింటా ఎన్టీఆర్, చంద్రబాబు ప్రాధాన్యం: మంత్రి సవిత
- ప్రతి తల్లీ పోలీసే: హోం మంత్రి అనిత
- మహిళలే మహారాణులు: మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



అమరావతి (చైతన్యరథం): విద్యతోనే మహిళల అభివృద్ధి సాధ్యమవుతుందని, ఆడబిడ్డల చదువును ప్రోత్సహించాలని రాష్ట్ర మంత్రులు ఎస్.సవిత, వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. ఏపీ సెక్రటేరియట్ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు హాజరై ప్రసంగించారు. మహిళలకు, ఉద్యోగినులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ, మహిళల అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఆడపడుచులకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఘనత అన్న ఎన్టీఆర్ దేనన్నారు. అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధి చెందేలా ఎన్నో సంక్షేమ పథకాలను సీఎం చంద్రబాబునాయుడు అమలు చేస్తున్నారన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులకు ఎటువంటి హామీ లేకుండా రూ.10 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నారన్నారు.

**ఆడ పిల్లల విద్యను ప్రోత్సహిద్దాం: మంత్రి సవిత**

విద్యతోనే మహిళల అభివృద్ధి సాధ్యమవుతుందని, ఆడబిడ్డల విద్యను ప్రోత్సహిద్దామని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పిలుపునిచ్చారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కుతో పాటు రాజకీయాల్లోనూ ఎన్టీఆర్ ప్రాధాన్యమిచ్చారన్నారు. సావిత్రిబాయీ పూలే ఆశయ సాధనే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు మహిళల ఆర్థికాభ్యున్నతికి అధిక ప్రాధాన్యమిస్తున్నార న్నారు. సీఎం చంద్రబాబునాయుడు మహిళా పక్షపాతి అని, వారిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. మగ పిల్లలను క్రమశిక్షణతో పెంచాలని, వారిలో నైతిక విలువలు పెంపొందించేలా రామాయణ, మహా భారతం బోధించాలని సూచించారు. ఆడ బిడ్డలు ధైర్యంగా ఇంటి నుంచి బయటకెళ్లేలా కృషి చేద్దామని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

**మగపిల్లలపై ప్రత్యేక దృష్టి: హోం మంత్రి అనిత**

కుటుంబాన్ని నడిపే క్రమంలో ప్రతి తల్లీ పోలీసులా వ్యవహరించాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సూచించారు. ప్రస్తుతమున్న పరిస్థితుల నేపథ్యంలో మగపిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంటిలో స్త్రీలను గౌరవించినట్లే బయట స్త్రీలతోనూ సభ్యతతో మెలిగేలా చూడాలన్నారు. తల్లిదండ్రుల కష్టం పిల్లలకు తెలిసేటట్లు పెంచితేనే, వారికి జీవితం పట్ల బాధ్యత ఏర్పడుతుందన్నారు. మగపిల్లలను నైతిక విలువలతో పెంచుతూనే, ఆడ బిడ్డలకు స్వేచ్ఛగా, నిర్ణయాలు తీసుకునేలా తీర్చిదిద్దాలని మంత్రి అనిత ఉద్బోధించారు.

**వేధింపులపై ఫిర్యాదు చేస్తే తక్షణ చర్యలు: మంత్రి సంధ్యారాణి**

ఆడపడుచులకు గౌరవ మర్యాదలు పెంచుతూ, మహిళల విద్యకు ప్రాధాన్యమిచ్చిన ఘనత అన్న ఎన్టీఆర్ దేనని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కొనియాడారు. ఈనాడు మహిళలు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, ఇతర ఉన్నతాధికారులుగానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారంటే ఆనాడు అన్న ఎన్టీఆర్ మహిళా విద్యకు ప్రాధాన్యమివ్వడం వల్లేనన్నారు.

ఎన్టీఆర్ ఏజెన్సీల్లో హాస్టళ్లు, గురుకుల పాఠశాలలను స్థాపించారన్నారు. ఆడబిడ్డలను ఆంక్షలతో కాకుండా మగపిల్లలతో సమానంగా పెంచాలని మంత్రి పిలుపునిచ్చారు. మహిళలే మహారాణులని కొనియాడారు. ఉద్యోగం చేసే చోట వేధింపులు, అవమానాలు ఎదురైతే తక్షణమే తమకు ఫిర్యాదు చేస్తే, న్యాయం చేస్తామని మంత్రి సంధ్యారాణి అభయమిచ్చారు. కార్యక్రమం అనంతరం మహిళా ఉద్యోగులతో కలిసి మంత్రులు సవిత, అనిత, గుమ్మిడి సంధ్యారాణి సెల్ఫీ తీసుకున్నారు. వారంలో ఒక రోజు ఇంటిలోనూ, విధుల్లోనూ చేనేత వస్త్రాలు ధరించాలని, చేనేతలకు అండగా నిలవాలంటూ మహిళా ఉద్యోగులను మంత్రి సవిత పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సచివాలయ మహిళ ఉద్యోగినుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు కే వైదురిదేవి, ఉపాధ్యక్షురాలు ఎం. లక్ష్మణకుమారి, సెక్రటరీ సుస్మిత, ఇతర సభ్యులు రాజేశ్వరి, నాగలలిత దేవి, సునీత, శారదతో పాటు వివిధ శాఖలకు ఉద్యోగినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీటెక్ సర్టిఫికెట్లు ఇప్పించండి సారూ..

- ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక ఇబ్బందులు
- గత ప్రభుత్వంలో అన్యాయంపై విద్యార్థి ఆవేదన
- న్యాయం చేయాలని ప్రజావినతుల్లో గోడు
- అర్జీలు స్వీకరించిన పల్లె, గుమ్మిడి గోపాలకృష్ణ





మంగళగిరి(చైతన్యరథం): తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులు నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన వినతుల స్వీకరణ కార్యక్రమానికి తరలి వచ్చారు. వారి నుండి మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణలు అర్జీలు స్వీకరించి వెను వెంటనే అధికారులతో ఫోన్లలో మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

– తాను ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో 2020–2024 మధ్య బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేయగా అప్పటి ప్రభుత్వం ఫీజ్ రీయింబర్స్‌మెంట్ సక్రమంగా చెల్లించకపోవడంతో తన సర్టిఫికెట్లు ఇవ్వలేదని ఏలూరు జిల్లా వెంకటాపురం గ్రామానికి చెందిన వనమాడి ఫణికుమార్ తెలిపారు. దాంతో తాను ఎంటెక్ సీటు కోల్పోవాల్సి వచ్చిందని.. దయచేసి తన సర్టిఫికెట్లు ఇప్పించాలని అభ్యర్థించాడు.

– ప్రకాశం జిల్లా గిద్దలూరు డివిజన్ పరిధిలో కొన్ని సంవత్సరాలుగా తాము వెదురు బొంగుల ఫిల్లింగ్ టెండర్ తీసుకుని స్థానిక ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నామని గిద్దలూరు రుకు చెందిన పలువురు కాంట్రాక్టర్లు తెలిపారు. ప్రస్తుతం అటవీ శాఖ అధికారులు ఇంకా టెండర్ ఇవ్వలేదని.. వీలైనంత త్వరగా టెండర్ ఇచ్చేలా చూస్తే దాదాపు 1000 మందికి పైగా ఉపాధి దొరుకుతుందని వివరించారు.

– పోలవరం ప్రాజెక్ట్ భూ సేకరణలో భాగంగా గతంలో సర్వే చేసి ఒకసారి భూమికి హద్దులు ఏర్పాటు చేశాక మళ్లీ అధికారులు ఇటీవల వచ్చి భూ సేకరణ పేరుతో పేద రైతులు ఎప్పటి నుండో సాగు చేసుకుంటున్న భూములను తీసుకునేందుకు యత్నిస్తు న్నారని ఏలూరు జిల్లా పోలవరం మండలం ఎల్ఎన్‌డీ పేటకు చెందిన పలువురు రైతు లు ఫిర్యాదు చేశారు. దీంతో నష్టపోయే అవకాశం ఉందని.. పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని గూడవల్లి సుబ్బారావుతో పాటు రైతులు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.



– తాను ఏపీవీవీపీ(డీఎస్‌హెచ్)లో 2018 నుంచి ఉండటం వల్ల క్రమబద్ధీకరణలో తనకు అన్యాయం జరిగిందని కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన డి.జయసుధ విన్నవిం చారు. తనను తన మాతృ సంస్థ డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్‌కు పంపి రెగ్యులర్ చేయాలని వినతిపత్రం అందజేశారు.

– తాను ఎన్టీఆర్ జిల్లా నందిగామలో అచ్చి నరసింహారావు అనే వ్యక్తి వద్ద ఇల్లు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోగా ఇల్లు ఖాళీ చేసేందుకు ఐదు నెలలు గడువు కోరి పది నెలలు అయినా ఖాళీ చేయలేదని పల్నాడు జిల్లా గురజాల మండలం పులిపా డు గ్రామానికి చెందిన యాగంటి వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశాడు. అడిగితే ఖాళీ చేసి వెళ్లేది లేదని బెదిరిస్తూ దిక్కున్న చోటకు వెళ్లి చెప్పుకోండని అంటున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇల్లు ఖాళీ చేయించి న్యాయం చేయాలని కోరాడు.

# మరో మూడు రోజులపాటు఼ తారెత్తించనున్న ఎండలు



ఈ ఏడాది వేసవి ప్రారంభంలోనే ఎండలు తారెత్తిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఉష్ణోగ్రతలు రికార్డ్ స్థాయిలో నమోదు అవుతుండగా.. కొన్నిప్రాంతాలు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి.. చాలా ప్రాంతాలలో వడగాల్పులు వీచే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. ఈ క్రమంలో అమరావతి వాతావరణ కేంద్రం కీలక ప్రకటన విడుదల చేసింది. దిగువ ట్రోపో ఆవరణములో కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం, రాయలసీమలో పడమర – వాయువ్య దిశగా గాలులు వీస్తున్నాయని పేర్కొంది. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలు ఈ కింది విధంగా ఉండనున్నట్లు తెలిపింది. శుక్రవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణము కంటే 2 నుండి 4 డిగ్రీల సెంటీగ్రేడ్ ఎక్కువగా నమోదయ్యే అవకాశముంది. శనివారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణము కంటే 2 నుండి 3 డిగ్రీల సెంటీగ్రేడ్ ఎక్కువగా నమోదయ్యే అవకాశముంది. శుక్రవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. అలాగే వేడి, తేమతో కూడిన వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణము కంటే 2 నుండి 4 డిగ్రీల సెంటీగ్రేడ్ ఎక్కువగా నమోదయ్యే అవకాశముంది. శనివారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణము కంటే 2 నుండి 3 డిగ్రీల సెంటీగ్రేడ్ ఎక్కువగా నమోదయ్యే అవకాశముంది.

రాయలసీమ... గురువారం, శుక్రవారం, శనివారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణము కంటే 2 నుండి 3 డిగ్రీల సెంటీగ్రేడ్ ఎక్కువగా నమోదయ్యే అవకాశముంది. అటు తెలంగాణలో సాధారణం కంటే అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, హనుమకొండలో ఎండ మండిపోతోంది. ఇవాళ ఖమ్మంలో 40 డిగ్రీలకు దగ్గర్లో ఉష్ణోగ్రత నమోదయ్యే ఛాన్స్ ఉంది. హైదరాబాద్‌లోనూ 37 డిగ్రీలు దాటేస్తోంది ఎండ. తెలుగురాష్ట్రాల్లో మార్చిలోనే 125 ఏళ్ల తర్వాత రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు చెప్తున్నారు.

# ఇంటర్ క్వశ్చన్ పేపర్‌లో తప్పులు...



రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఏపీలో మార్చి 1 నుంచే పరీక్షలు ప్రారంభమవగా.. తెలంగాణలో మాత్రం మార్చి 5 నుంచి ప్రారంభమయ్యాయి. అయితే ఏపీలో మార్చి 5వ తేదీన జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ 2 పరీక్ష ప్రశ్నాపత్రంలో ప్రింటింగ్ మిస్టేక్స్ వల్ల అక్షరాలు కనిపించక రాష్ట్రవ్యాప్తంగా పలు కేంద్రాల్లోని విద్యార్థులు అయోమయానికి గురయ్యారు. ఐదు మార్కులకు సంబంధించిన 8, 13 ప్రశ్నలు క్వశ్చన్ పేపర్లలో సరిగ్గా ముద్రణ జరగలేదు. ఈ విషయాన్ని విద్యార్థులు ఇన్విజిలేటర్ల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఇంటర్ బోర్డు అధికారుల సూచన మేరకు ప్రింటింగ్ సరిగ్గా ఉన్న ప్రశ్నపత్రాల నుంచి ఆ రెండు ప్రశ్నలను వేరుగా జిరాక్స్ తీసి ఒకరి తర్వాత మరొకరు మార్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. మరికొన్ని చోట్ల ఆ ప్రశ్నలను బ్లాక్ బోర్డులపై రాయగా.. ఇంకొన్ని చోట్ల వైట్ పేపర్లపై వాటిని రాసి విద్యార్థులకు పంపిణీ చేశారు. కాగా ఏపీలో జరుగుతున్న ఇంటర్ పరీక్షల్లో వరుసగా తప్పులు దొర్లడం విద్యార్థులతోపాటు తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. మార్చి 1వ తేదీన జరిగిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ తెలుగు ప్రశ్నపత్రంలోనూ తప్పులు దొర్లాయి. ఇక మార్చి 5వ తేదీన సెకండ్ ఇయర్ ఇంగ్లిష్ పేపర్‌లో మరోమారు ప్రశ్నపత్రంలో ప్రింటింగ్ సరిగ్గాలేనందున రెండు ప్రశ్నలకు తప్పులు కనిపించాయి. దయాగ్రాం ఆధారంగా ఇచ్చిన రెండు ఐదు మార్కుల ప్రశ్నలకు దయాగ్రాంలు సరిగా ప్రింట్ కాలేదు. దయాగ్రాంలలో ఇచ్చిన అంకెలు, పదాలు మసకగా కనిపించాయి. దీంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. పరీక్ష మొదలైన 25 నిమిషాలకే ఈ సమస్య వెలుగులోకి రావడంతో ఇంటర్ బోర్డు అధికారులు వెంటనే స్పందించి విద్యార్థులకు ఆయా ప్రశ్నల్లో కనిపించని అంకెలు, పదాలను ఇన్విజిలేటర్ల ద్వారా తెలియజేశారు. మరోవైపు అధికారుల నిర్లక్ష్యమే ఈ తప్పిదాలకు కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇంగ్లిషు పేపర్‌లో వచ్చిన తప్పులపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, తప్పు వచ్చిన రెండు ప్రశ్నలకు అదనపు మార్కులు ఇవ్వాలని పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. భవిష్యత్తులో ఇటువంటి తప్పులు జరగకుండా నివారించాలని, విద్యార్థులకు ఒత్తిడి లేని పరీక్షా వాతావరణాన్ని కల్పించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేష్‌ను కోరుతున్నట్లు లేఖను సమర్పించారు. అయితే పరీక్షల్లో విద్యార్థులు 25 నిమిషాలు కోల్పోయారనే వాదనను ఇంటర్ బోర్డు అధికారులు ఖండించారు. ఆ పరీక్ష రోజు ఉదయం 9 గంటల వరకు తనతో సహా ఎవరికీ ప్రశ్నాపత్రం అందుబాటులో లేదని ఇంటర్మీడియట్ పరీక్షల కంట్రోలర్ వివి సుబ్బారావు స్పష్టం చేశారు. పంపిణీ చేసిన వెంటనే నలుగురు సభ్యుల నిపుణుల బృందం ప్రశ్నాపత్రాన్ని సమీక్షించి, లోపాలు, దిద్దుబాటు సూచనలు అన్ని కేంద్రాలకు పంపించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు వార్తలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

# అసెంబ్లీలో గళం విప్పిన సిక్కోలు ప్రజాప్రతినిధులు





పాతపట్నం (చైతన్యరథం): నియోజకవర్గానికి వంద పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మంజూరు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. అసెంబ్లీ సమావేశంలో నియోజకవర్గ సమస్యలపై మాట్లాడారు. భౌగోళికంగా విశాలమైన పాతపట్నం నియోజ కవర్గంలో ప్రజలు వైద్యానికి దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరి స్థితులున్నాయన్నారు. దీనివల్ల వ్యయప్రయాశలకు గురవుతు న్నారని, జిల్లా కేంద్రానికి మెరుగైన అత్యవసర పరిస్థితుల్లో వెళ్లాలంటే కనీసం రూ.5 వేలు వెచ్చించాల్సి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

**రోడ్ల పనులకు మోక్షం కల్పించండి : పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష**

అర్ధాంతరంగా నిలిపివేసిన రోడ్ల పనులకు మోక్షం కల్పించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. అసెంబ్లీలో ఆమె మాట్లాడారు. గ్రామీణ రహదా రుల పనులకు 2019 వరకు ఉన్న టీడీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రోడ్ల నిర్మాణాలపై ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిపివేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రహదారులకు మోక్షం కలుగుతోందని, అయితే గతంలో సగంలో ఆగిపోయిన పనులను పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వ్యవహారంపై అధికారులకు ప్రశ్నిస్తే గతంలో నిధులు మంజూరయ్యాయని, కొత్తగా ఇవ్వ లేమని చేతులు ఎత్తేస్తున్నారన్నారు. దీనివల్ల ప్రజల్లో వ్యతిరేక భావం కలుగుతోందని తగు నిర్ణయం తీసుకుని పనుల్లో పురోగతికి చొరవ చూపాలని కోరారు.

**చేనేత కార్మికులను ఆదుకోవాలి : నడుకుదిటి ఈశ్వరరావు**

వెనుకబడిన చేనేత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. బుధవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. మంగళగిరి, పొందూరు, ఉప్పాడ చేనేత వస్త్రాలు రాష్ట్ర ఖ్యాతని ఇనుమడింజేశాయ న్నారు. కేంద్రం నేషనల్ హేండ్లూమ్ డెవలప్ ప్రోగ్రాం ద్వారా సెక్టార్లుగా ఏర్పాటు చేసి చేనేత కార్మికులకు శిక్షణ, నైపుణ్యం, డిజన్లు తదితర వాటిని పెంపొందే కార్యక్రమాలను చేపడుతోందన్నారు. ముద్రా రుణాల ద్వారా చేనేత కార్మికులను ఆదుకోవడం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో చేనేత కార్మికులు దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తు న్నారని, భర్త, భార్య కష్టపడితే పూటగడవని దుస్థితి నెలకొందన్నారు. ఉపాధి పథకం చేనేత కార్మికులకు అనుసంధానం చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అస్సాం రాష్ట్రంలో చేనేత కార్మికుల సంక్షేమం కోసం అక్కడ ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలపై మన ప్రభుత్వం అధ్యయనం చేస్తే బాగుం టుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# చిన్ననాటి మధుర స్మృతులను నెమరువేసుకున్న ఎంపీ



విశాఖపట్నం (చైతన్యరథం): ఇంటర్మీడియట్ చదువుకునే రోజుల్లో భోజనం పెట్టిన ఆప్యాయంగా చూసిన తన స్నేహితుడు తరపట్ల శ్యాంప్రసాద్ స్వగృహానికి వెళ్లి వారి పెద్దమ్మ సూర్యకాంతం వద్ద ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆశీర్వాదం తీసుకున్నారు. తాను ఇంటర్మీడియట్ చదువునే రోజుల్లో తనను ఆప్యాయంగా చూసుకున్న కారణంగా నేడు ఎంపీ హోదాలో విశాఖపట్నంలోని తన స్నేహితుడు తరపట్ల శ్యాంప్రసాద్ స్వగృహానికి వెళ్లి తనకు భోజనం పెట్టి సొంత కుమారుని లాగే అత్యంత ప్రేమగా చూసుకున్న వారి పెద్దమ్మ సూర్యకాంతంని కలిసి ఆవిడ బాగోగులు అడిగి తెలుసుకుని ఆశీర్వాదం తీసుకున్నారు. కుల, మతాల బేధం లేకుండా క్రైస్తవ మతాన్ని అనుసరించే శ్యాంప్రసాద్ పెద్దమ్మ తనను ఇంటర్మీడియట్ రోజులలో చాలా ఆప్యాయంగా చూసుకున్నారని, సెలవలు ఎప్పుడొచ్చినా శ్యాంప్రసాద్ ఇంటికి వెళ్లి వారి ఆప్యాయతకు, వారు తనను చూసిన విధానానికి ఎల్లప్పుడూ వారికి రుణపడి ఉంటానని ఈ సందర్భంగా కలిశెట్టి తన చిన్ననాటి రోజులను గుర్తు చేసుకున్నారు.ఆనాటి అనుబంధాలు ఆప్యాయతలు ఎంత దృఢంగా ఉన్నాయనడానికి తన చిన్ననాటి రోజులే నిదర్శనమని అప్పలనాయుడు భావోద్వేగానికి గురయ్యారు. శ్యాంప్రసాద్ పెద్దమ్మని కలవడం చాలా సంతోషంగా ఉందని, ఒక్కసారే చిన్ననాటి అనుభూతులు తట్టుకోవడం కూడా మనసుకు చాలా ఉత్తేజాన్ని ఇచ్చాయని అన్నారు.

# పీడీఎస్ ధాన్యమంటే స్మగ్లింగ్ కోసమే అన్నట్లుగా మార్చిన వైసీపీ

అమరావతి (చైతన్యరథం): చౌక బియ్యం నిల్వ ఉంచే బఫర్ గోదాముల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో కూడిన కెమెరాలు బిగించబోతున్నామని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. పీడీఎస్ బియ్యంపై శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కొండబాబు, కూన రవికుమార్, వెనిగండ్ల రాము తదితర సభ్యులు అడిగిన ప్రశ్నలకు నాదెండ్ల మనోహర్ సమాధానమిచ్చారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా నిరోధించేలా కాకినాడ యాంకరేజ్ పోర్టు వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని ఎన్‌టీపీ ఇచ్చిన తర్వాతే సదరు లారీలు నౌకలో లోడ్ చేసేలా కార్యాచరణ చేపట్టామన్నారు. వీటితో పాటు సముద్రంలోకి వెళ్లే బార్జ్?లను కూడా తనిఖీలు చేస్తున్నట్టు మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కాలంలో 76 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని స్మగ్లింగ్ చేస్తుండగా పట్టుకున్నారని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం ఆరు నెలల్లోనే 60 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తుండగా పట్టుకున్నామని మంత్రి తెలిపారు. ధరల నియంత్రణ కోసం ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని మంత్రి వివరించారు. చౌక దుకాణాల ద్వారా కందిపప్పు 67 రూపాయలకు కిలో చొప్పున, చక్కెర 17 రూపాయలకు అందిస్తున్నామన్నారు, ధరల స్థిరీకరణ పై గ్రూఫ్ ఆఫ్ మినిస్టర్స్?ను కూడా ఏర్పాటు చేశారని మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు నియంత్రణ కోసం ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు.



## చట్టసభల్లో మహిళలకు భాగస్వామ్యానికి కృషి చేస్తున్నాం

●అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేడుకల్లో మంత్రి నిమ్మల రామానాయుడు.



పాలకొల్లు (చైతన్యరథం): నాడు అన్న ఎన్టీఆర్ గానీ, నేడు చంద్రబాబు నాయుడు గానీ నా తెలుగింటి ఆడపడుచులు అని మహిళలను ఎంతో గౌరవించి, వారికోసం దేశంలో ఏ రాష్ట్రం లోనూ లేని విధంగా సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని తెలిపారు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. గురువారం అమరావతి సచివాలయంలో, ఆంధ్రప్రదేశ్ సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొని మహిళా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆడపడుచులకు ఆస్తిలో వాటా హక్కు కల్పించిన ఘనత అన్న ఎన్టీఆర్ ది అని, అదేవిధంగా డ్వాక్రా పథకంను తెలుగుదేశం ప్రభుత్వం తీసుకొచ్చిందని, 10లక్షల రూపాయల వరకు ఎటువంటి హామీ లేకుండా ఆయా డ్వాక్రా సంఘాలకు బ్యాంకులు అందిస్తున్నాయంటే అదంతా ఎన్టీఆర్, చంద్రబాబుల కృషే అని తెలిపారు. ఆర్టీసీలో మహిళలను కండక్టర్లుగా స్థానం కల్పించడంతో పాటు, దేశంలో ఎక్కడా లేని ఎన్నో సంక్షేమ పథకాలు మహిళల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారని, అదేవిధంగా మహిళా సాధికారత కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు పని చేస్తున్నారని, చట్టసభల్లో కూడా మహిళల భాగస్వామ్యం పెంచేలా ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు.

## నూతన దంపతులను ఆశీర్వదించిన స్పీకర్ అయ్యన్న, హీరో కళ్యాణ్ రామ్



పి.గన్నవరం (చైతన్యరథం): అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం చాకలిపాలెంలో జరిగిన వివాహ వేడుకకు రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు హాజరయ్యారు. నవ దంపతులను ఆయన ఆశీర్వదించారు. జూనియర్ ఎన్టీఆర్ సిద్ధాంతి కారుపర్తి కోటేశ్వరరావు కుమార్తె గాయత్రి వివాహానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ప్రముఖ సినీ నటుడు నందమూరి కళ్యాణ్ రామ్, జూనియర్ ఎన్టీఆర్ తల్లి షాలిని, భార్య లక్ష్మీ ప్రణతి, అత్త నార్నె మల్లిక హాజరై నూతన జంటను ఆశీర్వదించారు. ఈ వేడుకలు కృష్ణ బాలాజీ కన్వెన్షన్ హాల్‌లో జరిగాయి. హీరో కళ్యాణ్‌రామ్‌ను చూసేందుకు అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. సెల్ఫీలు తీసుకుని మురిసిపోయారు.

## కులధృవీకరణ విషయంలో తీవ్ర అన్యాయం



రాజమహేంద్రవరం (చైతన్యరథం): కులధృవీకరణ విషయంలో బేడబుడగ జంగాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బేడబుడగజంగాలు ఎస్సీలుగా ఉన్నామని విభజన అనంతరం ఏ జాబితాలో ఉన్నామో తెలియదని వారు వాపోయారు. గురువారం తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మాజీ మంత్రి కె.ఎస్. జవహర్‌ను కలిశారు. కులధృవీకరణ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని జవహర్ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు యలమర్తి మధు, జిల్లా కార్యదర్శి కప్పుకి వెంకన్న, జిల్లా కార్యదర్శి ముగ్గ వెంకటేష్, కప్పిరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం అక్రమ రవాణా దోషులను కఠినంగా శిక్షించాలి

●శాసనసభలో ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



కాకినాడ (చైతన్యరథం): గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో పేదవాడికి అంద వలిసిన రేషన్ బియ్యాన్ని కాకినాడను కేంద్రంగా చేసుకొని ఇతర దేశాలకు అక్రమంగా తరలించిన దోషులను కఠినంగా శిక్షించాలని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు గురువారం శాసనసభలో ప్రశ్నోత్తర సమయంలో ప్రశ్నించారు. ఈ సందర్భంగా వనమాడి కొండబాబు మాట్లాడుతూ... పేదవాడికి అందవలసిన రేషన్ బియ్యాన్ని గత వైసీపీ ఐదేళ్ల పాలనలో జగన్‌రెడ్డి కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి కలిసి లక్షల టన్నుల బియ్యాన్ని కాకినాడ కేంద్రంగా చేసుకొని ఇతర దేశాలకు తరలించి వేల కోట్ల రూపాయలను ప్రభుత్వ ప్రజాధనాన్ని దోచుకున్నారని, సివిల్ సప్లై చైర్మన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా తన కుటుంబ సభ్యులనే పెట్టుకుని మానస క్వాలిటీ ఎంటర్ప్రైజెస్ ద్వారా రేషన్ బియ్యంను ఇతర దేశాలకు తరలించారని, ప్రతిపక్ష పార్టీగా ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన గత పాలకులు స్పందించలేదని, తూతు మంత్రముగా కింద స్థాయిలో కొంతమంది వ్యక్తులపై కేసులు నమోదు చేసి జగన్ రెడ్డికి ద్వారంపూడి దోపిడీకి గత పాలకులు అధికారులు సహకరించారని, కాబట్టి గత వైసీపీ ఐదేళ్ల పాలనలో కాకినాడ కేంద్రంగా చేసుకొని ఇతర దేశాలకు తరలించిన రేషన్ బియ్యం అక్రమ రవాణా కుంభకోణంపై దర్యాప్తు చేపట్టి వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రేషన్ బియ్యం అక్రమ రవాణాన్ని పూర్తిగా అరికట్టడం జరిగిందని, గత పాలకులు చేసిన రేషన్ బియ్యం అక్రమ రవాణాపై లోతుగా దర్యాప్తు చేపట్టి దోషులను త్వరలోనే శిక్షించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## పోలవరం ప్రాజెక్టులో మట్టి, రాతి నాణ్యత పరిశీలన

పోలవరం (చైతన్యరథం): పోలవరం ప్రాజెక్టు మట్టి, రాతి నాణ్యత పరిశీలన బృందం (సీఎస్ఎంఆర్ఎస్) సెంట్రల్ సాయిల్ అండ్ రాక్ సర్వే, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్ (ఎన్ఐఆర్ఎం) బృందం పరిశీలించింది. ఎర్త్‌కం రాక్‌ఫిల్ డ్యాంలో వినియోగించనున్న మట్టి రాతి నాణ్యత పరిశీలన కార్యక్రమం, డయాఫ్రంవాల్ కాంక్రీట్ సామర్థ్య పరీక్షలు ఈ బృందం రెండు రోజులుగా నిర్వహించింది. కొన్ని రోజుల క్రితం చేగొండపల్లి ప్రాంతంలో బ్లాచింగ్ ప్లాంట్ వద్ద రాతి నాణ్యత కోసం నమూనాలను సేకరించారు. రాతి నమూనాల నాణ్యతా ప్రమాణాలు, డయాఫ్రం వాల్ కాంక్రీట్ నాణ్యతా ప్రమాణాలు తదితర అంశాలను కేంద్రానికి పంపి స్పష్టమైన ఆదేశాలు తీసుకోవలసి ఉంటుంది. రెండు రెండు రోజులుగా ఎర్త్‌కం రాక్‌ఫిల్ డ్యాంలో వినియోగించనున్న మట్టి నాణ్యత ఇతర అంశాలపై ఈ బృందం పోలవరం ప్రాజెక్టులో పలుచోట్ల మట్టి నమూనా సేకరణ చేపట్టారు. అల్లూరి సీతా రామరాజు మన్యం జిల్లా గొందూరు తదితర ప్రాంతాలను బృందం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో సీఎస్ఎంఆర్ఎస్ కాంక్రీట్ నాణ్యత నిపుణులు లలిత్ కుమార్ సోలంకి, రాతి నాణ్యత నిపుణులు వినోద్ గుప్తా, డీఈ నిర్మల క్వాలిటీ కంట్రోల్ డీఈ శివప్రసాద్, డీఈఈ అనిల్ పాల్గొన్నారు.



## పని ఒత్తిడి తగ్గించాలని ఏఎన్ఎంల నిరసన

పని ఒత్తిడితో తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నామని సచివాలయ ఏఎన్ఎంలు ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయ సర్వేలతో పాటు వైద్య ఆరోగ్యశాఖ సర్వేలు కూడా చేయాల్సి వస్తుండడంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామన్నారు. జిల్లా పరిధిలోని లక్కవరం, కేశనపల్లి, తాటిపాక, నగరం, నాగుల్లంక, పి.గన్నవరం, అమలాపురం అర్బన్‌లకు చెందిన సచివాలయ ఏఎన్ఎంలు బుధవారం కేవీఆర్ కుమారి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. తమ ఎస్ఆర్‌లు వైద్య ఆరోగ్యశాఖ వద్ద ఉంటే జీతాలు పంచాయతీరాజ్‌శాఖ చెల్లిస్తున్నందున అటు సచివాలయ పనులు, ఇటు వైద్య ఆరోగ్యశాఖ పనులు ఒకేసారి చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. కేవలం వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన పనులకు మాత్రమే పరిమితం చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందించి ఈనెల8వ తేదీ వరకు ఉన్న వర్కు ఫ్రం హోమ్ సర్వేను పూర్తి చేయాలని, అనంతరం వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన పనులకు మాత్రమే పరిమితం చేసేలా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారితో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

## నిర్భయంగా కోడి గుడ్లు, చికెన్ తినొచ్చు : ఎమ్మెల్యే అరిమిల్లి



తణుకు (చైతన్యరథం): అపోహలు వీడి ప్రజలందరూ నిర్భయంగా ఉడికించిన కోడి గుడ్లు, చికెన్ ఆహారంగా తీసుకోవచ్చని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పష్టం చేశారు. తణుకు పట్టణంలోని నెక్ కళ్యాణ మండపంలో జిల్లా పౌల్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చికెన్ అండ్ ఎగ్ మేళా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణతోపాటు ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. ప్రస్తుతం సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కోడి గుడ్ల ఉత్పత్తి, ఎగుమతుల్లో రాష్ట్రంలోనే జిల్లా నాలుగో స్థానంలో ఉందన్నారు. కోడి గుడ్డు ద్వారా ఎక్కువ పోషక విలువలు లభిస్తాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు గుడ్లు సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఇటీవల పరిణామాలతో నష్టపోయిన పౌల్ట్రీ రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. ముందుగా చికెన్తో తయారు చేసిన పదార్థాలు, ఉడికించిన గుడ్లను వచ్చిన వారికి ఉచితంగా పంపిణీ చేశారు. గుడ్డు తినే బయటకు వెళ్లా: ఆరిమిల్లి అల్పాహారంలో భాగంగా తాను రోజూ ఉడికించిన కోడి గుడ్డు తింటానని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 300 మంది పౌల్ట్రీ రైతులు కోటి 60 లక్షల కోళ్ల పెంపకం చేస్తున్నారు. పౌల్ట్రీ పరిశ్రమను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మురళీ కృష్ణ మాట్లాడారు. ప్రజలంతా భయం వీడి నిర్భయంగా చికెన్, గుడ్లను ఉడికించుకొని తినవచ్చని స్పష్టం చేశారు. కోళ్లకు వైరస్ సోకిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి వెంటనే చర్యలు చేపట్టడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ పౌల్ట్రీ ఫెడరేషన్ చైర్మన్ కేవీ సుబ్బారావు అన్నారు. తాడేపల్లిగూడెం ఆర్డీవో కౌసర్ భానో, నెక్ చైర్మన్ మల్లిన శ్రీనివాసరావు పశుసంవర్ధక శాఖ ఏడీ నరసింహమూర్తి, మండల పశువైద్యాధికారి కరణం శంకర్ భావనారాయణ, మున్సిపల్ కమిషనర్ రాము కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చక్రం తిప్పిన పెమ్మసాని... నందివెలుగు ఆర్ఓబీ నిధులు బాధ్యత ఇక కేంద్రానిదే

### ●రాష్ట్ర ప్రభుత్వ వాటా కేంద్రమే భరించేలా ఆమోదం



గుంటూరు (చైతన్యరథం): కేంద్ర ప్రభుత్వ నిధులను గుంటూరుకు తేవడంలో కేంద్రమంత్రి పెమ్మసాని చక్రం తిప్పారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర నిధులతో ఊరట కల్పిస్తున్నారు. రాష్ట్ర ఖజానాకు భారం తగ్గిస్తూ గుంటూరు అభివృద్ధిని పరుగులు తీయిస్తున్నారు. రాష్ట్రంపై పైసా భారం లేకుండా నందివెలుగు ఆర్‌బీ(ఎల్.సీ.నెం.249)నిర్మాణ పూర్తి బాధ్యతను కేంద్రమే చేపట్టేలా పెమ్మసాని ఢిల్లీ నుంచి నిధులు తెచ్చారు. ఆయన చేసిన కఠోర కృషికి నిదర్శనంగా నందివెలుగు ఆర్వోబీ నిర్మాణానికి కేంద్ర రైల్వే శాఖ రూ.36.91 కోట్ల పూర్తి బాధ్యతను సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ తీసుకోవాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ అంతర్గతంగా ఆ శాఖకు ఆదేశించారు. ఈ అంశాన్ని పెమ్మసాని గురువారం స్పష్టం చేశారు. దసరాకు శంకర్ విలాస్(ఎల్సీ. నెం. 497-ఏ) ఆర్వోబి, సంక్రాంతి పండుగకు ఎల్సీ. నెం.3 ఇన్నర్ రింగురోడ్డు గడ్డిపాడు ఆర్వోబి, అనంతరం పెదపలకలూరు-పేరేచర్ల(ఎల్సీ. నెం.6) ఆర్వోబి మంజూరు చేయించిన పెమ్మసాని తాజాగా ఉగాదికి నందివెలుగు ఆర్వోబీని గుంటూరుకు పండుగ కానుకగా అందిస్తున్నారు.

**ఎల్.సీ.నెం: 249 బాధ్యత కేంద్రానిదే**

గుంటూరు నుంచి తెనాలి పట్టణానికి రవాణా కనెక్టివిటీ పెంచడం, గుంటూరులో ట్రాఫిక్ సమస్యలను తగ్గించడంలో భాగంగా అప్పటి టీడీపీ ప్రభుత్వం గుంటూరు-హనుమాన్పలెం వరకు 850 మీటర్ల పొడవున ఎల్.సీ. నెం: 249 ఆర్వోబీ నిర్మాణానికి 2014లో ఆమోదం తెలిపింది. 2017లో మొదలైన ఆ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో 2019 కల్లా పూర్తి చేసేలా అప్పట్లో ఒప్పందాలు కుదిరాయి. కానీ, ఆ ప్రాజెక్టుకు అనేకమార్లు నిర్దిష్ట కాల పరిమితిని పెరుగుతూ వచ్చింది. కాగా 2019 తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ వాటాను చెల్లించడంలో చేతులెత్తేసింది. అప్పటికే రూ.6.18 కోట్ల కేంద్ర రైల్వే శాఖ, రూ.10.82 కోట్లను అప్పటి టీడీపీ ప్రభుత్వం వ్యయం చేసి, బ్రిడ్జ్ పనులను చేపట్టింది. కొంత మేర పనులు పూర్తి కాగా 2019 తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో రాష్ట్ర ప్రభుత్వ వాటాగా చెల్లించాల్సిన రూ.8కోట్లను చెల్లించడంలో చేతులెత్తేసింది. అప్పటి నుంచి ఏళ్లు గడుస్తున్నా వీడని నిర్లక్ష్యం కారణంగా ఆ నిర్మాణ పునాదులు మొండి గోడల్లా మిగిలి పోయాయి.

## పెంచిన రూ.6 వేల హెల్త్ అలవెన్స్ ఇప్పించాలి

విజయవాడ (చైతన్యరథం): విజయవాడ నగర పాలక సంస్థ పారిశుద్ధ్య విభాగం వెహికల్ డిపోలో పని చేసే మెకానిక్స్, హెల్పర్స్ వెహికల్ డిపోలో పనిచేసే డ్రైవర్లు, క్లీనర్స్‌కు పెంచిన హెల్త్ అలవెన్స్ రూ.6 వేలు తమకు ఇప్పించాలని కోరుతూ ఎంపి కేశినేని శివనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. ఏపీ బిల్డింగ్స్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ అడ్వైజర్ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు ఆధ్వర్యంలో గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయంలో ఎంపి కేశినేని శివనాథ్‌ను వెహికల్ డిపోలో పని చేసే మెకానిక్స్, హెల్పర్స్ కలిశారు. విజయవాడ నగర పాలక సంస్థ పారిశుద్ధ్య విభాగం వెహికల్ డిపోలో 700 మంది పనిచేస్తుండగా దాదాపు 650 మందికి డ్రైవర్లు, క్లీనర్స్‌కి హెల్త్ అలవెన్స్ కింద రూ.6 వేలు పెంచి ఇస్తున్నారు. ఈ వెహికల్ డిపోలో మెకానిక్స్, హెల్పర్స్‌గా పనిచేస్తున్న తమ 50 మందికి పెంచిన హెల్త్ అలవెన్స్ ఇవ్వటం లేదని తెలిపారు. తమని కూడా పారిశుద్ధ్య కార్మికులుగా పరిగణనలోకి తీసుకుని రూ.6 వేలు హెల్త్ అలవెన్స్ ఇప్పించవల్సిందిగా విజ్ఞప్తి చేశారు. విజయవాడ నగర పాలక సంస్థకి చెందిన పారిశుద్ధ్య వాహనాలను రిపేర్ చేసే సమయంలో వాహనాల్లోని అనేక వ్యర్థాలు తమపై పడుతూ వుంటాయని, ఇందుకోసం ఆరోగ్య సమస్యలతో పాటు చర్మవ్యాధుల భారిన పడుతున్నట్లు తెలిపారు. వారి సమస్యలపై ఎంపీ కేశినేని శివనాథ్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో తెలుగునాడు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాంబాబు, తోకల రమేష్, డి.బాబురావు, సత్తిబాబు, రంగారెడ్డి, మల్లెపల్లి నాని లతో పాటు మెకానిక్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.



## నియోజకవర్గంలో ధాన్యం సేకరణ చేయాలి : యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం (చైతన్యరథం): ఆరుగాలం కష్టపడే రైతు పండించిన పంటకు సరైన ధర చెల్లించి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచి, భవిష్యత్తుకు భరోసా కల్పించడమే రైతుకి ఇచ్చే నిజమైన గౌరవమని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీ సమావేశాలలో నియోజకవర్గంలోని పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎన్డీయే ప్రభుత్వంలో రైతులకు ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే ఖాతాల్లో డబ్బు జమ అయ్యే పరిస్థితి వచ్చిందని.. రైతు తాము పండించిన పంటలను సులభంగా మిల్లులుకు తరలించే సౌకర్యం ఈ ప్రభుత్వం కల్పించిందన్నారు. కృష్ణాజిల్లా లో ఇంకా 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని, గన్నవరం నియోజకవర్గంలో దాదాపు 15 వేల ఎకరాలలో 44 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణ చేయాల్సి ఉందన్నారు. సివిల్ సప్లై శాఖ వారు ఈ సమస్యలపై దృష్టి సారించి రైతుల ధ్యానం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖకు పలు సూచనలు చేశారు. జిల్లా కోటాను డివిజన్ వారీగా వరి పంట ప్రాంతాల ఆధారంగా విభజించాలని మిగిలిపోయిన కుప్పలు మరియు ఆలస్యంగా పంట కోసిన ప్రాంతాలను వరి సేకరణ కోసం పరిగణించాలని సూచించారు.

**వైసీపీ హయాంలో సనాతన ధర్మంపై, ఆలయాలపై దాడులు**

2019-24 వైసీపీ ప్రభుత్వ హయాంలో సనాతన ధర్మంపై, ఆలయాలపై దాడులు జరిగాయని గుర్తు చేశారు. అంతర్వేదిలో నరసింహస్వామి వారి రథాన్ని దగ్ధం చేసిన ఘటన, రామతీర్థంలో రాముల వారి విగ్రహం ధ్వంసం చేసిన ఘటన, విజయవాడ దుర్గమ్మ ఆలయంలో వెండి రథం దొంగిలించిన ఘటన, శ్రీశైలంలో కుంభాభిషేకం జరగకుండా ఆపేసిన ఘటనలు, కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి లడ్డు ప్రసాదాన్ని కల్తీ చేసిన ఘటనలు జగన్ హయాంలో జరిగాయని గుర్తు చేశారు.

**వెటర్నరీ కళాశాల ప్రహరికి మరమ్మత్తులు చేయాలి**

బ్రిటిష్ కాలంలో వెటర్నరీ సిస్టం బ్రహ్మాండంగా ఉండేదని కానీ ప్రభుత్వాలు మారుతున్న కొద్దీ ప్రాధాన్యత కోల్పోతుందని చెప్పారు. వెటర్నరి సిస్టంను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. రైతు సోదరులు పాడిపరిశ్రమపై ఆధారపడతారని కానీ పశు వైద్యులు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గన్నవరం విమానాశ్రయం ఎదురుగా ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల ఉందని, ఆ కళాశాల కళవిహీనంగా తయారైందని అందుకు ఆ కళాశాల ప్రహరీ గోడ సాక్ష్యమని చెప్పారు. మరమ్మతుల కోసం రూ.56 లక్షలు కేటాయించాలని కోరామని వాటిని మంజూరు చేయాలని కోరారు. కెడీసీసీ బ్యాంకులో 2023లో కొనుగోలు చేసిన సాఫ్ట్వేర్ అంశంపై విచారణ జరపాలని యార్లగడ్డ వెంకట్రావు కోరారు. తాను చైర్మన్‌గా ఉన్న హయాంతో సహా 51 ఎంక్వయిరీ వేయమని నవంబర్‌లో మంత్రి ఆదేశిస్తే ఇప్పటికీ ఎంక్వయిరీ మొదలు కాలేదన్నారు. విశాఖ డైరీ తరహాలో విజయ డైరీపై విచారణ చేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ కోరారు.

## అసెంబ్లీకి రాని వ్యక్తి హామీలపై ప్రజాప్రభుత్వాన్ని విమర్శించడం దిగజారుడుతనం కాదా? : ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట (చైతన్యరథం): "అబద్ధాలు.. మోసాలు.. హత్యా రాజకీయాలతో ముఖ్యమంత్రి పదవి దక్కించుకొని, 5 ఏళ్లు రాష్ట్రాన్ని దోచేసి, తమ జీవితాలకు సున్నా చుట్టాడనే జగన్‌కు, వైసీపీకి జనం సున్నం బొట్లు పెట్టి మరీ సాగనంపారు. యువతను, నిరుద్యోగుల్ని తానే ఉద్ధరించినట్టు జగన్ మాట్లాడటం హాస్యాస్పదం." అని మాజీమంత్రి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు వ్యాఖ్యానించారు. 40 లక్షల ఉద్యోగాలిస్తే వైసీపీ పట్టభద్ర ఎన్నికల్లో ఎందుకు పోటీచేయలేదో జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉంటే ఎప్పుడైనా హామీలు అమలుచేయొచ్చని గతంలో చెప్పిన జగన్.. ఇప్పుడు ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించడం దిగజారుడుతనం కాదా? హామీల అమలుగురించి మాట్లాడే నైతికత జగన్ కు లేదు. రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న ఆర్థిక కష్టాలను అధిగమిస్తూ, ప్రజలకిచ్చిన ప్రతి హామీ అమలుకు కూటమి ప్రభుత్వం శ్రమిస్తోంది. పాదయాత్రలో, ఎన్నికల ప్రచారంలో ఎన్ని హామీలిచ్చి... అధికారంలోకి వచ్చాక ఎన్ని అమలు చేశాడో ప్రజల్లోకి వచ్చి జగన్ చెప్పగలడా? ముఖ్యమంత్రిగా పరదాల చాటున.. ఇప్పుడేమో నాలుగ్గోడల మధ్యన.. అదే జగన్‌కు తెలిసిన పాలన. అధికారానికి అనర్హుడు.. అహంకారానికి సరిజోడు.. అవినీతిలో అగ్రజుడు జగన్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. జగన్.. ఎమ్మెల్యే పదవికే ఎక్కువనే వాస్తవం ప్రజలకు అర్థమయ్యే, ఒక్కఛాన్స్ ను చివరి ఛాన్స్ చేసి జగన్ ను ప్యాలెస్‌లకు పరిమితం చేశారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ప్రజాసేవలో భువనేశ్వరి గారు తనకు తానే పోటీ పడుతున్నారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ సేవలకు రాష్ట్రంలో పునాది పడటం పేదలకు వరమనే చెప్పాలి. ట్రస్ట్ కార్యకలాపాలతో భువనేశ్వరి సమాజసేవలో తనకు తానే పోటీ పడుతుండటం తెలుగుజాతి గర్వించాల్సిన విషయం. చంద్రబాబు రాష్ట్ర పురోగతి.. ప్రజాసంతోషం కోసం శ్రమిస్తుంటే, ఆయన భార్య భువనేశ్వరి పేదల ఆరోగ్యం కోసం, సమాజహితం కోసం పాటుపడటం నిజంగా అభినందనీయం." అని పుల్లారావు తెలిపారు.

## సీఆర్ఎఫ్ చెక్‌లు అందజేసిన నక్కా ఆనందబాబు



వేమూరు (చైతన్యరథం): ముఖ్యమంత్రి సహాయనిధి నుండి భట్టిప్రోలు మండలం కొనేటిపురం గ్రామానికి చెందిన జంపని శ్రీనివాసరావు, ఆళ్ళమూడి గ్రామానికి చెందిన రాజులపటి నాంచారయ్య, ఐలవరం గ్రామానికి చెందిన బట్టు కమల అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేసుకున్నారు. చికిత్స కోసం అయిన బిల్లులను వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు నక్కా ఆనందబాబు వారి రిఫరెన్స్ లెటర్ ద్వారా సీఎం కార్యాలయానికి పంపించారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కు రూపంలో మొత్తం రూ.1,79,002 నిధులు మంజూరు చేశారు. మంజూరైన మొత్తాన్ని వారి కుటుంబ సభ్యులకు చెక్కు రూపంలో మాజీమంత్రి నక్కా ఆనందబాబు అందజేశారు.

## మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఇల్లు సౌభాగ్యంగా ఉంటుంది



గుంటూరు (చైతన్యరథం): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ ఇల్లు సౌభాగ్యంగా ఉంటుందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గురువారం పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో జనసేన, బీజేపీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 7,8వ తేదీలలో గుంటూరు జిల్లా టీడీపీ కార్యాలయంలో ఎన్డీయే కూటమి మహిళా నేతలకు మెగా వైద్య శిబిరం నిర్వహించబోతున్నానని, ఈ వైద్య శిబిరంలో గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్ సహా అన్ని వైద్య సేవలు అందిస్తామని ఎమ్మెల్యే గళ్ళ మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నిమ్మల రమణ, బిజెపి సుగుణ, జనసేన రమాదేవి, మామిడి రామారావు,కిషోర్,శివ,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత వర్గాలకు సమన్యాయం జరిగేలా ఏకసభ్య కమిషన్

విజయవాడ (చైతన్యరథం): ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాను దళిత శాసనసభ్యులతో కలిసి మడకశిర నియోజకవర్గ శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు గురువారం కలిశారు. విజయవాడలోని గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా రాజీవ్ రంజన్ మిశ్రాను దళిత శాసనసభ్యులు కలిసి, ఎస్సీ వర్గీకరణపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని దళిత వర్గాలకు సమన్యాయం జరిగేలా ఏకసభ్య కమిషన్ తగు సూచనలను ప్రభుత్వానికి ఇవ్వాలని కోరారు. చంద్రబాబు నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణ విజయవంతం కావాలని, దీనికి తమ వంతు సహాయసహకారాలు అందిస్తామని మిశ్రాకు తెలిపారు.

ఆర్టీసీ ఉపాధ్యక్షుడు పి.ఎస్. మునిరత్నం చేతుల మీదుగా

## మహిళలకు ఈ సైకిళ్లు పంపిణీ



కుప్పం (చైతన్యరథం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కుప్పం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో కుప్పం చిరు వ్యాపారులకు నారీ శక్తి-పర్యావరణ హిత సైకిళ్లను గురువారం పంపిణీ చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, స్వయం సహాయక సంఘాలలో చిరు వ్యాపారులు చేస్తున్న మహిళలకు ఈ సైకిల్‌లను కడ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్టీసీ ఉపాధ్యక్షుడు పి.ఎస్. మునిరత్నం, సిఈఎస్ఎల్ డెలిగేట్స్ రీతూ, చేతన తదితరులు పంపిణీ చేశారు. కడ, సీఈఎస్ఎల్ తో చేసుకున్న ఒప్పందం మేరకు సిఈఎస్ఎల్ స్త్రీ ప్రోగ్రాం కింద ఎనర్జీ చాంపియన్లకు ఇ-సైకిల్‌లను పంపిణీ చేశారు. రూ.40 వేల విలువ చేసే ఈ -సైకిల్‌ను కేవలం రూ.9,450 లకు(అసలు రూ.9 వేలు, జిఎస్టి రూ.450) లతో పంపిణీ చేశారు. సిఈఎస్ఎల్, స్త్రీ కార్యక్రమంలో భాగంగా, కార్గో ఎలక్ట్రిక్ సైకిళ్ల ద్వారా మహిళా స్వయం సహాయక బృందాల నుండి వచ్చిన మహిళా వ్యవస్థాపకులకు స్వచ్ఛ రవాణా, అతి తక్కువ ఖర్చుతో కూడుకున్న పరిష్కారాలను అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకుని, కుప్పంలో 300 మంది ఎస్ హెచ్ జి మహిళలకు అందించడంతో వారు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు. మొదటి దశలో 50 మందికి ఎనర్జీ చాంపియన్లతో ఆర్థిక మార్కెటింగ్, సాంకేతిక నైపుణ్యంతో సన్నద్ధం చేయడానికి, ఈ సైకిల్ పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి శిక్షణ పొందారని కడ పిడి వికాస్ మర్మత్ పేర్కొన్నారు.

## హాస్టళ్ళను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎరిక్షన్ బాబు



యర్రగొండపాలెం, (చైతన్యరథం): దోర్నాల పట్టణంలో సోషల్ వెల్ఫేర్ హాస్టల్, బీసీ వెల్ఫేర్ హాస్టళ్ల కూటమి ప్రభుత్వం ద్వారా చేస్తున్న మరమ్మతుల పనులను యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్-చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనులలో నాణ్యత తగ్గకుండా చర్యలు తీరుకోవాలని అధికారులను కోరారు. రెండు హాస్టళ్లకు 30 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాన్ని చేపడుతున్నారు. అనంతరం విద్యార్థులతో ఎరిక్షన్ బాబు ముచ్చటించారు. హాస్టళ్ళలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, నాణ్యమైన భోజనం ప్రతి ఒక్కరికి అందాలని తెలిపారు. విద్యార్థులకు ఏ సమస్య వచ్చిన పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీగా అఖండ మెజార్టీతో గెలిచిన ఆలపాటికి ప్రత్యేక అభినందనలు

- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత



ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థిగా పోటీచేసి అఖండ మెజారిటీతో గెలుపొందిన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత గుంటూరు నగరంలోని వారి నివాసంలో కలసి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఉద్యోగులు, గ్రాడ్యుయేట్లు, యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎన్డీయే ప్రభుత్వం చేస్తున్న కృషిని గుర్తించి, అలాంటి నాయకత్వానికి మద్దతుగా నిలిచిన వారికి పరిటాల కృతజ్ఞతలు తెలియజేశారు.

పార్కులకు పాఠశాలల్లో క్రీడా మైదానాలకు

# పూర్వ వైభవం తీసుకొస్తాం

- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ



నెల్లూరు (చైతన్యరథం): పట్టనంలోని అన్ని పార్కులను ఆధునీకరించి పూర్వ వైభవం తీసుకొస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. గురువారం 5 డివిజన్ సత్యనారాయణపురంలోని ఎస్వీఆర్ పార్కు, 14వ డివిజన్ ఏసీ నగర్ లోని మాగుంట సుబ్బారామిరెడ్డి పార్కులో ఏర్పాటుచేసిన జిమ్ ఎక్విప్మెంట్, క్రీడా సామాగ్రి, అభివృద్ధి పనులను అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014-19 మధ్యలో తమ ప్రభుత్వ హయాంలో నగరంలోని అన్ని పార్కులను అద్భుతంగా తీర్చిదిద్దామని, అనంతరం వచ్చిన ప్రభుత్వం పార్కులను పట్టించుకోకపోవడంతో క్రీడా సామాగ్రి, పరికరాలు పనికి రాకుండా మూలకు చేరాయని చెప్పారు. మళ్లీ ఇప్పుడు తమ ప్రభుత్వ హయాంలో నగరంలోని అన్ని పార్కులను అప్గ్రేడ్ చేసి అత్యాధునిక వసతులతో చిన్నారులకు ఆనందం, ఆహ్లాదం పంచే విధంగా తయారు చేస్తున్నామని చెప్పారు.

ఇప్పటికే పార్కుల్లో ఏర్పాటుచేసిన క్రీడా సామగ్రితో చిన్నారులు ఆనందంగా కేరింతలు కొడుతూ ఆడుకోవడం మనసుకు చాలా సంతోషంగా ఉందని మంత్రి చెప్పారు. జూన్ 12లోగా పాఠశాలలు ప్రారంభమయ్యే సమయానికి నగరంలోని అన్ని పార్కులను కూడా అత్యాధునిక సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి అన్నారు.

రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో గ్రీన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పార్కులను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి ఆదేశించారని, ఆ మేరకు చర్యలు చేపట్టినట్లు మంత్రి వివరించారు. నెల్లూరు నగరంలో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి కోసం ఈ నెలాఖరులోగా 165 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేయనుందని, ఆ మేరకు పనులు ప్రారంభించేందుకు సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులతో కూడా మాట్లాడినట్టు చెప్పారు. ప్రజలకు అవసరమైన అన్ని పనులను పూర్తి చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని ఈ సందర్భంగా మంత్రి పునరుద్ఘాటించారు.

భారతీయ వైద్య విధానం అభివృద్ధి చెందాలంటే

# ఆయుర్వేద పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలి

- అసెంబ్లీలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్

- **రాష్ట్రవ్యాప్తంగా ఆయుర్వేద వైద్యుల కొరత కనబడుతోంది..**
- **ప్రస్తుతం 14.4 మిలియన్ డాలర్ల ఆయుర్వేద మార్కెట్ ఉంది - మనం దీనిని వృద్ధి చేయాలి**
- **ప్రకృతి వైద్యం ప్రపంచానికి మార్గం చూపుతున్న భారత్, ఆయుర్వేదాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి**



పూతలపట్టు, (చైతన్యరథం): ఆరోగ్య సంరక్షణలో ఆయుర్వేదానికి మరింత ప్రాధాన్యత కల్పించాలని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గురువారం ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఆయుర్వేద వైద్యం యొక్క ప్రాముఖ్యతను ఎమ్మెల్యే తనదైన శైలిలో గళం విప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ.. "ప్రకృతిలో ప్రతిబింబించే కాంతి కిరణం ఆయుర్వేదం" అని వ్యాఖ్యానించారు. ఆయుర్వేదానికి రుగ్వేదం కాలం నుంచి ప్రాధాన్యత ఉండగా, 2014లో కేంద్ర ప్రభుత్వం ఆయుష్ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ నిర్ణయం అనంతరం ఆయుర్వేదం, హెూమియోపతి, యునాని వైద్య విధానాలకు మహర్దశ ప్రారంభమైనట్లు తెలిపారు. 2017లో విడుదలైన జీవో నెంబర్ 128 ప్రకారం, హెూమియోపతి, న్యాచురో పతికి సంబంధించిన 26 డిస్పెన్సరీలను గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేయగా, వాటి నిర్వహణ అస్తవ్యస్తంగా సాగుతోందని ఆయన పేర్కొన్నారు. కరోనా మహమ్మారి తర్వాత దేశవ్యాప్తంగా ఆయుర్వేద వైద్యం వైపు ప్రజలు మరింత ఆకర్షితులయ్యారని, అయితే రాష్ట్రంలో ఆయుర్వేద ఆసుపత్రులు, కళాశాలలు సరైన విధంగా పనిచేయలేదని, ముఖ్యంగా మందులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని ఆయన తెలిపారు. ఆయుర్వేద వైద్యాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం మరింత చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయుర్వేద విశ్వవిద్యాలయం, పరిశోధనా సంస్థల ఏర్పాటుతో ఈ రంగానికి మరింత వృద్ధి కలుగుతుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం 24 దేశాల్లో ఆయుర్వేద ప్రాక్టీస్ అమలులో ఉండగా, అభివృద్ధి చెందిన దేశాలు కూడా దీనిని పాలసీగా తీసుకోవడం గమనార్హమని తెలిపారు. ఆయుర్వేద ఔషధాల వ్యాపారం దాదాపు 14.4 మిలియన్ డాలర్లకు పెరిగింద న్నారు. ఆయుర్వేద మొక్కల సాగుకు ప్రోత్సాహం, ఆయుర్వేద ఉత్పత్తుల ప్రమోషన్స్ చేయడం ద్వారా భవిష్యత్తులో ఆయుర్వేద ఆసుపత్రులకు, ఇన్‌స్టిట్యూట్ల అవసరాలు తీర్చడంతో పాటుగా, ఆయుర్వేద వైద్యానికి మరింత బలం చేకూర్చేందుకు అవకాశం ఉందని మురళీమోహన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# భూపరిహారం అందించి ఆదుకోవాలి

- కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి



కనిగిరి (చైతన్యరథం): కనిగిరి నియోజకవర్గంలో రైతులు, గృహ యజమానులకు పరిహారం అందించాలని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గురువారం అసెంబ్లీ సమావేశాల్లో కోరారు. మైదుకూరు సింగరాయకొండ 167 బి హైవే రోడ్డులో భూసేకరణ సమయంలో ప్రభుత్వ భూమి కింద నిర్ణయించి జీరో అవార్డు ఇచ్చారని, వాస్తవ పరిస్థితుల దృష్ట్యా అక్కడ పట్టాదారులు ఉన్నారని, కానీ యజమానులకు భూ పరిహారం అందజేయలేదన్నారు. దీనితో పట్టాదారులు అంగీకరించకపోవడంతో హైవే రోడ్డు పనులకు ఇబ్బంది ఏర్పడిందని, అదేవిధంగా బెంగుళూరు గ్రీన్ ఫీల్డ్ హైవే 5.4Gలో గుంత చెన్నంపల్లి గ్రామంలో కూడా ఇదే విధంగా రైతులకు నష్టపరిహారం ఇవ్వకుండా అధికారుల నిర్లక్ష్యం వలన అక్కడ కూడా గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి ఆటంకం ఏర్పడిందన్నారు. ఏర్పేడు, హైదరాబాద్ 565 హైవే బైపాస్ రోడ్డు 2014లో టెండర్ పిలవడం జరిగిందని, ఇక్కడ కూడా పట్టాదారులకు భూ పరిహారం చెల్లించకపోవడం వలన అక్కడ కూడా ఇదే పరిస్థితి ఏర్పడిందన్నారు. నడికుడి శ్రీకాళహస్తి రైలు మార్గంలో కనిగిరి మండలం పేరం గుడిపల్లి వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టేందుకు అక్కడ ఏడు గృహాలు ఏర్పాటు చేసుకొని ఉన్నవారికి ఆ రెవెన్యూ అధికారులు ఎలాంటి నిర్మాణాలు లేవు అని ప్రభుత్వానికి సరియైన నివేదిక ఇవ్వక పోవడంతో భూ పరిహారం చెల్లించని కారణంగా కాలనీవాసులు ఖాళీ చేయకపోవడంతో పనులకు ఆటంకం ఏర్పడింది అన్నారు. తక్షణమే రైతులకు న్యాయం చేయకపోతే కనిగిరి నియోజకవర్గంలో హైవే నిర్మాణ పనులు ఆగిపోయే ప్రమాదం ఉందని కావున రెవెన్యూ మంత్రి చొరవ తీసుకుని వారికి న్యాయం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహ రెడ్డి కోరారు.



సెక్రటేరియట్‌లోని 3వ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన ఆప్కో హ్యాండ్లూమ్ స్టాల్ ప్రారంభ కార్యక్రమంలో బీసీ,చేనేత శాఖ మంత్రి సవితమ్మ, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణితో కలిసి శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రావణి చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. చేనేతలను ప్రోత్సహించేందుకు చేనేత వస్త్రాలను ప్రతి ఒక్కరూ ధరించాలని కోరారు.





వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి ఈ సంధర్భంగా నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి - సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందజేసిన శ్రావణి ... సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి



## కేసీ కెనాల్‌కు నీరు విడుదల

అళ్లగడ్డ, (చైతన్యరథం): కేసీ కెనాల్ రైతులకు నీరు తెప్పిస్తామని రైతులకు హామీ ఇవ్వడం జరిగిందని అళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియా అన్నారు. మాట ప్రకారం సుంకేసుల నుండి 1700 క్యూసెక్కులు అలాగే మల్యాల నుండి 650 క్యూసెక్కులు మొత్తం 2250 క్యూసెక్కుల నీటి నీ కేసీ కేనాల్ కు విడుదల చేపించడం సంతోషంగా ఉందని భూమా అన్నారు.



# వాల్మీకి(బోయ)లను ఎస్టీ జాబితాలో చేర్చండి

**- అసెంబ్లీలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**



పుట్టపర్తి, (చైతన్యరథం): రాయలసీమలో కనీసం జీవనం గడవడానికి ఇబ్బంది పడుతూ అత్యంత వెనుకబడిన వాల్మీకి (బోయ) కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. శాసనసభ సమావేశాల సందర్భంగా గురువారం అసెంబ్లీలో జరిగిన జీరో అవర్‌లో వాల్మీకి వెనుకబాటుతనంపై ప్రస్తావిస్తూ వారిని ఎస్టీ జాబితాలోకి కేంద్ర ప్రభుత్వం చెర్చేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా సభ ద్వారా విన్నవించారు. రాష్ట్రంలో ఉన్న వాల్మీకి బోయ కుటుంబాల వారు రాయలసీమ ప్రాంతంలో నిరుద్యోగపరంగా మరియు అన్ని రంగాల్లో ఎంతో వెనుకబడి ఉన్నారని అలాంటివారు చాలామంది ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం వలసలు వెళ్లారని ఎమ్మెల్యే సభ దృష్టికి తీసుకొచ్చారు కనీసం వీరిని ఎస్టీ జాబితాలోకి చేరిస్తే వారి జీవన ప్రమాణాలు ఆర్థిక స్థితిగతులు మెరుగవుతాయని తెలిపారు రాష్ట్రంలో తూర్పు పశ్చిమ శ్రీకాకుళం విజయనగరం ప్రాంతాల్లో ఉన్న వాల్మీకులు ఎస్టీ జాబితాలో ఉన్నారని రాయలసీమలో ఉన్న వాల్మీకి బోయ కుటుంబాలు బీసీ జాబితాలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి వెల్లడించారు. అదేవిధంగా పక్కన ఉన్న కర్ణాటకలో వాల్మీకులు (బోయ) ఎస్టి జాబితాలో ఉన్నారని తెలిపారు. 2014 టిడిపి అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని ఆలోచనతో సత్యపాల్ కమిటీ వేశారని తెలిపారు అంతేకాకుండా వాల్మీకి బోయ కులస్తులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి అప్పటి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ఆమోదం కోసం పంపారని అది ఇప్పటివరకు నెరవేరలేదని ఎమ్మెల్యే సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం కేంద్రంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉందని ఇప్పటికైనా వాల్మీకి బోయ కులస్తులను ఎస్టీ జాబితాలోకి చేర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సభ ద్వారా కోరారు.

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అడిగిన ప్రశ్నకు రాష్ట్ర మంత్రి అచ్చెం నాయుడు సమాధానం ఇస్తూ, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వాల్మీకి బోయ కులస్తులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని అంశం చాలా మంచి విషయాన్ని అడిగారని మంత్రి అభినందించారు . ఇది గత టిడిపి హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపి అప్పటి మంత్రి కాల్వ శ్రీనివాసులు ఢిల్లీలో ఈ విషయంపై అప్పటి కేంద్ర మంత్రులతో తీవ్ర ప్రయత్నాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు . టిడిపి ఓడిపోయి వైసిపి అధికారంలోకి రావడంతో అది మరుగున పడింది అన్నారు. ప్రస్తుతం ఈ కూటమి ప్రభుత్వం ఆ కులాన్ని ఎస్టీ జాబితాలోకి చేర్చాలని ఎన్డీఏ ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చి వారి చిరకాల కోరిక నెరవేరేలా చర్యలు తీసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు.

# అసెంబ్లీలో తొలిసారి వాణి వినిపించిన ఎమ్మెల్యే దగ్గుపాటి

**- డంపింగ్ యార్డ్ కోసం స్థలం కేటాయించాలని విజ్ఞప్తి**

**- అక్టోబర్ 2లోపు డంపింగ్ యార్డ్ క్లియర్ చేస్తున్నందుకు కృతజ్ఞతలు**

అనంతపురం, (చైతన్యరథం): అసెంబ్లీలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తొలిసారి ప్రజా వాణిని వినిపించారు. ప్రస్తుతం బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో నగరానికి పెద్ద సమస్యగా మారిన డంపింగ్ యార్డ్ గురించి ప్రస్తావించారు. ఈ సమావేశాల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తొలిసారే ప్రజల ఇబ్బందులను సభ దృష్టికి తీసుకెళ్లారు. నగరంలో 4లక్షల 90వేల జనాభా ఉందని.. ప్రతి ఏటా 2.5శాతం జనాభా పెరుగుతోందన్నారు. 50డివిజన్లు, 4పంచాయతీలు ఉన్నాయన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న డంపింగ్ యార్డ్ 20ఏళ్ల క్రితం నగర శివారులో ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం నగరం విస్తరించడం వలన డింపింగ్ పూర్తిగా కాలనీల్లో కలిసిపోయిందన్నారు. దీని వలన చుట్టు ప్రక్కల కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉండటం వలన ప్రమాదాలు కూడా జరుగుతున్నాయన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టికి కూడా తీసుకెళ్లామని.. వచ్చే అక్టోబర్ 2 నాటికి డింపింగ్ యార్డును క్లియర్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే ఈ డంపింగ్ యార్డును నగరానికి దూరంగా తరలించేందుకు నగరానికి సమీపంలో స్థలం కేటాయించాలన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి దీనిపై స్పందించి..



50ఎకరాలు స్థలం కేచాయించి డంపింగ్ యార్డ్ సమస్యకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

# 15లోపు పెండింగ్ అర్జీలను పరిష్కరించాలి

- **పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను పరిష్కరించాలి**
- **తహశీల్దార్లకు జాయింట్ కలెక్టర్ ఆదేశం**



పుట్టపర్తి, (చైతన్యరథం): రెవిన్యూ సదస్సులలో ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలతో పాటుగా పిజిఆర్ఎస్‌లో వచ్చిన సమస్యల ఆర్జీలను క్యాలిటితో పరిష్కరించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలోపి జి.ఆర్.ఎస్‌లో వచ్చిన అర్జీల పరిష్కరం, వెబ్ ల్యాండ్ పెండింగ్ ఫైల్స్‌పై ఆర్డీఓలు, మండల తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌లు, మండల సర్వేయర్లతో ఓరింటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 2024 డిసెంబర్ నుండి 2025 జనవరి 8 వరకు జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూములకు సంబంధించి వచ్చిన అర్జీలను, పిజిఆర్ఎస్‌లో వచ్చిన సమస్యల అర్జీలను పెండింగ్ లేకుండా ఈ నెల 15లోపు పరిష్కారం చేయాలని తహశీల్దార్లును ఆదేశించారు.

తహశీల్దార్లు ప్రతి అర్జీని పరిశీలించి ఎండార్స్మెంట్లను ఇవ్వాలన్నారు. సంబంధిత ఆర్డీఓలు వారి పరిధిలోని మండలాలలో పర్యటించి ఎండార్స్మెంట్లను పరిశీలించాలని ఆర్డీఓలను ఆదేశించారు. రీ ఓపెన్‌కి అవకాశం లేకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. రెవెన్యూ, పి జి ఆర్ ఎస్ లో వచ్చిన అర్జీల పరిష్కారానికి తహశీల్దార్లు పరసనల్‌గా మండల పరిధిలో పర్యటించి, ఆర్జీదారులు బయట ఉన్నారు వారి వద్ద సరైన పత్రాలు ఉన్నాయా లేదాని రెండు, మాడు సార్లు నోటీసులు అందజేయాలన్నారు. ఈ నెల 15 లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధించిన అధికారులను ఆదేశించారు.

ఫైల్ పెండింగ్స్ లేకుండా చూడాలన్నారు.

ప్రతి సోమవారం మండల ప్రధాన కేంద్రంలో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో 75నుండి 150 వరకు అర్జీలు వస్తున్నాయని తెలిపారు. రిజిస్టర్ నందు నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి సంబంధిత ఆర్డీవోలు, ఎమ్మార్వోలు పాల్గొన్నారు

# దేశంలో స్లీపర్ సెల్స్, ఉగ్రదాడులు అదృశ్యం: ప్రధాని మోదీ



భారత్ విజయాలు ప్రపంచానికి కొత్త ఆశలు రేకెత్తించాయని, భారత్ నేడు ప్రపంచ వృద్ధిని నడిపిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భద్రతపై తమ ప్రభుత్వం ఎంతో శ్రద్ధ చూపుతోందన్న మోదీ.. దేశంలో స్లీపర్‌సెల్స్, ఉగ్రదాడులు అదృశ్యమయ్యాయని చెప్పారు. నక్సలిజం కూడా తుది అంకానికి చేరుకుందన్నారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ప్రసంగించిన మోదీ.. దేశానికి యువత ఎక్స్-ఫ్యాక్టర్ వంటిదన్నారు.

"భద్రతపై తమ ప్రభుత్వం ఎంతో శ్రద్ధ చూపుతోంది. గ్రామాల్లో నక్సలిజం తుడిచిపెట్టుకుపోతుంది. కానీ, పట్టణ ప్రాంతాల్లో మాత్రం ఇది వేగంగా వ్యాపిస్తోంది. కొన్ని రాజకీయ పార్టీల మాటలు నక్సలిజం భావజాలాన్ని ప్రతిబింబిస్తున్నాయి. దేశంలో స్లీపర్‌సెల్స్, ఉగ్రదాడులు అదృశ్యమయ్యాయి. నక్సలిజం కూడా తుది అంకానికి చేరుకుంది. దేశానికి యువత ఎక్స్-ఫ్యాక్టర్ వంటిది. ఎక్స్ అంటే ఎక్స్‌పెరిమెంట్, ఎక్సలెన్స్, ఎక్స్‌పాన్షన్ అని అర్థం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ తుంగలో తొక్కిందని.. ప్రజలు కూడా ఆ పార్టీ నుంచి ఏమీ ఆశించడం లేదన్నారు.

# సుంకాలపై అమెరికాతో పీయూష్ గోయల్ చర్చలు

## - కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్




విశాఖపట్నం: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయంతో సుంకాలు పెరిగే అవకాశం ఉందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. భారత్‌పై అమెరికా ప్రతీకార సుంకాల విధింపుపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. సుంకాల విషయమై చర్చలకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అమెరికా వెళ్లారని తెలిపారు. అమెరికా వాణిజ్య విభాగంతో ఆయన చర్చలు జరుపుతున్నారని చెప్పారు. భారత్ ఎగుమతుల విషయాన్ని దృష్టిలో ఉంచుకుని చర్చలు ఉంటాయన్నారు. విశాఖలో గురువారం కేంద్ర బడ్జెట్‌పై నిర్వహించిన చర్చలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, వివిధ వ్యాపార వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో నిర్మలా సీతారామన్ మాట్లాడారు. బడ్జెట్ ప్రవేశ పెట్టిన తర్వాత దేశవ్యాప్తంగా చర్చలు నిర్వహిస్తున్నామన్నారు. మొదట ముంబాయిలో, రెండో చర్చ విశాఖలో నిర్వహించామన్నారు. బడ్జెట్‌పై వివిధ వర్గాల ప్రజలను కలిసి వారి సలహాలు, సూచనలు తీసుకుంటున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న వ్యాపారవేత్తలు, చార్టెడ్ అకౌంటెంట్లు, లాయర్లు, వ్యాపార సంఘాల నుంచి సలహాలు, సూచనలు తీసుకొని బడ్జెట్‌లో మార్పులు చేస్తామని స్పష్టం చేశారు. ఏటా బడ్జెట్ ప్రవేశపెట్టిన తరువాత మధ్యలో గడువు ఉంటుంది. మళ్లీ పార్లమెంట్ మొదలయ్యాక దీనిపై చర్చ జరుగుతుంది. ఆ తర్వాత బడ్జెట్‌ను ఆమోదిస్తారు. ముఖ్యమైన అభిప్రాయాలు, సూచనలొస్తే సవరణలు చేసి బడ్జెట్‌ను ఆమోదిస్తారని తెలిపారు.

పోలవరం ప్రాజెక్టుకి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు వెల్లడించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఎక్కువ మొత్తం కేటాయించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అమరావతి రాజధానికి కూడా సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్రం, రాష్ట్రం కలిసి చేస్తున్న అన్ని ప్రాజెక్టులకు లోటు లేకుండా కేటాయింపులు చేస్తున్నట్లు తెలిపారు. విభజన సమయంలో పోలవరం పూర్తి చేస్తామని హామీ ఇచ్చామని, ఖచ్చితంగా పోలవరం ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. గతంలో తాను పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురంలో నివసించి అక్కడ నీటి కష్టాలు అనుభవించినట్లు తెలిపారు. జల్ జీవన్ మిషన్ ద్వారా నేరుగా ప్రతి ఇంటికి మంచినీరు ఇచ్చే బృహత్తర ప్రాజెక్టును చేపడుతున్నామన్నారు. ఆత్మ నిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా లాంటి కార్యక్రమాలు చేపట్టకపోతే వినాయక చవితికి విగ్రహం తయారుచేసే మట్టిని కూడా ఇతర దేశాల నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చేదన్నారు.

ఉద్యోగులకు రూ. 12 లక్షల వరకు టాక్స్ కట్టే అవకాశం లేకుండా వెసులుబాటు ఇచ్చామన్నారు. సర్వీస్ సెక్టార్‌లో నిర్దిష్టమైన ఆదాయం వస్తుందని, ఇతర దేశాలు తరహాలో మన దేశం అభివృద్ధి చెందాలి అంటే ఆదాయ వనరులు పెంచుకోవాలని సూచించారు. మనం ఉపయోగించుకున్న వాటికే పన్ను చెల్లిస్తాం. కారు కొంటే దానిపైనే పన్ను చెల్లిస్తాం.. కొనని వారు చెల్లించరు. రోడ్డు వినియోగించుకున్న వారే టోల్ ట్యాక్స్ చెల్లిస్తారు. ప్రజలు పన్నులు చెల్లిస్తేనే రహదారులు నిర్మించగలిగేదని ఆర్థిక మంత్రి వివరించారు.

## ఐదేళ్ల చిన్నారిని కడతేర్చిన తండ్రి



వేలు పట్టి నడిపించాల్సిన నాన్నే.. కన్న కూతురిని కడ తేర్చాడు. అమాయకపు నవ్వు చూసి ఉప్పొంగాల్సిన తండ్రి తన చిన్నారిని దారుణంగా హత్య చేశాడు. మృతదేహాన్ని ముక్కలు చేసి.. తప్పించుకునేందుకు పథకం వేశాడు. చివరికి ఆ నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్‌లో చోటు చేసుకుంది.

సీతాపురకు చెందిన మోహిత్ మిశ్రా (40) తన ఐదేళ్ల కూతురిని అతి దారుణంగా హత్య చేశాడు. తొలుత ఊపిరాడకుండా చేసి చంపేశాడు. ఆపై మృతదేహాన్ని నాలుగు ముక్కలు చేశాడు. తన కుమార్తె కనిపించడం లేదంటూ ఏమీ తెలియనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరుసటి రోజే ఓ ప్రాంతంలో చిన్నారి శరీర భాగాలు లభ్యం అయ్యాయి. తొలుత గుర్తు తెలియని జంతువు దాడిగా అనుమానించారు. ఈ ఘటన గత నెలలో జరిగింది.

పోస్టుమార్టం రిపోర్టులో ఆమె ఊపిరి ఆడక మరణించినట్లు తేలింది. తండ్రిని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పక్కింటి వారితో మోహిత్‌కు కొంతకాలంగా గొడవలు కొనసాగుతున్నాయి. అయితే.. తన కుమార్తె వారి ఇంటికి తరచూ వెళుతోందనే కోపంతో ఈ దారుణానికి పాల్పడినట్లు అంగీకరించాడు. చిన్నారిని నిర్మానుష ప్రాంతానికి తీసుకెళ్లి గొంతు నులిమి ప్రాణాలు తీశాడని.. ఆ తర్వాత చిన్నారిని ముక్కలుగా నరికి అక్కడే పడేసినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

# ఉదయనిధికి సుప్రీంలో స్వల్ప ఊరట

## కొత్త కేసులు నమోదు చేయొద్దని ఆదేశం



తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. సనాతన ధర్మంపై స్టాలిన్ చేసిన వ్యాఖ్యల అంశాన్ని నేపథ్యంగా తీసుకొని ఆయనపై కొత్త కేసులు నమోదు చేయొద్దని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది.

సనాతన ధర్మంపై ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలపై ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదైన సంగతి తెలిసిందే. తాజాగా బిహార్‌లో ఇదే అంశంపై మరో కేసు నమోదైంది. స్టాలిన్ తరపు న్యాయవాది ఏఎం సింఘ్వీ ఈ విషయాన్ని అత్యున్నత న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. దీన్ని సుప్రీం తీవ్రంగా పరిగణించింది. సుపరశర్మతో సహా గతంలో ఇలాంటి కేసుల్లో సుప్రీం ఇచ్చిన తీర్పులను సింఘ్వీ ప్రస్తావించారు. దీనిపై మహారాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది స్పందిస్తూ.. ఉప ముఖ్యమంత్రి హోదా కలిగిన వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రస్తుతం ఈ కేసు హోదాపై తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇక, ఈ కేసులో ఉదయనిధికి గతంలో మంజూరుచేసిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది.

2023 సెప్టెంబరులో జరిగిన ఓ కార్యక్రమంలో ఉదయనిధి మాట్లాడుతూ.. "సనాతన ధర్మాన్ని నిర్మూలించాలి" అంటూ వ్యాఖ్యానించారు. ఇది సామాజిక న్యాయానికి వ్యతిరేకమన్నారు. అనంతరం తన వ్యాఖ్యలు ఎవరి మనోభావాలు దెబ్బతీసే ఉద్దేశంతో చేసినవి కావని పేర్కొన్నప్పటికీ.. హిందూ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ క్రమంలోనే ఉదయనిధిపై మహారాష్ట్ర, బిహార్, జమ్మూ, కర్ణాటకతో సహా పలు రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి.

# ఛత్తీస్ గఢ్‌లో అంతుపట్టని వ్యాధి ?

## - ఒక నెలలోనే 13 మంది మృతి



గుర్తుతెలియని వ్యాధితో ఛత్తీస్ గఢ్ సుక్మా జిల్లాలోని ఓ గ్రామంలో 13 మంది ప్రాణాలు కోల్పోయారంటూ వస్తోన్న వార్తలు కలకలం సృష్టిస్తున్నాయి. ఒక నెలలోనే ఆ మరణాలు సంభవించినట్లు వాటి సారాంశం. ఈ వార్త తెలియగానే వైద్యవిభాగం అప్రమత్తమైంది. ప్రభావిత గ్రామం ధనికోర్తాలో వైద్యసేవలు అందిస్తోంది. బాధితుల్లో ఛాతినొప్పి, విడవకుండా దగ్గు వంటి లక్షణాలు కనిపించాయి. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఒడిశా సరిహద్దుకు సమీపంలో ఉన్న ఆ గ్రామంలో దాదాపు ప్రతి ఇంటిలోని వ్యక్తులకు ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నట్లు వెల్లడించాయి.

ఈ మిస్టరీ వ్యాధి వార్తలపై సుక్మా ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కపిల్ దేవ్ కశ్యప్ మీడియాతో మాట్లాడారు. కొద్దిరోజులుగా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. "వారిలో ముగ్గురు వృద్ధాప్య సమస్యలతో చనిపోయారు. మిగతా ఇద్దరి మృతికి గల కారణాలను పరిశీలిస్తున్నాం" అని చెప్పారు. ఇప్పటివరకు గుర్తించిన దాని ప్రకారం.. వాతావరణంలో మార్పులు, మహువా పంట సేకరణ కారణాలు కావొచ్చని చెప్పారు. ఈ పంట సేకరణ నిమిత్తం గ్రామస్తులు రోజంతా అటవీ ప్రాంతంలోనే ఉంటారు. దాంతో వారు డీహైడ్రేషన్‌కు గురై, అనారోగ్యానికి పాలవుతున్నారని తెలిపారు.

## కోటి విలువైన జుట్టు దొంగతనం



సాధారణంగా దొంగలు బంగారం ఎత్తుకెళ్తారు.. డబ్బులు ఎత్తుకెళ్తారు. ఇందుకోసం బ్యాంకులు కొల్లగొట్టడం, ఇళ్లను లూటీ చేయడం, ఏటీఎం సెంటర్లను ఎత్తుకెళ్లడం చేస్తుంటారు. ఇలాంటి ఘటనలు నిత్యం ఎక్కడో చోట జరుగుతూనే ఉంటాయి. కానీ, ఈ దొంగలు కాస్త డిఫరెంట్. కాస్త కాదండోయ్.. పూర్తి డిఫరెంట్ అని చెప్పుకోవాలి. వీరు.. డబ్బులు ఎత్తుకెళ్లలేదు, బంగారం ఎత్తుకెళ్లలేదు. జుట్టు ఎత్తుకెళ్లారు. అవునండీ.. మీరు వింటున్నది నిజంగా నిజం. ఓ గోడౌన్ నుంచి భారీ ఎత్తున జుట్టు ఎత్తుకెళ్లారు. అయితే, దీని విలువ చాలా ఎక్కువే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పుడిదే సెన్సేషన్‌గా మారింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.

బెంగళూరులోని ఒక గోడౌన్‌లో నిల్వ ఉంచిన హ్యూమన్ హెయిర్(మనుషుల జుట్టు)ను దొంగల ముఠా దొంగిలించింది. ఎత్తుకెళ్లిన జుట్టు విలువ రూ.90 లక్షల నుండి రూ.1 కోటి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. చైనా, బర్మా, హాంకాంగ్‌లకు ఎగుమతి చేయడానికి గోడౌన్‌లో నిల్వ ఉంచిన జుట్టును ఆరుగురు సభ్యుల ముఠా దొంగిలించింది. ఫిబ్రవరి 28న వాహనంలో వచ్చిన వీరు.. గోడౌన్‌లో నిల్వ ఉంచిన జుట్టును ఎత్తుకెళ్లారు. ఈ దోపిడీ సీన్ అంతా సీసీటీవీ ఫుటేజీలో రికార్డైంది. ఈ ఫుటేజీ ఆధారంగా బెంగళూరు పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

వ్యాపారులు ఓ గోడౌన్‌లో భారీ స్థాయిలో హెయిర్‌ను నిల్వ చేశారు. వీటిని విగ్గులు తయారీ చేసే కంపెనీలకు విక్రయిస్తుంటారు. ఈ క్రమంలోనే.. చైనాకు చెందిన విగ్గుల తయారీ కంపెనీ ప్రతినిధులు కొందరు ఈ హెయిర్‌ను కొనుగోలు చేయడానికి సిద్ధపడ్డారు. ఇటీవలే వచ్చి.. స్టాక్‌ను చెక్ చేశారు కూడా. మరికొద్ది రోజుల్లో స్టాక్‌ను ఎగుమతి చేయాల్సి ఉంది. ఇంతలో దొంగల ముఠా ఈ జుట్టు నిల్వను దోచుకెళ్లారు. గోడౌన్ యజమానికి వెంకటరమణ ఈ చోరీని గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. జుట్టు చోరీ చేసిన ముఠాకు.. స్టాక్, దాని విలువ గురించి ముందే తెలిసి ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఇది సొంత మనుషులు చేసిన పనా.. ఇతరుల పనా అని తేల్చే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.



## అగ్నికీలల్లో ఒడిశా ఫిషింగ్ హార్బర్

ఒడిశాలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గురువారం రాత్రి పారాదీప్ ఫిషింగ్ హార్బర్లో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో సుమారు 30 బోట్లు దగ్ధమయ్యాయి. రూ.కోట్లలో ఆస్తి నష్టం వాటిల్లినట్టు అంచనా. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలు ఆర్పివేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

# 'భారత్'పై ఖలిస్థానీల దుశ్చర్య

## జై శంకర్ లండన్ పర్యటనలో ఘటన: ఖండించిన భారత్



భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ లండన్ పర్యటనలో భారీ భద్రతా వైఫల్యం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఓ దుండగుడు ఏకంగా మంత్రి కారువద్దకు అత్యంత సమీపంగా దూసుకొచ్చాడు. ఘటనను భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. "విదేశాంగ మంత్రి యూకే పర్యటన సందర్భంగా చోటుచేసుకున్న భద్రతా ఉల్లంఘన దృశ్యాలను మేం చూశాం. వేర్పాటువాదులు, తీవ్రవాదుల దుశ్చర్యలను, ప్రజాస్వామ్య స్వేచ్ఛ దుర్వినియోగం కావడాన్ని మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇలాంటి సందర్భాల్లో అతిథ్య దేశం తగిన చర్యలు తీసుకుంటుందని మేం ఆశిస్తున్నాం" అని విదేశాంగశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. లండన్‌లోని చాఠమ్ హౌస్‌లో పలు అధికారిక సమావేశాలు ముగించుకొని జైశంకర్ బయటకు వచ్చారు. ఆ సమయంలో కొంతమంది ఖలిస్థానీ అనుకూల వ్యక్తులు అక్కడ కలకలం సృష్టించారు. తమ జెండాలతో నిరసన తెలిపారు. ఆ సమయంలో ఓ దుండగుడు విదేశాంగ మంత్రి కారు వద్దకు దూసుకొచ్చాడు. అతడి చేతిలో భారత జాతీయ జెండా ఉండగా దాన్ని అవమానించేలా ప్రవర్తిస్తూ నినాదాలు చేశాడు. అప్రమత్తమైన లండన్ పోలీసులు వెంటనే అతడిని పట్టుకున్నారు. అతడితోపాటు మిగతా ఆందోళనకారులను అక్కడినుంచి తరిమికొట్టారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. మార్చి 4న యూకే పర్యటనకు వెళ్లిన జైశంకర్ 9వరకు అక్కడే ఉండనున్నారు.. ఇందులోభాగంగా బ్రిటన్ విదేశాంగ మంత్రితో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. వ్యూహాత్మక సహకారం, వాణిజ్యపరమైన చర్చలు, విద్య, సాంకేతికత, రాజకీయ రంగాల్లో పరస్పర సహకారంవంటి అంశాలపై వీరిద్దరూ చర్చించారు. ఈ సందర్భంగా 'ప్రపంచంలో భారతదేశ వృద్ధి.. పాత్ర అనే అంశంపై ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రసంగించారు.

ఘటనపై బ్రిటన్ ఏమన్నదంటే..

ఖలిస్థానీ అనుకూలవాదులు చేసిన హంగామా ఘటనను బ్రిటన్ విదేశాంగశాఖ తీవ్రంగా ఖండించింది. కేవలం శాంతియుత నిరసనలను అనుమతిస్తామని.. బెదిరింపు ధోరణి, అధికారిక కార్యక్రమాలకు ఆటంకం కలిగించే ప్రయత్నాలు ఆమోదయోగ్యం కాదని హెచ్చరించింది. "బ్రిటన్‌లో భారత విదేశాంగశాఖ మంత్రి పర్యటన సందర్భంగా ఛాఠమ్ హౌస్ వద్ద చోటుచేసుకున్న ఘటనను ఖండిస్తున్నాం. శాంతియుత నిరసన హక్కును బ్రిటన్ సమర్థిస్తున్నప్పటికీ... బెదిరింపు ధోరణి, అధికారిక కార్యక్రమాలకు ఆటంకం కలిగించే ప్రయత్నాలు ఆమోదయోగ్యం కాదు" అని బ్రిటన్ విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. అంతర్జాతీయ నియమాలకు అనుగుణంగా దౌత్యవేత్తలందరికీ రక్షణ కల్పించేందుకు తాము కట్టుబడి ఉన్నామని మెట్రోపాలిటన్ పోలీసులు పేర్కొన్నారు.

### అమెరికా-కెనడాల మధ్య
## వాణిజ్య యుద్ధమే: ట్రూడో



భారీస్థాయిలో ట్రంప్ సర్కార్ విధిస్తున్న సుంకాలపై కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ట్రంప్ చర్చలు నిర్మాణాత్మకంగా జరిగినప్పటికీ.. కెనడా- అమెరికాలు భవిష్యత్తులో వాణిజ్యయుద్ధంలో ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. సుంకాల అమలును నెలరోజులపాటు వాయిదా వేస్తామని అమెరికా సంకేతాలు ఇవ్వడం స్వాగతించదగిన విషయమన్నారు. అయినప్పటికీ.. ప్రతీకార సుంకాలు విధించే ప్రణాళికలో ఎటువంటి మార్పు లేదన్నారు.

"టారిఫ్‌పై ఇరు దేశాలు చర్చలు జరిపాయి. కార్మికులతోపాటు నిర్దిష్ట రంగాలపై వీటి ప్రభావం పడకుండా ఉండేందుకు సంప్రదింపులు కొనసాగుతున్నాయి. ఇదే సమయంలో కెనడా వస్తువులపై అమెరికా సుంకాలు ఎత్తివేసే వరకు ప్రతీకార సుంకాలపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు" అని కెనడా ప్రధాని ట్రూడో స్పష్టం చేశారు. కెనడా, మెక్సికోతోపాటు చైనాపై డొనాల్డ్ ట్రంప్ సుంకాలు విధించడం ఆయా దేశాలతో వాణిజ్య యుద్ధానికి కారణమైంది. దీంతో ఆయా దేశాలు ప్రతీకార సుంకాలు విధించే పనిలోపడ్డాయి. ఈక్రమంలో ట్రూడో ప్రతీకార సుంకాలపై అమెరికా అధ్యక్షుడు కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారంలో కొనసాగడానికి సుంకాల వివాదాన్ని ట్రూడో వినియోగించుకుంటున్నారని ఆరోపించారు. కెనడా ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయన్న విషయాన్ని తెలుసుకోవాలని తాను ప్రయత్నించినప్పటికీ.. అక్కడనుంచి ఎటువంటి సమాధానం రాలేదన్నారు.

### లక్షమంది భారతీయులకు
## 'బహిష్కరణ' ముప్పు!

అమెరికాలో అక్రమ వలసదారులపై కన్నెర్ర చేస్తున్న ట్రంప్ యంత్రాంగం... వీసా గడువు ముగిసిన వారిపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తోంది. ఇదే సమయంలో హెచ్-1బీ వీసాదారులకు సంబంధించిన అంశం అనేకమంది భారతీయులను కలవరపాటుకు గురిచేస్తోంది. సుమారు లక్షమందికిపైగా భారతీయులు అమెరికా బహిష్కరణ ముప్పు ఎదుర్కొంటున్నట్టు సమాచారం. డిపెండెంట్ వీసాతో తల్లిదండ్రులతో కలిసి వెళ్లగా.. వీరి వయసు 21 ఏళ్లు నిండటమే తాజా ఆందోళనకు కారణం. హెచ్1బీ వీసాదారుల పిల్లలు డిపెండెంట్ వీసా కింద అమెరికాకు వెళ్లవచ్చు. మైనర్‌గా వెళ్లిన వీరికి 21 ఏళ్లు నిండేవరకు ఈ వీసా పనిచేస్తుంది. అనంతరం కొత్త వీసా పునరుద్ధరణకు రెండేళ్ల గడువుంటుంది. ఇలా డిపెండెంట్ వీసా గడువు ముగింపు దశకు చేరుకున్న భారతీయ చిన్నారుల సంఖ్య దాదాపు 1.34 లక్షలుగా ఉన్నట్లు సమాచారం. వీసా గడువు ముగిసేవారు ఉన్నత చదువుల కోసం ఎఫ్-1 వీసా పొందే అవకాశం ఉన్నప్పటికీ.. ఇది అనేక సవాళ్లతో ముడిపడి ఉంది. అంతర్జాతీయ విద్యార్థుల కింద నమోదైతే స్కాలర్‌షిప్ సహా ఇతర ప్రభుత్వ సాయానికి దూరమవుతామనే ఆందోళన వారిలో నెలకొంది. అయితే, వీసా పునరుద్ధరణకు ఉన్న రెండేళ్ల సడలింపు నిబంధనపై న్యాయస్థానాలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు తాజా ఆందోళనకు కారణమవుతున్నాయి.

## ఆఫ్ఘాన్, పాక్‌పై అమెరికా ట్రావెల్ బ్యాన్

దేశీయంగా ఉద్యోగాల కోత, విదేశాలపై సుంకాల విధింపుతో దూకుడుగా వ్యవహరిస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. పలు దేశాలనుంచి వచ్చే వారిపైనా నిషేధం విధించేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఇందులోభాగంగా పాకిస్థాన్, అఫ్గానిస్థాన్లపై ట్రావెల్ బ్యాన్ విధించే అవకాశం ఉన్నట్టు సమాచారం. భద్రతా కారణాల దృష్ట్యా ట్రంప్ యంత్రాంగం ఈ నిర్ణయం తీసుకోనుందని, వచ్చేవారమే ఇది అమల్లోకి రానున్నట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. డొనాల్డ్ ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడైన సమయంలోనూ కొన్ని ముస్లిం దేశాల పౌరులను అమెరికాలోకి అనుమతించడంపై నిషేధం విధించారు. అనేక పరిశీలన అనంతరం 2018లో అక్కడి సుప్రీం కోర్టు కూడా ఆ నిర్ణయాన్ని సమర్థించింది. అయితే, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జో బైడెన్ సర్కార్.. ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేసింది. అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన ట్రంప్.. అనేక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకాలు చేశారు. ఇందులో అమెరికాలోకి ప్రవేశించే విదేశీయుల నుంచి జాతీయ భద్రతా ముప్పు పొంచి వుందా? అన్న విషయాన్ని ముందే గుర్తించే కార్యనిర్వాహక ఆదేశంపైనా సంతకం చేశారు. దీని ప్రకారం, పాక్షికంగా లేదా పూర్తిగా ప్రయాణ నిషేధం విధించాల్సిన దేశాల జాబితాను రూపొందించి మార్చి 12లోగా సమర్పించాలని కేబినెట్ సభ్యులను ఆదేశించారు. ఇందులో భాగంగా పూర్తిగా నిషేధం కోసం సిఫార్సు చేసిన జాబితాలో అఫ్గానిస్థాన్ ఉన్నట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ జాబితాలో పాకిస్థాన్‌ను కూడా చేర్చనున్నట్లు సమాచారం. అఫ్గాన్‌లో దాదాపు రెండు దశాబ్దాలపాటు ఉన్న అమెరికా సేనల కోసం పని చేసిన స్థానికులపై తాలిబన్లు ప్రతీకారం తీర్చుకోనున్నారనే భయాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో వేలాదిమంది అఫ్గాన్ పౌరులు అమెరికాలో శరణార్థులు లేదా ప్రత్యేక వలసవాదుల కింద వీసా పొందారు. ఒకవేళ నిషేధం అమల్లోకి వస్తే వీరందరిపై ప్రభావం చూపనుందని తెలుస్తోంది.

# క్రీవిపై రష్యా క్షిపణి దాడి



రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దిశగా ప్రయత్నాలు జరుగుతోన్న తరుణంలో జెలెన్ స్కీ స్వస్థలంపై క్షిపణి దాడి జరిగింది. రాత్రి సమయంలో క్రీవి రీహలోని హెూటల్‌పై రష్యా క్షిపణిదాడిలో నలుగురు మృతి చెందారు. హెూటల్లో తమ దేశ పౌరులతో పాటు అమెరికా, బ్రిటన్ జాతీయులున్నారని ఉక్రెయిన్ అధ్యక్షుడు వెల్లడించారు. ఘటనలో సుమారు 30మంది గాయపడగా.. పలువురి పరిస్థితి విషమంగా ఉంది. యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి ఉక్రెయిన్‌కు అమెరికా సాయం చేస్తోన్న సంగతి తెలిసిందే. అయితే ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాతనుంచి ఆ దేశంపట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు. రెండురోజుల వ్యవధిలోనే మిలిటరీ, ఇంటెలిజెన్స్ సాయాన్ని నిలిపివేశారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఘటన జరిగింది. ఈ క్రీవి రీహలోనే జెలెన్ స్కీ జన్మించారు. వైట్ హౌస్‌లో ఇటీవల యూఎస్, ఉక్రెయిన్ అధ్యక్షుల మధ్య జరిగిన చర్చ కాస్తా రసాభాసగా మారిన సంగతి తెలిసిందే. దాని తర్వాత మరోసారి అమెరికాతో తాము చర్చలకు సిద్ధమేనని జెలెన్ స్కీ వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే ఈసారి యూఎస్ పర్యటనలో ఆయనతోపాటు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కూడా వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. రష్యా చేస్తున్న యుద్ధానికి తెర దించడానికి శాంతి ఒప్పందం కుదర్చడం, దానికి బదులుగా ఉక్రెయిన్‌లోని అరుదైన ఖనిజాల తవ్వకానికి అనుమతించాలని అమెరికా చేసిన ప్రతిపాదనపై చర్చించడానికి జెలెన్ స్కీ శ్వేతసౌధానికి వచ్చి భంగపడటం తెలిసిందే.

# 25ఏళ్ల కసి, కోపం, పగతో టీమిండియా

## - ఫైనల్ రివెంజ్ కోసం వెయిటింగ్!




సరిగ్గా 25 ఏళ్ల క్రితం అంటే 2000వ సంవత్సరం. ఆ రోజు కూడా ఫైనల్ మ్యాచే, ప్రత్యర్థి న్యూజిలాండే. కానీ ఫలితం మాత్రం భారత జట్టుకు వ్యతిరేకం. అయితే ఇప్పుడా ఓటమికి కసి తీర్చుకునేందుకు సిద్ధమైంది టీమిండియా. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఫైనల్ లో కివీస్ తో తలపడనుంది. మార్చి 9 ఈ తుది పోరు జరగనుంది.

**ఇదేం తొలిసారి కాదు..**

అయితే భారత జట్టు, న్యూజిలాండ్ ఐసీసీ ఫైనల్స్‌లో తలపడటం ఇదేం తొలిసారి కాదు. గతంలో రెండు సార్లు ఫైనల్స్‌లో ఢీ కొన్నాయి. మొదటగా 2000 ఐసీసీ నాకౌట్ ట్రోఫీ ఫైనల్. ఈ పోరులో భారత్ పై న్యూజిలాండ్ విజయం సాధించింది. ఈ మ్యాచ్ లో క్రిస్ కెయిర్న్స్ అద్భుత సెంచరీతో (113 బంతుల్లో 102) మ్యాచ్ విన్నింగ్ నాక్ ఆడి విజయాన్ని లాగేసుకున్నాడు. అప్పుడు భారత జట్టుకు గంగూలీ సారథిగా వ్యవహరించగా, న్యూజిలాండ్ కు స్టీఫెన్ ఫ్లెమింగ్ సారథిగా వ్యవహరించాడు. మొదట భారత జట్టు 50 ఓవర్లలో 264/6 చేయగా.. అందులో గంగూలీ 117 శతకం బాదాడు. సచిన్ 69 పరుగులు చేశాడు. అయితే మిడిలార్డర్‌లో రాహుల్ ద్రావిడ్, వినోద్ కాంబ్లీ, యువరాజ్ సింగ్ విఫలయమ్యారు. అనంతరం భారత జట్టు నిర్దేశించిన లక్ష్యాన్ని కెయిర్న్స్ సాయంతో న్యూజిలాండ్ ఛేదించింది. అయితే ఈ టోర్నమెంట్ తర్వాత నుంచి ఇప్పటివరకు న్యూజిలాండ్ ఒక్క వైట్-బాల్ ఐసీసీ టైటిల్ కూడా సాధించలేదు. 2015, 2019 ప్రపంచ కప్ ఫైనల్స్‌కు చేరుకున్నప్పటికీ పరాజయాన్ని అందుకుంది.

**రెండో సారి ఎప్పుడంటే**

2021 ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ లోనూ న్యూజిలాండే విజయం సాధించింది. ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచింది. అలా రెండు సార్లు కివీస్‌పై ఐసీసీ టోర్నీల్లో మనం ఓడిపోయాం. దీంతో ఈ సారి ఎలాగైనా గెలిచి ప్రతీకారం తీర్చుకోవాలని భారత జట్టు పట్టుదలతో ఉంది.

**గ్రూప్ స్టేజ్‌లో ఇప్పటికే..**

ఈ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో గ్రూప్ స్టేజ్ ఆఖరి లీగ్ మ్యాచ్ లో కివీస్ - జట్టు తలపడ్డాయి. ఈ మ్యాచ్ లో భారతే గెలిచింది. కానీ న్యూజిలాండ్ మాత్రం మనోళ్లపై గట్టిగానే ఒత్తిడిని తీసుకొచ్చింది. కాబట్టి ఈ సారి కూడా ఫైనల్ లో కివీస్ ను తక్కువ అంచనా వేయలేం.

### ఆస్ట్రేలియాతో సెమీస్ మ్యాచ్..

# డ్రెస్సింగ్ రూంలో టెన్షన్: హార్దిక్ పాండ్య

ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ తొలి సెమీస్‌లో కంగారూలను భారత్ ఓడించిన విషయం తెలిసిందే. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 264 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు.. 48.1 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. విరాట్ కోహ్లి 84 పరుగులతో రాణించాడు. శ్రేయస్ అయ్యర్ (45), కేఎల్ రాహుల్ (42) సమయోచిత ఇన్నింగ్స్ ఆడారు. ఆఖర్లో హార్దిక్ పాండ్య (28) బ్యాట్ ఝుళిపించాడు. విజయం ఇరుజట్ల మధ్య దోబూచులాడిన సమయంలో 24 బంతుల్లోనే 28 పరుగులు చేశాడు. ఆడమ్ జంపా బౌలింగ్ లో వరుసగా కొట్టిన రెండు సిక్స్‌లు మ్యాచ్‌కే హైలైట్. ఇవే మ్యాచ్‌ను భారత వైపు తిప్పాయి.

**డ్రెస్సింగ్ రూంలో టెన్షన్..!**

హార్దిక్ పాండ్య క్రీజులోకి అడుగుపెట్టే సమయానికి భారత డ్రెస్సింగ్ రూంలో ఉత్కంఠ నెలకొని ఉంది. అక్కడి పరిస్థితుల గురించి మ్యాచ్ అనంతరం హార్దిక్, అక్షర్ పటేల్



మాట్లాడారు. 'బ్యాటింగ్‌కు వెళ్లేటప్పుడు నాలో నేను కాస్త నవ్వుకున్నాను. వరుసగా రెండు సిక్స్‌లు కొడతానని అస్సలు అనుకోలేదు. డ్రెస్సింగ్ రూంలో టెన్షన్ వాతావరణం ఉంటుందని నాకు తెలుసు' అని పాండ్య తెలిపాడు.

**స్ట్రైక్ రొటేట్ చేయండి..**

అక్షర్ పటేల్ మాట్లాడుతూ.. "అందరి ముఖాల్లో కాస్తంత ఆందోళన నెలకొని ఉంది. హార్దిక్, రాహుల్లు స్ట్రైక్ రొటేట్ చేస్తూ ఉండాలని అన్నారు. కానీ, నాకు హార్దిక్‌పై నమ్మకం ఉంది. ఆ సమయంలో నా చుట్టూ ఉన్న వాతావరణాన్ని ఆసక్తిగా గమనించాను" అని వెల్లడించాడు.

**నా మీద ఒత్తిడి తగ్గింది..**

"కీలక సమయంలో క్రీజులోకి వచ్చిన హార్దిక్ సిక్స్‌తో విరుచుకుపడ్డాడు. దీంతో నా మీద ఒత్తిడి తగ్గింది. ఉత్కంఠభరితమైన మ్యాచ్ గెలిచినందుకు చాలా సంతోషంగా ఉంది" అని కేఎల్ రాహుల్ ఆనందం వ్యక్తం చేశాడు.

ఆసీస్ మీద విజయంతో టీమ్ ఇండియా ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. మార్చి 9న దుబాయ్ వేదికగా కివీస్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించి టీమ్ ఇండియా ట్రోఫీని కైవసం చేసుకోవాలని యావత్ భారత కోరుకుంటోంది.

### సన్‌రైజర్స్ టికెట్స్ బంపర్ ఆఫర్..

# రెండు కొంటే ఒకటి ఫ్రీ!

ఐపీఎల్ 2025 సీజన్ మరో 16 రోజుల్లో ప్రారంభం కానుంది. ప్రతి మ్యాచ్ రసవత్తరంగా సాగేలా.. అభిమానులను ఉర్రూతలూగించేందుకు సిద్ధమవుతోంది. సీజన్ ప్రారంభానికి సమయం దగ్గర పడుతోన్న నేపథ్యంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్యాన్స్ కు అదిరే సర్ ప్రైజ్ ఇచ్చింది.

హైదరాబాద్ లో జరిగే తొలి రెండు మ్యాచులకు సంబంధించిన టికెట్లను అందుబాటులో తీసుకురానున్నట్లు తెలిపింది. మార్చి 7 నుంచి టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండనున్నట్లు సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించింది. ఉదయం 11 గంటల నుంచి అమ్మకాలను ప్రారంభించనున్నట్లు తెలిపింది. 23న సన్ రైజర్స్ వర్సెస్ రాజస్థాన్ రాయల్స్, 27న సన్ రైజర్స్ వర్సెస్ లఖ్ నవూ సూపర్ జెయింట్స్ మ్యాచులు జరగనున్నాయి. ఈ మ్యాచులకు సంబంధించిన టికెట్లనే మార్చి 7న విక్రయించనున్నారు. రెండు టికెట్లు కొంటే ఒక జెర్సీగా ఫ్రీగా ఇవ్వనున్నట్లు కూడా సన్ రైజర్స్ తెలిపింది.

కొనుగోలు చేసిన ఆటగాళ్లు: ఇషాన్ కిషన్ (రూ.11.25 కోట్లు), మహ్మద్ షమి (రూ.10 కోట్లు), హర్షల్ పటేల్ (రూ.8 కోట్లు), అభినవ్ మనోహర్ (రూ.3.20 కోట్లు), రాహుల్ చాహర్ (రూ.3.20 కోట్లు), ఆడమ్ జంపా (రూ.2.40 కోట్లు), సిమర్‌జీత్ సింగ్ (రూ.1.50 కోట్లు), ఎషన్ మలింగ (రూ.1.20 కోట్లు), బ్రైడన్ కార్సే (రూ.కోటి), జయ్‌దేవ్ ఉనద్కత్ (రూ.కోటి), కమిందు మెండిస్ (రూ.75 లక్షలు), జీషాన్ అన్సారీ (రూ.40 లక్షలు), సచిన్ బేబి(రూ.30లక్షలు), అంకిత్ వర్మ (రూ.30 లక్షలు), అథర్వ తైడే (రూ.30 లక్షలు).

**రిటైన్ చేసుకున్న ఆటగాళ్లు:** క్లాసెన్(రూ.23కోట్లు), కమిన్స్(రూ.18కోట్లు), అభిషేక్ (రూ.14కోట్లు), హెడ్(రూ.14కోట్లు), నితీశ్ కుమార్(రూ.6కోట్లు)




## ఐపీఎల్‌లో అతనే అత్యంత ఖరీదైన ప్లేయర్

తన బ్యాటింగ్ తో ప్రత్యర్థులను భయపెట్టే ప్లేయర్ అతడు, జట్టును గెలిపించగలిగే ఇన్నింగ్స్ ఆడే సత్తా ఉన్న ఆటగాడు అతడు, ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధరకు అమ్ముడుపోయిన క్రికెటర్ అతడు, బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో టాప్ బ్యాటర్స్ కోహ్లి, రోహిత్ విఫలమైనా తన బ్యాట్‌తో మంచిగా రాణించాడతడు. అలాంటి అద్భుత ట్రాక్ రికార్డ్ ఉన్న ప్లేయర్‌కు ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో అవకాశం ఇవ్వకపోవడం, బెంచ్ కే పరిమితం చెయ్యడం క్రికెట్ అభిమానుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే అర్థమైపోయి ఉంటుంది కదా.. ఎవరి గురించి మాట్లాడుకుంటున్నామో.. అతడే భారత స్టార్ వికెట్ కీపర్ కమ్ బ్యాటర్ రిషభ్ పంత్.

ప్రస్తుతం జరుగుతోన్న ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో టీమిండియా అద్భుత ప్రదర్శన చేసి ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీస్‌లో ఆస్ట్రేలియాను ఓడించి తుది పోరుకు అర్హత సాధించింది. దీంతో టైటిల్ పోరులో న్యూజిలాండ్ తో తలపడనుంది. అయితే ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో ఆటగాళ్ల ప్రదర్శన ఎలా ఉందనే విషయం కాసేపు పక్కనపెడితే.. క్రికెట్ అభిమానులంతా చర్చల్లా రిషభ్ పంత్ గురించే ఎక్కువ సాగుతోంది. అసలు అతడిని తుది జట్టులోకి ఎందుకు తీసుకోలేదనే ప్రశ్నఅభిమానుల మనసులో తెగ తిరుగుతోంది. పోనిలే ఏదో ఒక్క మ్యాచ్ కే తీసుకోలేదు కదా అని అనుకోవడానికి లేదు. సెమీస్ కూడా అయిపోయింది, ఇక మిగిలిందల్లా ఫైనల్ ఒక్కటే. కనీసం అందులోనైనా పంత్ ను ఆడిస్తారా లేదా అనేది ప్రస్తుతం అభిమానుల్లో అనుమానంగానే ఉంది.

**కేఎల్ రాహుల్ వర్సెస్ పంత్..**

వాస్తవానికి ఈ ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం నుంచి కేఎల్ రాహుల్ వర్సెస్ పంత్ పోటీ కొనసాగుతూనే ఉంది. వీరిద్దరిలో ఒకరినే తీసుకునే అవకాశం ఉండడంతో స్క్వాడ్ సెలక్షన్ విషయమై గంభీర్ - అజిత్ అగార్కర్ మధ్య మనస్పర్థలు కూడా వచ్చినట్లు వార్తలు వచ్చాయి. కానీ ఫైనల్ గా గంభీర్.. కాంబినేషన్స్ నేపథ్యంలో కేఎల్ రాహులే నెం.1 వికెట్ కీపర్ అంటూ అతడికే అవకాశం కల్పించాడు. అన్నీ మ్యాచుల్లోనూ అతడితోనే ఆడించాడు. పంత్ కు కనీసం ఒక్క అవకాశం కూడా ఇవ్వలేదు. మరి అన్ని మ్యాచులు ఆడిన కేఎల్ రాహుల్.. అంచనాలకు తగ్గట్టుగా ఆడాడా అంటే పర్వాలేదనిపించాడనే చెప్పాలి. కానీ అభిమానులు, పలువురు మాజీలు మాత్రం పంత్ ను తీసుకుని ఉంటే బాగుండేదని అభిప్రాయపడుతున్నారు. కనీసం ఒక్క మ్యాచ్ అయినా ఆడనివ్వకుండా ఎందుకు పక్కన పెట్టారని ప్రశ్నిస్తున్నారు.

కాగా, ఐపీఎల్ 2025 సీజన్ లోనే అత్యంత ఖరీదైన ఆటగాడిగా రిషభ్ పంత్ రికార్డ్ క్రియేట్ చేశాడు. అతడిని రూ. 27 కోట్లకు లఖ్ నవూ సూపర్ జెయింట్స్ కొనుగోలు చేసింది. దీంతో అతడు ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధరకు అమ్ముడుపోయిన క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు.

# సారీ.. థాంక్స్.. దిల్‌రూబా!

'క' తర్వాత నటుడు కిరణ్ అబ్బవరం నటించిన కొత్త చిత్రం 'దిల్ రూబా'. విశ్వకరుణ్ దర్శకుడు. రుక్సర్ థిల్లాన్ కథానాయిక. మనసుని హత్తుకునే ప్రేమ కథతో ఇది రూపొందుతున్నట్టు సమాచారం. మార్చి 14న విడుదలవుతున్న నేపథ్యంలోనే చిత్రబృందం తాజాగా 'దిల్ రూబా' ట్రైలర్‌ను విడుదల చేసింది. నటీనటుల పాత్రలను పరిచయంచేస్తూ ట్రైలర్ సాగింది. "తప్పు చేసిన తర్వాత చెప్పే సారీకి.. అవసరం తీరాక చెప్పే థాంక్స్‌కి నా దృష్టిలో విలువలేదు"అని కిరణ్ అబ్బవరం చెప్పే డైలాగులతో ప్రారంభమైన ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకునేలా ఉంది. ప్రేమికుడిపాత్రలో కిరణ్‌అబ్బవరం యాక్టింగ్, యాక్షన్ సీక్వెన్స్‌లు అలరిస్తాయన్న నమ్మకాన్ని వ్యక్తంచేస్తోంది చిత్ర బృందం.

## 'అది దా సర్‌ప్రైజు' ఎప్పుడంటే..?



హీరో నితిన్ లేటెస్ట్ మూవీ 'రాబిన్‌హుడ్'కు ఆడియన్స్‌లో బజ్ క్రియేటైంది. దర్శకుడు వెంకీ కుడుముల తెరకెక్కిస్తున్న మూవీపై ప్రేక్షకుల్లో పాజిటివ్ వైబ్ ఉంది. మూవీనుంచి రిలీజ్ అయిన పోస్టర్స్, టీజర్, సాంగ్స్ ప్రేక్షకుల్లో అంచనాలను రెట్టింపు చేశాయి. తాజాగా ఈ సినిమాలోని 'అది దా సర్‌ప్రైజు' అంటూ సాగే మాస్ సాంగ్‌ను మార్చి 10న రిలీజ్ చేస్తున్నట్టు మేకర్స్ వెల్లడించారు. సాంగ్‌లో హాట్ బ్యూటీ కేతిక శర్మ తన గ్లామర్ షోతో పాటు అదిరిపోయే స్టెప్పులతో ప్రేక్షకులను ఆకట్టుకోనుంది. యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా భారీ తారాగణం కనిపించనున్నారు. జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతం సమకూరుస్తుంటే.. మైత్రీ మూవీ మేకర్స్ ప్రొడ్యూస్ చేస్తున్న చిత్రం మార్చి 28న గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమైంది.

## నాని జడల వెనుక..
# ఓ భావోద్వేగముంది



వైవిధ్యమైన కథలు ఎంచుకుంటూ వరుస విజయాలను తన ఖాతాలో వేసుకుంటున్న నాని లీడ్ రోల్‌లో దర్శకుడు శీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న చిత్రం 'ది ప్యారడైజ్'. ఇటీవల ఊరమాస్ లుక్కులో రిలీజ్ చేసిన నాని గెటప్ అందరినీ ఆశ్చర్యపరిచింది. రెండు జడలు వేసుకొని ఉన్న ఫొటోపై సోషల్ మీడియాలో పెద్ద చర్చే జరిగింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రీకాంత్ ఓదెల నాని హెయిర్ స్టయిల్‌పై స్పందించారు. నాని లుక్ వెనక ఎమోషన్ దాగిఉందని శ్రీకాంత్ ఓదెల అన్నారు. "దీనిగురించి ఇప్పుడే వెల్లడించకూడదు. కానీ, ఒక విషయం చెప్పాలనుకుంటున్నా. నాని జడల వెనక నా వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ భావోద్వేగం దాగి ఉంది. నా చిన్నతనంలో మా అమ్మ నాకు అలానే జడలు వేసేది. ఐదోతరగతి వరకు జుట్టు అల్లి స్కూలుకు పంపేది. ఈ లుక్ సినిమా కథకు ఎలా కనెక్ట్ అవుతుందని మాత్రం ఇప్పుడే చెప్పను' అన్నారు. ఇదే ఇంటర్వ్యూలో నాని గురించి మాట్లాడుతూ ప్రశంసలు కురిపించారు. ఎలాంటి పాత్రలోనైనా ఒదిగిపోయే నటుడన్నారు. సెట్లోకి రాగానే పాత్రలో లీనమవుతారని చెప్పారు. 'దసరా' సినిమాతో సూపర్ హిట్ అందుకున్న నాని -శ్రీకాంత్ ఓదెల కాంబోలో 'ది ప్యారడైజ్' రానుంది. తిరుగుబాటు, నాయకత్వంతోపాటు తల్లీకొడుకుల అనుబంధం కథకు కీలకంగా నిలవనున్నట్టు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతుంది. సినిమా తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ, బెంగాలీ భాషలతోపాటు ఇంగ్లిష్, స్పానిష్‌లాంటి విదేశీ భాషల్లోనూ ఒకేసారి విడుదల కానుంది.





# నయన్ మారిందా?

నటి నయనతార కొత్త సినిమా 'మూకుతీ అమ్మన్ 2' తాజాగా ప్రారంభమైంది. చెన్నైలో ఏర్పాటుచేసిన భారీ సెట్‌లో పూజా కార్యక్రమం గురువారం వేడుకగా జరిగింది. దర్శకుడు సుందర్.సితోపాటు నయనతార, మీనా, ఖుష్బూ, రెజీనా వేడుకలో సందడి చేశారు. దీనికి సంబంధించిన పలు వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. సాధారణంగా తన సినిమా పూజా కార్యక్రమం, ప్రమోషన్స్‌కు దూరంగా ఉండే నయనతార ఉన్నట్టుండి వేడుకలో పాల్గొనడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ఆమె నమస్కరిస్తోన్న వీడియోలు షేర్ చేసిన నెటిజన్లు.. "ఆమె నయనతారేనా.. ఇదేంటి కొత్తగా" అని మాట్లాడుకుంటున్నారు. 'మనస్సినక్కరే' అనే మలయాళ చిత్రంతో నటిగా ఎంట్రీ ఇచ్చారు నయనతార. సుమారు 22 ఏళ్ల కెరీర్‌లో ఆమె ఎన్నో విభిన్నమైన చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. ఎన్నో సినిమాల్లో నటించినప్పటికీ వాటి ప్రమోషన్స్‌కు మాత్రం ఆమె దూరంగానే ఉండేవారు. ప్రాజెక్టుపై సంతకం చేసినప్పుడే ప్రమోషన్స్‌కు రాననే విషయాన్ని టీముకు చెప్పేస్తారని ఇండస్ట్రీలో టాక్. ఈ నేపథ్యంలోనే తాజాగా జరిగిన సినిమా పూజా కార్యక్రమంలో ఆమె పాల్గొనడం వైరల్‌గా మారింది.



## 'జిగ్రా'.. ఇబ్బంది పెట్టలేదు



అలియాభట్, వేదాంగ్ రైనా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జిగ్రా'. బాలీవుడ్ దర్శకుడు వాసన్ బాలా తెరకెక్కించారు. ఎన్నో అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకువచ్చిన యాక్షన్ థ్రిల్లర్ బాక్సాఫీస్ వద్ద అనుకున్న ఫలితాన్ని అందుకోలేకపోయింది. తాజాగా దీనిపై అలియా తొలిసారి స్పందించారు. ఆ చిత్రం తన కల అని పేర్కొన్నారు. "నాకు నటనపై మక్కువ ఎక్కువ. ఇండస్ట్రీలో నటిగానే కాదు.. నిర్మాతగానూ కొనసాగుతున్నా. నా వర్క్‌కు సంబంధించి ఎన్నో కలలు ఉన్నాయి. వాటి కోసం మరింత కష్టపడతాను. సినిమా ఫలితాలు నన్ను ప్రభావితం చేయవు. వాటి కారణంగా ఆనందంగా లేనని అనుకోను. గతేడాది నేను నటించిన 'జిగ్రా' అనుకున్న స్థాయిలో ఆదరణ పొందలేదు. అది నా డ్రీమ్ ప్రాజెక్ట్. కొత్తగా ప్రయత్నించాను. ఫలితాన్ని చూసి నిరాశపడలేదు. మరింత ఉత్సాహంగా ముందుకుసాగుతున్నా. ఈ రంగంలో జయాపజయాలు సహజం"అన్నారు. ఈ ఏడాది తన కుమార్తె రాహాతో ఎక్కువసమయం గడపాలనుకుంటున్నట్టు అలియా తెలిపారు. సోలో ట్రిప్‌లకు ప్లాన్ చేసుకున్నట్టు చెప్పారు. తమ్ముడి కోసం అక్క చేసే పోరాటం నేపథ్యంలో 'జిగ్రా' తెరకెక్కింది. కరణ్ జోహార్ నిర్మాత. సినిమా రిలీజైనప్పుడు సోషల్ మీడియాలో రకరకాల వివాదాలు చుట్టుముట్టిన సంగతి తెలిసిందే. దర్శకుడు వాసన్ బాల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ స్క్రిప్ట్ విషయంలో కరణ్ తనపై అసహనం వ్యక్తం చేసినట్టు చెప్పారు.



# బ్రేకప్!

నటి తమన్నా, నటుడు విజయ్ వర్మ విడిపోయారంటూ ఆంగ్ల పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. రెండేళ్ల ప్రేమకు ఫుల్‌స్టాప్ పెట్టేసి.. ఇకపై స్నేహితులుగానే ఉండాలని నిర్ణయించుకున్నారట. తమన్నా,విజయ్‌వర్మ తమ రిలేషన్ కట్టవ్వడానికి కారణాలపై పలు కథనాలూ వచ్చాయి. కెరీర్, పెళ్లి విషయంలో వీరిద్దరి మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తాయని.. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని బీటౌన్ టాక్. 35ఏళ్ల వయసులో తమన్నా.. పెళ్లి చేసుకొని జీవితంలో సెటిల్ కావాలని నిర్ణయించుకున్నారని.. విజయ్ మాత్రం అందుకు సుముఖత వ్యక్తం చేయలేదని సమాచారం. ఆయన మాత్రం ప్రస్తుతానికి కెరీర్ పైనే దృష్టి పెట్టాలనుకున్నారని, అందుకే విడిపోయారని అనుకుంటున్నారు. 2023లో 'లస్ట్ స్టోరీస్ 2' కోసం తొలిసారి కలిసి వర్క్ చేశారు తమన్నా, విజయ్ వర్మ. ఈ సిరీస్ చిత్రీకరణ సమయంలోనే ప్రేమలో పడ్డారు. ఇదే విషయాన్ని పలు సందర్భాల్లో ఈ జంట బయటపెట్టింది. "నాకోసం ఒక అందమైన ప్రపంచాన్ని సృష్టించుకున్నా. నన్ను నన్నుగా అర్థం చేసుకునే వర్మ ఆ ప్రపంచంలోకి వచ్చాడు. తను నన్నెంతో అర్థం చేసుకున్నాడు. అన్ని విషయాల్లో గౌరవిస్తాడు" అంటూ అతనిపై ఇష్టాన్ని తమన్నా బయటపెట్టారు. అలాంటి వీరి బ్రేకప్ కథనాలు సినీ ప్రియులను ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి.